ఆదివారం 23-4-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 31



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాటిలేని వైద్య సాంకేతిక సదుపాయాలతో అగ్రపథం



న్యూరో నావిగేషన్



స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ క్యాథ్ ల్యాబ్




5008S
డయాలసిస్ మెషిన్



4K ఆర్థోస్కోపిక్ సిస్టమ్

450+ బెడ్స్



30 కి పైగా మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలతోఅందరికీ అందుబాటులో... ఇప్పుడు గచ్చిబౌలిలో

కార్డియాలజీ

డా. గణేష్ మాథన్
డా. నరేష్ కుమార్ ఎమ్
డా. సయ్యద్ అక్రమ్ అలీ

కార్డియాక్ సర్జరీ

డా. రవిరాజు సిహెచ్

న్యూరాలజీ

డా. విక్రమ్ శర్మ

న్యూరో సర్జరీ

డా. నరసింహారావు

నెఫ్రాలజీ విభాగం

డా. అరుణ్ కుమార్ డి

యూరాలజీ & ఆండ్రాలజీ

డా. రాహుల్ చేతన్ వి
డా. కార్తీక్ గణపతి

ఆర్థోపెడిక్స్

డా. ఆదిత్య కపూర్

గ్యాస్ట్రోఎంటరాలజీ

డా. రాఘవేంద్రరావు ఆర్ వి & టీమ్

పల్మనాలజీ

డా. ఎమ్ రఘు వంశీ

- క్రిటికల్ కేర్ & ఎమర్జెన్సీ
- పెయిన్ & ప్యాలియేటివ్ కేర్
- ట్రామా సెంటర్
- అనస్థీషియాలజీ
- రోబోటిక్ సర్జరీ
- ఇ ఎన్ టి
- ఎండోక్రైనాలజీ
- ప్లాస్టిక్ & రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ
- ఇంటర్వెన్షనల్ రేడియాలజీ
- జనరల్ మెడిసిన్ & డయాబెటాలజీ
- ఫీవర్ క్లినిక్
- పీడియాట్రిక్స్
- ఆబ్స్‌టెట్రిక్స్ & గైనకాలజీ
- డెర్మటాలజీ
- న్యూక్లియర్ మెడిసిన్
- హిమటాలజీ
- డెంటల్
- సైకియాట్రీ
- వ్యాస్కులార్ సర్జరీ
- ఫిజియోథెరపీ & రీహేబిలిటేషన్

మౌలిక సదుపాయాలు

- 3 టెస్లా ఎమ్ ఆర్ ఐ
- 320 స్లైస్ కార్డియాక్ సీటీ
- స్పెక్ట్ గామా కెమేరా
- లేజర్ సర్జరీలు
- స్కాల్ప్ కూలింగ్ సిస్టమ్
- ఆపరేటింగ్ మైక్రోస్కోప్ విత్ ఫ్లోరోసెన్స్
- డిజిటల్ యాంజియో ట్యాబ్
- డి ఎస్ ఎ ల్యాబ్
- 4 డీ అల్ట్రాసౌండ్
- హోల్టర్ మానిటరింగ్
- ఈఈజీ & ఈఎన్ఎమ్ జీ
- న్యూరోఫిజియాలజీ
- ఆడియోమెట్రీ
- యూరోడైనమిక్ స్టడీస్
- డైటెటిక్స్
- ఫార్మసీ
- అంబులెన్స్
- క్లినికల్ బయోకెమిస్ట్రీ
- మైక్రోబయాలజీ & వైరాలజీ
- క్లినికల్ ప్యాథాలజీ
- బ్లడ్ బ్యాంక్
- బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ సర్వీసెస్

Omega Hospitals
Gachibowli, Hyderabad

గచ్చిబౌలి మెయిన్ రోడ్, ఫ్లై ఓవర్ ప్రక్కన,
హైదరాబాద్ – 500032.

Call: +91-98480 11421 | 98490 22121 | 040-2555 2555
www.omegahospitals.com | info@omegahospitals.com

24x7 EMERGENCY
GACHIBOWLI, HYDERABAD


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'
పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 31
SUNDAY Special
ఆదివారం 23-4-2023




కర్ణాటకలో 'స్వింగ్' ఎటో?
కర్ణాటక అసెంబ్లీలో ఒకే పార్టీని వరసగా రెండోసారి గెలిపించే సంప్రదాయం లేని నియోజకవర్గాలు 84 ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో గెలుపే పార్టీల భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది..
- వివరాలు 6లో



సురేఖ 'డబుల్' ధమాకా
ప్రపంచకప్ ఆర్చరీ టోర్నమెంట్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచిన సురేఖ.
- వివరాలు 14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మోదీపై ఆత్మాహుతి దాడి చేస్తాం
ప్రధాని మోదీని సూసైడ్ బాంబర్‌తో చంపేస్తామన్న బెదిరింపులపై కేంద్ర నిఘా విభాగాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి.
- వివరాలు 6లో



అధికార నివాసం వీడిన రాహుల్
పరువు నష్టం కేసులో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీ శనివారం ఢిల్లీలోని తన అధికార నివాసాన్ని విడిచిపెట్టారు.
- వివరాలు 6లో



ఇస్రో సీ55 సక్సెస్..
ఇస్రో మరో ఘనతను సాధించింది. పీఎస్ఎల్వీ సీ55 ఉపగ్రహ వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించింది.
- వివరాలు 6లో




సెప్టెంబర్‌లో భారత్‌కు బైడెన్..
ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత్‌లో జరగనున్న జీ-20 సదస్సుకు హాజరు కావడానికి బైడెన్ సన్నాహాలు చేస్తున్నారని అమెరికా వెల్లడించింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సుప్రసిద్ధ సాహితీవేత్త రవ్వా శ్రీహరి కన్నుమూత


సుప్రసిద్ధ సాహితీవేత్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య రవ్వా శ్రీహరి(80) శుక్రవారంరాత్రి కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.
- వివరాలు 3లో

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయొద్దు


ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయొద్దని మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు.
- వివరాలు 7లో

ప్రీతి ఆత్మహత్య చేసుకోలేదు


పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకుందని శుక్రవారం సీపీ రంగనాథ్ ప్రకటించిన నేపథ్యంలో శనివారం ప్రీతి తండ్రి, సోదరుడు ప్రీతి కేసు విచారణ అధికారి ఏసీపీ బోనాల కిషన్‌ను కలసి ఆమె మృతిపై ఉన్న అనుమానాలను మరోసారి వ్యక్తం చేశారు.
- వివరాలు 5లో

బాబు కుట్ర బట్టబయలు


ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు చేసిన కుట్రలు, అకృత్యాలు బట్టబయలయ్యాయి. శాంతియుతంగా నిరసన వ్యక్తంచేస్తున్న దళితులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు రాళ్ల దాడిచేసి అడ్డంగా దొరికిపోయారు.
- వివరాలు 15లో



• ఈటల మాటలు.. రేవంత్ ఒట్లు..

ఘాటెక్కిన 'కోట్లా'ట

రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారిన 'మునుగోడు' డబ్బుల వ్యవహారం

ఉప ఎన్నిక జరిగిన ఆరు నెలల తర్వాత చిచ్చురేపిన ఈటల వ్యాఖ్యలు

- కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారన్న ఆరోపణలపై రాజకీయ ప్రకంపనలు
- ఈటలపై కాంగ్రెస్ ముప్పేట దాడి.. నైతికత లేకుండా మాట్లాడుతున్నారంటూ విమర్శలు
- నిరూపించకపోతే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- తనపై చేసిన రూ.18 వేల కోట్ల ఆరోపణల సంగతేమిటని కాంగ్రెస్ నేతలను నిలదీసిన రాజగోపాల్‌రెడ్డి
- పోటాపోటీ విమర్శలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్



సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల క్రితం జరిగిన మునుగోడు ఎన్నిక ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ పార్టీల మధ్య కొత్త చిచ్చు రాజేసింది. ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన ఆరోపణ.. రాజకీయ దుమారానికి, ప్రమాణాల పంచాయతీకి తెరలేపింది. ఈ విషయంలో తాము నిర్దోషులమని, ప్రత్యర్థి పార్టీలదే తప్పు అంటూ మూడు ప్రధాన రాజకీయ పార్టీల నేతలూ వాదోపవాదాలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణల అంశంలో బీఆర్ఎస్ నేతలూ కల్పించుకోవడం, తమ వాదనలను సమర్థించుకునేందుకు నేతలంతా పాత అంశాలనే కొత్తగా తెరపైకి తెస్తుండటం ఆసక్తిగా మారింది. ఈటల ఆరోపణలపై భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రమాణం నుంచి ముక్కునేలకు రాయాలనే డిమాండ్ వరకు కాంగ్రెస్ పార్టీ వెళ్లగా.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను టార్గెట్ చేస్తూ బీజేపీ.. కాంగ్రెస్, బీజేపీ రెండింటినీ విమర్శిస్తూ బీఆర్ఎస్ పోటాపోటీ

మిగతా 8వ పేజీలో ▶

బీజేపీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదనే..
- ఈటల రాజేందర్ ఆరోపణలపై రేవంత్‌రెడ్డి ఫైర్
- కేసీఆర్ పాలనపై పోరాటం చేస్తున్నదే మేము
- నీలా లొంగిపోయి పోరాటం ఆపినవాడిని కాదు
- శనివారం భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేసిన రేవంత్

8లో

అమ్మతోడు, అయ్యతోడు అంటే సరిపోతదా?
- రేవంత్‌రెడ్డి విమర్శలపై ఈటల రాజేందర్ కౌంటర్
- ఎందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ ప్రాపకంతో బతుకుతున్నారో తెలియదా?
- అందరికీ త్వరలోనే తగిన జవాబు చెప్తానన్న ఈటల


8లో



శనివారం హోంమంత్రి మహమూద్ అలీ నివాసంలో జరిగిన ఈద్ ఉల్ ఫితర్ వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం - 3లో

'చేవెళ్ల'తో శంఖారావం!

నేడు అమిత్ షా బహిరంగ సభ..
- రాష్ట్ర ముఖ్య నేతలతోనూ కీలక సమీక్ష
- అసెంబ్లీ పోరుకు బీజేపీని సమాయత్తం చేయడమే లక్ష్యం
- కేసీఆర్ సర్కార్, బీఆర్ఎస్‌లపై విమర్శలు గుప్పించే చాన్స్
- కుటుంబ పాలన, హామీల అమలు అంశాలను ఎత్తిచూపనున్న షా



సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల బహిరంగ సభ వేదికగా బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. అటు బహిరంగ సభ, ఇటు ముఖ్య నేతలతో సమీక్షలతో.. తెలంగాణలో అధికార సాధనపై పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. ఇదే సమయంలో లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో రాజకీయ ప్రసంగం చేసే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. బీజేపీని గెలిపించడం ద్వారా అవినీతి, కుటుంబ పాలనకు తెరదించాలని.. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చుకోవడం ద్వారా అభివృద్ధిలో ముందుకు సాగేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపు ఇవ్వనున్నారని అంటున్నాయి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీని సమాయత్తం చేయడం, కేడర్‌లో ఉత్సాహం నింపడం లక్ష్యంగా ఆదివారం అమిత్ షా పర్యటన

మిగతా 8వ పేజీలో ▶

ఊళ్లకు ఆర్టీసీ ప్రతినిధులు..


- పల్లెలకు క్రమంగా ఆర్టీసీ బస్సులు దూరమై ప్రయాణికులకు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు చేరువగా మారుతున్న తరుణంలో ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ పేరుతో తమ ప్రతినిధులను పల్లెబాట పట్టించనుంది. ప్రతి ఊరిలోనూ ప్రతి నిధిని అందుబాటులో ఉంచడం ద్వారా గ్రామాలకు ప్రజారవాణా అవసరాలను గుర్తిస్తోంది.

- వివరాలు 5లో

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో 10 వేల మందికి పరీక్షలు


- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ఇప్పటివరకు 10వేల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. సగటున ఒక్కో మహిళకు 8 రకాల పరీక్షలు నిర్వహించి వారికి రిపోర్టులు ఇస్తున్నట్లు వెల్లడించింది.

- వివరాలు 3లో

హంతకుడి దర్జాగిరి..


- వివేకా హత్యకు ముందు కష్టపడితేనే పూట గడిచే స్థితి దస్తగిరిది. వంద రూపాయల కోసం ఐదారు గురికి మెసేజ్‌లు పెట్టిన ఘటనలు కోకొల్లలు. ఇప్పుడు కాలు కదిపితే స్కార్పియో కారు. చుక్కా, ముక్కా భోజనం.. ఖరీదైన స్మాచ్.. ఆహార్యమే మారిపోయింది.. వెరసి దౌర్జన్యాలు, దందాలు. వివేకా హత్య తర్వాత డ్రైవర్ దస్తగిరి విలాసవంతమైన జీవితమిది..

- వివరాలు 7లో



శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద నూతన సచివాలయం, అంబేద్కర్, బుద్ధ విగ్రహాల నడుమ కనువిందు చేస్తున్న నెలవంక...

పూర్తిస్థాయి పీజీటీ, ఆర్ట్ టీచర్ నోటిఫికేషన్లు విడుదల

వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన టీఆర్ఈఐఆర్బీ

పీజీటీలో 1,276 పోస్టులు, ఆర్ట్ టీచర్ కేటగిరీలో 132 ఖాళీలు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగ ఖాళీలకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రకటనలను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్బీ) ఒక్కొక్కటిగా విడుదల చేస్తోంది. ఈ నెల 5న టీఆర్ఈఐఆర్బీ 9,231 ఉద్యోగాల భర్తీకి ఒకేసారి 9 నోటిఫికేషన్లు జారీ చేసింది. పూర్తిస్థాయి నోటిఫికేషన్లను దరఖాస్తు సమయంలో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ఈ నెల 17న జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, లైబ్రేరియన్ కొలువులకు సంబంధించిన రెండు ప్రకటనలను విడుదల చేయగా... తాజాగా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ టీచర్ (పీజీటీ), ఆర్ట్ టీచర్ కొలువులకు సంబంధించిన పూర్తిస్థాయి నోటి ఫికేషన్లు జారీ చేసింది. ప్రస్తుతం ఈ ప్రక టనలన్నీ గురుకుల నియామకాల బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మరో 5 ప్రకటనలకు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్లు ఈ నెల 24న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు గురుకుల బోర్డు అధికారులు చెబుతున్నారు.

1,276 పీజీటీ పోస్టులు...
గురుకుల పాఠశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ టీచర్ పోస్టులు 1,276 ఉన్నాయి. ఇందులో అత్యధికం మహిళలకే రిజర్వ్ కావడం గమనార్హం. బాలికల విద్యాసంస్థల్లో ఉద్యోగాలు వంద శాతం మహిళలకే

మిగతా 7వ పేజీలో ▶

30న కానిస్టేబుల్ పోస్టులకు తుది రాతపరీక్ష

రేపటి నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌కు అవకాశం

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా పోలీసు శాఖలోని వివిధ విభాగాల కానిస్టేబుల్ పోస్టులకు తుదిరాత పరీక్షను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నారు. ఉమ్మడి 9 జిల్లా కేంద్రాలతోపాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సివిల్ కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు తుది రాతపరీక్ష నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కమ్యూనికేషన్ కానిస్టేబుల్ అభ్యర్థులకు తుది రాతపరీక్ష నిర్వహించనున్నారు. సివిల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల రెండు పరీక్షలకు సైతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఒకే పరీక్షకేంద్రాన్ని కేటాయించనున్నట్టు చైర్మన్ స్పష్టం చేశారు. కానిస్టేబుల్ తుది రాతపరీక్ష హాల్‌టికెట్లను అభ్యర్థులు సోమవారం(ఈ నెల 24) ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అభ్యర్థులు www.tslprb.com వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఉన్న అభ్యర్థులు 93937 11110, 93910 05006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



100% BIS HUID JEWELLERY
5 DECADES OF LEGACY
అక్షయ తృతీయ శుభాకాంక్షలు
ఈ పర్వదినాన లక్ష్మీదేవిని మీ ఇంటికి ఆహ్వానించండి
సిఎంఆర్ బంగారు ఆభరణాలతో
April 8th to 23rd
Akshaya Tritiya Celebrations
IGI Diamond Jewellery
EF-VVs
Diamond Jewellery
₹20,000 OFF
PER CARAT
FLAT 50% OFF
on Diamond Jewellery
Making Charges
తరుగు (V.A)
(916 HUID Jewellery)
UPTO 50% OFF
సిల్వర్ ఆర్టికల్స్‌పై
తరుగు, మజూరి
చార్జీలు లేవు
అక్షయతృతీయ సందర్భంగా ఈరోజు మా అన్ని షోరూంలు ఉదయం గం।। 7-30 లకే తెరువబడును
మీకు నచ్చిన ఆభరణాలను తరుగు, మజూరి లేకుండా
సొంతం చేసుకునే అద్భుతమైన అవకాశం
My Gold My Choice
Jewellery Purchase Plan
WEDDING JEWELLERY
Purchase Plan
100% BIS HUID HALLMARK GOLD
CMR
LEGACY OF JEWELLERY
www.cmrjewellers.com
888 188 1193
WHATSAPP SHOPPING
ప్యాట్నీసెంటర్ 27804733
మల్కాజ్‌గిరి 27060600
దిల్‌సుఖ్‌నగర్ 24068999
సోమాజిగూడ 23404440
కూకట్‌పల్లి 23253033
ప్యాట్నీ సర్కిల్ 27892828
చింతల్ 23085555
నిజాంపేట 23899990
ఎ.ఎస్. రావ్ నగర్ 23479999
సిద్దిపేట 222299
మహబూబ్‌నగర్ 220999
మంచిర్యాల 255888

ఈ రోజుల్లో సరుకులు, కూరగాయల నుంచి దుస్తుల వరకూ ప్రతీది ఆన్‌లైన్‌లో కొనేయడం అలవాటైపోయింది. అయితే ఆన్‌లైన్ షాపింగ్‌లో కస్టమర్ల వ్యక్తిగత సమాచారానికి భద్రత లేకుండా పోయింది. కస్టమర్ల పేరు, చిరునామా, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు, కొనుగోలు చేసిన వస్తువులు.. ఇలా ప్రతీ ఒక్కటీ బహిరంగ మార్కెట్లోకి అలవోకగా వచ్చేస్తున్నాయి. భద్రంగా ఉండాల్సిన కస్టమర్ల వ్యక్తిగత వివరాలు అంగట్లో సరుకులుగా విక్రయిస్తున్నట్లు ఇటీవల సైబరాబాద్ పోలీసులు డేటాలీక్, విక్రయం కేసు విచారణలో గుర్తించారు. అమెజాన్, బిగ్‌బాస్కెట్. జొమాటో వంటి పదుల సంఖ్యలోని ఈ-కామర్స్ సైట్లలోని కస్టమర్ల డేటాను నేరస్తులు అమ్మకానికి పెట్టారు.

ఈ-కామర్స్ సైట్ల నుంచే డేటా లీక్

- సాక్షి, హైదరాబాద్



ఆయా ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులకు సైబర్ నేరగాళ్లు డబ్బులు చెల్లించి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఆర్డర్ చేసిన వస్తువులతోపాటు కస్టమర్ల డేటా కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ప్రముఖ ఈ-కామర్స్ సైట్లలో డేటాను డెలివరీ

ఇంటి దొంగల పనే..

పాయింట్స్ నుంచి సైబర్ నేరగాళ్లు కొనుగోలు చేస్తున్నారు. తర్వాత టెలికాలర్స్‌తో కస్టమర్లకు ఫోన్ చేయిస్తున్నారు. ఫలానా సైట్ ద్వారా మీరు వస్తువు కొనుగోలు చేశారు.. కంపెనీ తీసిన లక్కీడీప్‌లో మీరు ఖరీదైన కారు, అందుకు సమానమైన నగదు బహుమతి గెలుచుకున్నారంటూ ఫోన్‌లో నమ్మిస్తున్నారు. జీఎస్టీ, ఇన్సూరెన్స్, సెక్యూరిటీ డిపాజిట్ ఇలా రకరకాల చార్జీలు చెల్లించాలని, అవన్నీ తిరిగి రీఫండ్ చేస్తామంటూ బురిడీ కొట్టించి లక్షల రూపాయలు కాజేసి ఫోన్‌లు స్విచాఫ్ చేస్తున్నారు. ఇలా సైబర్ నేరస్తులు దేశవ్యాప్తంగా వందలాది మందిని మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు.

అప్రమత్తత అవసరం

నిందితులు విక్రయానికి పెట్టిన వాటిలో అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, యుట్యూబ్, పేటీఎం, ఫోన్‌పే, బిగ్ బాస్కెట్, బుక్‌మై షో, ఇన్‌స్టాగామ్, జొమాటో, పాలసీ బజార్, ఓఎల్‌ఎక్స్, బైజూస్, వేదాంతు వంటి సంస్థల వినియోగదారుల డేటా కూడా ఉంది. యూజర్ల సెన్సిటివ్ పర్సనల్ డేటా ఇన్ఫర్మేషన్ (ఎస్‌పీడీఐ)ను గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత ఈ-కామర్స్ సంస్థలదే. కానీ, ఆయా సంస్థలు ఐటీ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినట్టు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో వ్యక్తిగత వివరాల నమోదు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.



ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ నివాసంలో విందులో పాల్గొన్న సీఎం కేసీఆర్, కేకే, సత్యవతి రాథోడ్, మధుసూదన చారి, సంతోష్, విజయలక్ష్మి, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, పల్లా తదితరులు

ఈద్ ఉల్ ఫితర్ వేడుకల్లో సీఎం కేసీఆర్

- హోం మంత్రి మహమూద్ అలీ నివాసానికి సీఎం
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆతిథ్యం స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో ముస్లింలు పవిత్ర మాసంగా పాటించే రంజాన్ నెల చివరి రోజైన 'ఈద్ ఉల్ ఫితర్'పండుగ సందర్భంగా హోంమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ నివాసంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కడ కేసీఆర్‌కు మహమూద్ అలీ, ఆయన కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అందరికీ కేసీఆర్ ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. మహమూద్ అలీ ఆతిథ్యాన్ని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి కేసీఆర్ స్వీకరించారు. రంజాన్ మాసంలో ఆచరించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, క్షమాగుణం, కరుణ తదితర ఆధ్యాత్మిక భావనలు తదితర అంశాలపై కేసీఆర్ తన వెంట వచ్చిన మంత్రులు ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలతో కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనను కలిసేందుకు వచ్చిన పలువురు మత పెద్దలు, ఇతరులను పేరుపేరునా పలకరించి అలాయ్ బలాయ్ తీసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకాలం నుంచీ నేటి వరకు తనతో కొనసాగుతున్న సీనియర్ కార్యకర్త సత్తార్ గుల్షనీసీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. కేసీఆర్ వెంట మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు కె.కేశవరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ విజయలక్ష్మీ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మసీఉల్లాఖాన్, సలీం, రవీందర్ సింగ్, మేడె రాజీవ్ సాగర్, సీనియర్ నేతలు మొయిత్ ఖాన్, రాయిడన్ రోచ్ తదితరులు పాల్గొన్నారు. తమ ఆతిథ్యం స్వీకరించిన సీఎంకు మహమూద్ అలీ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ జ్ఞాపికను బహూకరించారు.

గచ్చిబౌలి టిమ్స్ అభివృద్ధి ఏమైంది?

గూడూరు నారాయణరెడ్డి

సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలి టిమ్స్ అభివృద్ధి ఏమైందని..ఆర్భాటపు ప్రారంభం తప్ప ఆచరణలో అభివృద్ధి కనిపించడం లేదని బీజేపీ నేత గూడూరు నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. 2022 ఏప్రిల్ 27న హైదరాబాద్, ఎల్‌బీనగర్, ఎర్రగడ్డ, అల్వాల్‌లలో మూడు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణానికి కేసీఆర్ శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తోందని గుర్తుచేశారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఈ ఆసుపత్రిని మరిచిపోయి నగరంలో కొత్త టిమ్స్ ఆసుపత్రులు నిర్మిస్తామని ప్రకటించడంలో ఏ మేరకు సబబని ఆయన ప్రశ్నించారు.



ఆరోగ్య మహిళా కేంద్రాల్లో పదివేల మందికి పరీక్షలు

- కంటివెలుగు ద్వారా 1.08కోట్ల మందికి పరీక్షలు
- వైద్య,ఆరోగ్య శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ఇప్పటివరకు 10వేల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్య,ఆరోగ్య శాఖ తెలిపింది. ఒక్కో మహిళకు ప్రాథమిక డయాగ్నొస్టిక్, కేన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మ పోషక లోపాలు, మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు, పీఐడీ, పీసీఓఎస్, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ సమస్యలు, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, లైంగిక వ్యాధులు తదితరాలకు సంబంధించిన పరీక్షలన్నీ నిర్వహిస్తున్నట్లు వివరించింది. సగటున ఒక్కో మహిళకు 8 రకాల పరీక్షలు నిర్వహించి వారికి రిపోర్టులు ఇస్తున్నట్లు తెలిపింది. కొంతమందిని సంబంధిత జిల్లా ఆస్పత్రులు, జనరల్, టీచింగ్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు వివరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

1.08 కోట్ల మందికి కంటి పరీక్షలు

మరోవైపు, అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందని, జనవరి 19 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1.08 కోట్ల మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ వివరించింది. దృష్టి లోపం ఉన్న 17.20 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేసినట్లు తెలిపింది. మరో 13.11 లక్షల మందికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం ఆర్డర్ చేసి అద్దాలు కూడా పంపిణీ చేసినట్లు వెల్లడించింది. పరీక్షించిన వారిలో 78.67 లక్షల మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారణ అయ్యిందని వైద్య,ఆరోగ్య శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

సుప్రసిద్ధ సాహితీవేత్త రవ్వా శ్రీహరి కన్నుమూత

నేడు అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు



ఆచార్య రవ్వా శ్రీహరి (ఫైల్)



శ్రీహరి సతీమణి అనంతలక్ష్మిని ఓదారుస్తున్న జూలూరు

మలక్‌పేట(హైదరాబాద్)/యాదాద్రి/హైదరాబాద్: సుప్రసిద్ధ సాహితీవేత్త, హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ, సంస్కృతాంధ్రభాషల్లో నిరుపమానమైన పాండిత్యం కలిగిన ఆచార్య రవ్వా శ్రీహరి(80) శుక్రవారంరాత్రి కన్నుమూశారు. మలక్‌పేటలోని జడ్జెస్ కాలనీలో నివసిస్తున్న శ్రీహరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నల్లగొండ జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలో 1943 సెప్టెంబర్ 12న ఆయన జన్మించారు. యాదిగిరి లక్ష్మీ నరసింహస్వామి సంస్కృత విద్యాపీఠంలో సురవరం ప్రతాపరెడ్డి, ఎం.నరసింగరావు సహాయంతో చేరి సంస్కృత అధ్యయనం ప్రారంభించారు. వివేకావర్ధిని కాలేజ్‌లో తెలుగు పండితుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా, ఉస్మానియా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా పనిచేశారు. ఆయన ద్రావిడ విశ్వవిద్యాలయానికి 2002లో ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2011లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్-ఇన్-చార్జ్‌గా పనిచేశారు. అనేకమంది విద్యార్థులను ఉత్తమ పరిశోధకులుగా తీర్చిదిద్దారు. 'శ్రీహరి నిఘంటువు', 'అన్నమయ్య పదకోశం', 'నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం'లాంటి పలు నిఘంటువులను రూపొందించారు. జాషువా గబ్బిలం, ఫిరదౌసి, సినారె విశ్వంభర కావ్యాలను సంస్కృతంలోకి అనువదించారు. శ్రీహరికి భార్య అనంతలక్ష్మి, ముగ్గురు కుమారులు రమేశ్, శివకుమార్, పతంజలి ఉన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, ప్రముఖ చిత్రకారుడు లక్ష్మణ్ ఏలే, ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు శనివారం మలక్‌పేటలో శ్రీహరి కుటుంబసభ్యులను పరామర్శించారు. శ్రీహరి మృతిపట్ల పలువురు సాహితీవేత్తలు, రచయితలు సంతాపం తెలియజేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంబర్‌పేట శ్మశానవాటికలో శ్రీహరి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సీఎం కేసీఆర్ సంతాపం

సుప్రసిద్ధ సాహితీవేత్త, ప్రముఖ తెలుగు, సంస్కృత భాషా పండితుడు ఆచార్య రవ్వా శ్రీహరి మరణంపట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. రవ్వా శ్రీహరి సామాన్య కుటుంబంలో జన్మించి కృషి, పట్టుదలతో భాషా సాహిత్య రంగంలో అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. లెక్చరర్, ప్రొఫెసర్, వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టి అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రవ్వా శ్రీహరి జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీహరి మరణం భాషా సాహిత్య రంగాలకు తీరని లోటని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రవ్వా శ్రీహరి మృతిపట్ల సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం మలక్‌పేటలోని శ్రీహరి నివాసంలో ఆయన సతీమణి విజయలక్ష్మిని, కుటుంబసభ్యులను పరామర్శించారు. నిరంతరం పరిశోధన చేసి తెలుగు, తెలంగాణ సాహిత్యానికి చిరునామాగా మారారని పేర్కొన్నారు.


ఏపీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: తెలుగు, సంస్కృత భాషల్లో పండితుడు, సాహితీవేత్త రవ్వా శ్రీహరి మృతి పట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమ్మెకు దిగితే బర్తరఫ్

ఆర్టిజన్ల సమ్మెపై విద్యుత్ సంస్థల ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సమ్మెకు దిగిన ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆదేశాలు జారీ చేశాయి. ఇతర ఆర్టిజన్లను సమ్మెకు పురిగొల్పినా లేక సమ్మెకు ఆర్థిక సాయం అందించినా ఉద్యోగాల నుంచి బర్తరఫ్ చేయాలని స్పష్టం చేశాయి. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌రావు, ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ఎ.గోపాల్‌రావు, జి. రఘుమారెడ్డి శుక్రవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 25న ఉదయం 8 గంటల నుంచి సమ్మెకు దిగుతామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్, ఇతెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్లు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సమ్మెకు సమయం దగ్గర పడడంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తీవ్ర చర్యలకు ఉపక్రమించాయి. విద్యుత్ ఉద్యోగుల తో పాటు ఆర్టిజన్లకు7 శాతం ఫిట్మెంట్ తో పీఆర్సీ అమలు తోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాల తో కార్మిక శాఖ సమక్షంలో పారిశ్రామిక వివాద పరిష్కార చట్టం లోని సెక్షన్ 12(3) కింద ఒప్పందం చేసుకున్నామని, దీనికి విరుద్ధంగా పైన పేర్కొన్న రెండు సంఘాలు సమ్మెకు వెళ్తుండడం చట్ట విరుద్ధమని యాజమాన్యాలు తేల్చి చెప్పాయి. అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) కింద విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని స్పష్టం చేశాయి.



ఆర్టిజన్ నేతలు అరెస్ట్

- సమ్మె నేపథ్యంలో ముందస్తు అరెస్టులు షురూ
- పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు సాయిలు, ఇతర నేతలు

సాక్షి, హైదరాబాద్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్82) ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి తెలంగాణ వ్యాప్తంగా ఆర్టిజన్లంతా సమ్మెకు వెళ్లనున్నట్లు ప్రకటించడంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. కొందరు నేతలు మొండిగా వ్యవహరిస్తుండటంతో వారిని సమ్మెకు రెండు రోజుల ముందే అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి సాయిల్ సహా పలువురు కీలక నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆరు నెలల వరకు విద్యుత్ సంస్థల్లో సమ్మె ను నిషేధిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన యాజ మాన్యాలు తాజాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నాయి. సెక్షన్లు, సబ్‌స్టేషన్ల వారీగా ఆర్టిజన్ల లెక్కలు తీస్తున్నారు. యాజమాన్యం ఆదేశాలను ధిక్కరించి సమ్మెకు వెళ్లే కార్మికులను విధుల నుంచి శాశ్వతంగా తొలగించనున్నట్లు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పీఆర్సీ, సర్వీసు నిబంధనల విషయంలో ఆర్టిజన్ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, వెంటనే వాటిని సమీక్షించి, న్యాయం చేయాలని కార్మిక నేత సాయిలు డిమాండ్ చేశారు.

నేతల అరెస్టు అన్యాయం

సాక్షి, హైదరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఈనెల 25వ తేదీ నుంచి ఆర్టిజన్స్ తలపెట్టిన సమ్మె విచ్ఛిన్నానికి యాజమాన్యం తమ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్-82 అధ్యక్షుడు మధుకర్ తెలిపారు. తమను విస్మరించి డిపార్ట్‌మెంట్ యూనియన్‌లతో కార్మిక శాఖ వద్ద చర్చలు జరిపి తీరని అన్యాయం చేయడాన్ని సహించమని ఆయన శనివారం రాత్రి ఒక ప్రకటనలో హెచ్చరించారు.



నీ కృప ఆకాశం కంటె ఎత్తయినది.
నీ సత్యం మేఘమండలం వరకు వ్యాపించియున్నది.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.తదియ ఉ.8.11 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** రోహిణి రా.1.02 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.4.41 నుండి 6.21 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.43 నుండి 11.23 వరకు, అక్షయతృతీయ.

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అమిత్ షా (హోం మంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

శుక్రవారం మధ్యాహ్నం దేవణహళ్లి బయల్దేరి కూడా.. అక్కడ కుండపోతగా వర్షం కురుస్తోందని తెలియడంతో ఆఖరి నిమిషంలో ఆగిపోవలసి వచ్చింది. ఆ రోజు రాత్రి.. 18వ శతాబ్దపు మనిషి ఒకరు నా కలలోకి వచ్చారు!

నేను గానీ, మోదీజీ గానీ, మిగతా నిజమైన భారతీయులు ఎవరైనా గానీ ఇష్టపడేందుకు అణు మాత్రం కూడా అవకాశమే లేని ఆ మనిషి.. తన నడుముకు ఖడ్గం వంటిదేదీ లేకుండానే నాకు కనిపించాడు!

"ఏంటిలా ఢిల్లీ వచ్చావు?" అని ఈసడింపుగా ఆ మనిషిని అడిగాను.

"మీరెందుకు దేవణహళ్లికి రాలేదు అని నేను మిమ్మల్ని అడిగానా అమిత్ జీ?" అని అతడు నవ్వుతూ నన్ను ప్రశ్నించాడు!

అతడి నవ్వు నాకు నచ్చలేదు.

"నువ్వు ఢిల్లీ రావడం గురించి నేను అడిగితే, నేను దేవణహళ్లి రాకపోవడం గురించి నువ్వు అడుగుతున్నావు! యావత్ దక్షిణభారతదేశాన్ని చేజిక్కించుకునేందుకు ఫ్రెంచి వాళ్లతో కలిసి బ్రిటిష్‌వాళ్లపై యుద్ధం చేసిన అరబ్బువి కదా నువ్వు.. ఇలాగే



తిరకాసుగా మాట్లాడతావు.." అన్నాను.

ఆ మాటకు అలలు అలలుగా నవ్వాడు.

"ముందా నవ్వు ఆపు.." అన్నాను.

"నవ్వును ఆపుకోవడమంటే తల దించుకోవడమే. నేనెందుకు తలదించుకోవాలి అమిత్‌జీ.." అన్నాడతడు!

"దించుకోవద్దులే. చెప్పు.. నువ్వు ఢిల్లీ ఎందుకు వచ్చినట్లు?" అన్నాను.

"మీరు దేవణహళ్లి వస్తే మిమ్మల్ని కలవాలనుకున్నాను. మీరు దేవణహళ్లి రాలేదు కనుక నేనే ఢిల్లీ వచ్చాను.." అన్నాడు.

"ఏం పని నాతో?!" అన్నాను.

"దేవణహళ్లి నా జన్మస్థలం అమిత్‌జీ. మీరు అక్కడికే వచ్చి అక్కడి నుంచే మీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని ఏర్పాట్లు చేసుకున్నారు. మీరు మీ భారీ కటౌట్‌లతో కర్ణాటకలోని మొత్తం సీట్లన్నీ గెలవొచ్చు, దేవణహళ్లిలో మాత్రం ఎప్పటికీ గెలవలేరు. ముందెన్నడూ గెలవలేదు. మీదెన్నడూ గెలవలేరు. గెలుస్తామని కలలేమైనా ఉంటే వాటిని కనడం మానండి. ఈ మాట చెప్పడానికే ఢిల్లీ వచ్చాను.." అన్నాడు!!

కల అనే మాటకు నాకు దిగ్గున మెలకువ వచ్చింది! నడుముకు ఖడ్గం లేని ఆ మనిషి కనిపించలేదు!!

టైమ్ ఎంతైందో చూశాను. అది మోదీజీకి ఫోన్ చేసే సమయమైతే కాదు. అయినా చేశాను.

"టిప్పు సుల్తాన్ నా కలలోకి వచ్చాడు మోదీజీ. అది దేనికి సంకేతం అయుండొచ్చని అడిగేందుకే మీకు ఫోన్ చేశాను.." అన్నాను.

పెద్దగా నవ్వారు మోదీజీ.

"బిలావల్ భుట్టో వచ్చే నెలలో ఇండియా వస్తున్నాడు. అది దేనికి సంకేతం అవుతుంది చెప్పండి అమిత్‌జీ! ఇదీ అంతే.." అన్నారు.

"కలలో ఇంకొకటి కూడా గమనించాను మోదీజీ. టిప్పు సుల్తాన్ నడుముకు ఖడ్గం వేలాడుతూ కనిపించలేదు! అందులోని గూఢార్థం ఏమై ఉంటుంది?" అని అడిగాను.

మళ్లీ నవ్వారు ఆయన.

"కలల శాస్త్రమో, ఖడ్గ శాస్త్రమో టిప్పు సుల్తాన్ మీ కలలోకి ఖడ్గం లేకుండా రావడంలోని గూఢార్థాన్ని వివరించలేవు అమిత్‌జీ. కర్ణాటక శాస్త్రాన్ని తిరగేయండి. టిప్పు తన ఏడున్నర కిలోల బరువైన ఖడ్గాన్ని మన దేవణహళ్లి క్యాండిడేట్ మునిస్వామప్ప నెత్తిపై రెండు సన్నటి వెంట్రుకలతో వేలాడకట్టి, అక్కడి నుంచి నరాసరి మీ కలలోకి వచ్చి ఉంటాడు.." అన్నారు.

గ్రేట్ ఎనాలిసిస్!!

ఖడ్గం కోసం వెతికితే రెండు వెంట్రుకలు కూడా బయటపడ్డాయి! ఒక వెంట్రుక ఎల్.ఎన్. నారాయణస్వామి.. జె.డి.(ఎస్) అభ్యర్థి. రెండో వెంట్రుక కె.హెచ్.మునియప్ప.. కాంగ్రెస్ క్యాండిడేట్.

"మీరు బ్రిలియంట్ మోదీజీ" అన్నాను.

"ఖడ్గం లేకుండా కలలోకి వచ్చాడని కనిపెట్టిన మీకంటేనా?" అని నవ్వారు మోదీజీ.

గాడ్‌ఫాదర్ ఆఫ్ డర్టీ పాలిటిక్స్!



గాడ్‌ఫాదర్ నవల ఎపిగ్రాఫ్...

బిహైండ్ ఎవ్రీ ఫార్చ్యూన్, దేర్ ఈజ్ ఎ క్రైమ్!

(ప్రతి అదృష్టం వెనుక నేరమో, ఘోరమో ఉంటుందని తాత్పర్యం.)

ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి రెండు దారులుంటాయి. ఒకటి: స్వయంకృషి, రెండు: అదృష్టం.

మొదటి దారిలో వెళ్లడానికి పట్టుదల కావాలి. ప్రతిభ ఉండాలి. ఏళ్లకేళ్లు నిరీక్షించాలి. కష్టాల కొలిమిలో సానబట్టుకోవాలి. అడ్డంకులను ఓర్పుగా అధిగమించగలగాలి. హై రిస్క్ రోడ్!

రెండో దారి అదృష్టం. కొంతమందికి యథాలాపంగా లాటరీ మాదిరిగా తగలొచ్చు. వీరి సంఖ్య బహుస్వల్పం. కోటి కొక్కరు ఉండవచ్చు. అదృష్టవంతుల్లో అత్యధికులు అక్రమార్కులే! మాకియవెలీ శిష్యులే. మోసం, కపటం వారి స్వభావం. చట్టం, న్యాయం వీరికి పట్టవు. నిత్యం ఉషోదయంతోపాటు ఓ అసత్యాన్ని వెలిగిస్తారు. వక్రమార్గదర్శులు వీరు.

అరవయ్యేళ్ల కింద ఈ రెండో దారిలో బయల్దేరిన ఒక పెద్దమనిషి నమ్మకం అనే మాట గొంతు నులిమి, విశ్వసనీయతకు శిలువేసి, మెట్టుమెట్టుకూ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పైస్థాయికి చేరి స్వార్థశక్తులకు మార్గదర్శిగా నిలబడిపోయారు.

నేర సామ్రాజ్యాల అంతిమ లక్ష్యం 'పవర్' మీద పట్టు బిగించడమే! ఈ మార్గదర్శి కూడా అదే బాటలో పయనించారు. పిడికిట్లోకి 'పవర్'ను తెచ్చుకున్నారు. చట్టాలను కాలదన్నారు. జనం సొమ్ముతో వేలకోట్లకు పడగెత్తారు. పైకి మాత్రం ధర్మప్రబోధకుడి మాదిరిగా ఫిలిం సిటీలో పీఠం వేసుకొని కూర్చున్నారు. ఒక దశలో ముక్కోటి దేవతలను కూడా తన కాంపౌండ్‌లోకే తెచ్చేసుకుందామని ఆలోచించారు. 'ఓం సిటీ' పేరుతో ఓ ప్రణాళిక తయారుచేసుకున్నారు. దైవకార్యంగా భావించి ఇంకో



జనతంత్రం

వర్ధెల్లి మురళి

నాలుగొందల ఎకరాలను కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. కానీ, దైవకృప లేకపోవడం వల్ల అది అక్కడే ఆగిపోయింది.

రామోజీ కొందరికి స్వామీజీ. కొందరికి కులగురువు. రాజకీయ, వ్యాపార రంగాల్లోని స్వార్థశక్తులకు గాడ్‌ఫాదర్. ఈ గాడ్‌ఫాదర్‌కు పట్టిన ప్రతి అదృష్టం వెనుక నేరం ఉంది. ఘోరం ఉంది. అసత్యముంది. మోసం, దగా దాగున్నాయి. ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీని స్వార్థశక్తుల రాజకీయ వేదికగా మార్చడంలో కీలకపాత్ర రామోజీదే! ఇందుకు ఆయనకు కలిసొచ్చిన అస్త్రం చంద్రబాబు. వ్యాపార రంగంలోని తన లక్షణాలను రాజకీయ రంగంలో కలిగి వున్న అపూర్వ సహోదరునిగా ఆయనకు బాబు కనిపించారు. ఇద్దరూ సుందోపసుందుల వలె కలిసిపోయారు. మీడియాను మాఫియాగా మార్చిపారేశారు. గోబెల్స్ ప్రచారాలతో చెలరేగిపోయారు. ముప్పయ్యేళ్లుగా తెలుగునాట వీరు సృష్టించిన రాజకీయ కాలుష్యపు విష ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు వ్యతిరేకంగా ఈ ముఠా సృష్టిస్తున్న అసత్య ప్రచారం, కల్పిస్తున్న కట్టుకథలు, సృష్టిస్తున్న విద్వేషం, కక్కుతున్న విషం... ప్రపంచ చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా కనీవినీ ఎరుగని స్థాయికి చేరుకున్నది.

మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల నిర్వహణలో రామోజీరావు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘించిన అంశాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇంతకాలం రామోజీని మీడియా మొఘల్‌గా, పద్మభూషణుడిగా అమాయకంగా నమ్మిన జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఆయన అరవయ్యో దశకంలో వేసిన తొలి అడుగే వంచన, ద్రోహచింతన అనే థీమ్‌తో పడింది. తొలి భాగం 'రామోజీ: ది రైజ్' నమ్మకద్రోహంతోనే మొదలైంది. చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం రెండో భాగం 'రామోజీ: ది రూల్' నడిచింది. ఇప్పుడిక ఆఖరిభాగం 'రామోజీ: ది ఫాల్' విడుదలకు సిద్ధంగా ఉన్నది. అందుకే పతన భయం రామోజీ మీడియాను వణికిస్తున్నది. అదుపు తప్పిన ఉన్మాదంతో అది ఊరేగుతున్నది. అన్ని విలువలనూ విప్పేసి నగ్నంగా నర్తిస్తున్నది.

కృష్ణా జిల్లా జొన్నపాడుకు చెందిన జీజే రెడ్డి అనే ఆయన ఆరోజుల్లో ఢిల్లీలో చక్రం తిప్పుతుండేవాడు. 1960, 70 దశకాల్లో అధికార, రాజకీయ వర్గాల్లో ఆయన పలుకుబడి పతాక స్థాయిలో ఉండేది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం ఢిల్లీకి వెళ్లిన రామోజీ సొంత జిల్లావాడైన జీజే రెడ్డి దగ్గర గుమాస్తాగా కుదురుకున్నాడు. మార్గదర్శి, ఈనాడు పత్రికల స్థాపన జీజే రెడ్డి ఆలోచనే అని అప్పటి రామోజీ సహచరులు చెబుతున్నారు. మార్గదర్శిలో పెద్దమొత్తంలో పెట్టుబడులు కూడా ఆయనవే! రామోజీ ప్రారంభ వాటా 10 రూపాయలు మాత్రమే! 'ఈనాడు'కు ఆదిలో పెట్టుబడిని సమకూర్చింది కూడా జీజే రెడ్డేనని చెబుతారు. విశాఖ ఎడిషన్ కోసం తన పలుకుబడితో తూర్పు జర్మనీ నుంచి సెకండ్ హ్యాండ్ ప్రింటింగ్ మిషన్ కూడా ఆయన తెప్పించారట. జీజే రెడ్డి ద్వారా ఢిల్లీలోని పలుకుబడి గల నాయకులతో రామోజీ కూడా పరిచయాలు పెంచుకున్నాడు. తర్వాత కాలంలో తన వ్యాపార సామ్రాజ్య విస్తరణకు ఈ పరిచయాలు పనికొచ్చాయి. 1977లో జీజే రెడ్డి మీద దేశద్రోహం కేసు నమోదైంది. కేసును విచారించిన ఢిల్లీ కోర్టు ఆయనను ద్రోహిగా నిర్ధారించింది. ఆయన ఆస్తులన్నీ జప్తు చేయాలని ఆదేశించింది. ఆయన దేశం విడిచి పారిపోయారు. ఆస్తులన్నీ జప్తు చేశారు. కానీ రామోజీ సంస్థల్లో ఉన్న అధికారిక షేర్లను ఆయన ప్రభుత్వానికి సరెండర్ చేయలేదు. జీజే రెడ్డి పారిపోయే నాటికి డైరెక్టర్ హోదాలో 'మార్గదర్శి'లో ఆయనకున్న షేర్లు ప్రభుత్వానికి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు. ఎందుకనో ప్రభుత్వం కూడా చొరవ చూపలేదు. ఆ తర్వాత కాలంలో జీజే రెడ్డి కుమారుడు ఆస్తుల విషయంలో రామోజీని కలిశాడట! కానీ రామోజీ మాత్రం అతడిని చీకొట్టి పంపించాడని తెలిసింది. అలా మొదలైంది 'రామోజీ: ది రైజ్'.

'ఈనాడు'ను మొదట విశాఖపట్నం నుంచి ప్రారంభించారు. అందుకోసం సీతమ్మధారలో 2.78 ఎకరాల స్థలాన్ని, అందులో 40 వేల అడుగుల్లో నిర్మితమైన భవనాలను నెలకు మూడు వేల చొప్పున 33 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నారు. భూమి యజమాని పేరు మంతెన ఆదిత్యవర్మ. గడువు ముగిసిన తర్వాత వర్మ ఖాళీ చేయమని అడిగినా రామోజీ అంగీకరించలేదు. దానితో ఆయన కేసు వేశారు. ఇదిలా ఉండగా అందులో ఉత్తర భాగంలో కొంత భూమిని రోడ్డు వేయడానికి ప్రభుత్వం తీసుకున్నది. ఇందుకు బదులుగా వెనుక వైపున్న స్థలాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధపడింది. లెక్కప్రకారం ప్రభుత్వం ఇచ్చే స్థలం భూయజమాని ఆదిత్యవర్మకు చెందాలి. కానీ పలుకుబడితో రామోజీ తన కొడుకు పేరు మీద రిజిస్టర్ చేశారు. వర్మ దాని మీద కూడా కేసు వేశారు. అసలు రోడ్డుకు తాను స్థలమే ఇవ్వలేదనీ, ముందునుంచే అక్కడ రోడ్డు ఉన్నదనీ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేసి రామోజీ కోర్టుకు సమర్పించారు. అది ఫోర్జరీ డాక్యుమెంట్‌గా కోర్టులో నిర్ధారణ అయింది. కుట్ర, ఫోర్జరీ, మోసపూరిత చర్యల కింద రామోజీపై కేసులు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. ఇదీ రామోజీ ఘనచరిత. 'ఈనాడు' విజయవాడ, హైదరాబాద్ స్థలాల విషయంలోనూ యజమానులను రామోజీ ముప్పతిప్పలు పెట్టాడు. విజయవాడ స్థలం స్వయానా ఆయన తోడల్లుడు 'డాల్ఫిన్' అప్పారావుకు చెందినది. రామోజీ మోసపూరిత చర్యల గురించి అప్పారావు పలుమార్లు బహిరంగంగానే చెప్పుకొచ్చారు. ఆయనకు మానవత్వం లేశమాత్రమైనా లేదనీ, ఆయనొక పయోముఖ విషకుంభమనీ అప్పారావు తీవ్రంగా విమర్శించారు.

రామోజీ ఫిలిం సిటీలోని భూముల విషయంలో జరిగిన అక్రమాలకు లెక్కేలేదు. అసైన్డ్ భూములను, చెరువు భూములను, పోరంబోకు భూములను కబ్జా చేశారు. అవే కాకుండా ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని దారుణంగా ఉల్లంఘించారు. ఫిలిం సిటీలో 1,363 ఎకరాలు సీలింగ్ చట్టానికి మించి ఉన్నదని రెవిన్యూ అధికారులు సర్వే చేసి నిర్ధారించారు. నోటీసులిచ్చారు. కథ అక్కడే ఆగిపోయింది. రామోజీ ఆక్రమించిన భూముల్లో 500 మంది స్థానిక పేదలకు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇళ్లస్థలాలు మంజూరు చేసింది. వాటిని లబ్ధిదారులకు ఇప్పించడంలో అధికారులు, స్థానిక నేతలు ఇప్పటికీ చొరవ చూపలేకపోతున్నారు. ఫిలింసిటీలో చిట్‌ఫండ్ కంపెనీకి కూడా 137 ఎకరాల భూమి ఉన్నది. ఇది చందాదారుల సొమ్ముతో కొన్నారా? కమీషన్ సొమ్ముతో కొన్నారా? అనే అంశంపై క్లారిటీ లేదు.

నాన్‌బ్యాంకింగ్ సంస్థలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదన్న ఆర్‌బీఐ చట్టాన్ని ఉల్లంఘించి మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరు మీద సుమారు 2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేశారు. అప్పటి పార్లమెంట్ సభ్యుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ కేంద్ర ఆర్థికశాఖ, ఆర్‌బీఐలకు ఫిర్యాదు చేశారు. రామోజీ చేసిన వితండవాదాన్ని ఆర్‌బీఐ అంగీకరించలేదు. సంస్థపై కేసు నమోదు చేయాలని సూచించింది. ఆమేరకు కేసు పెట్టారు. డిపాజిట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించేస్తానని ఆర్‌బీఐకి రామోజీ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. హడావిడిగా ఫైనాన్షియర్స్ సంస్థను మూసేశారు. కేసు దర్యాప్తులో ఉండగా అలా మూసేయడం కూడా నేరం. చేసిన తప్పుల తాలూకు ఆధారాలు దొరక్కుండా ఆయన ఆ నేరానికి ఒడిగట్టారు. డిపాజిటర్ల జాబితాను కూడా ఈనాటికీ విడుదల చేయలేదు. అది విడుదల చేస్తే తప్ప అది నల్లధనమో, తెల్లధనమో నిర్ధారణ కాదు. తాజాగా ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి అరుణ్‌కుమార్‌ల చొరవతో జాబితా వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఏం చేస్తారో చూడాలి!

ఫైనాన్షియర్స్‌ను మూసివేసినా ఆ తరహా వ్యాపారాన్ని చిట్‌ఫండ్స్ ముసుగులో కొనసాగిస్తున్నారని వెల్లడవుతున్నది. 1982 కేంద్ర చట్టం ప్రకారం చిట్‌ఫండ్ సంస్థలు ఇతర వ్యాపారాలు చేయరాదు. కానీ, చిట్‌ఫండ్ కంపెనీ తన చందాదారుల సొమ్మును ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోకి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ కర్ణాటక, తమిళనాడు విభాగాల్లోకి అక్రమంగా తరలించి వ్యాపారాలు చేస్తున్నది. కేవలం కమీషన్ సొమ్ముతో ఉషాకిరణ్ మీడియాలో 88.50 శాతం వాటా చిట్‌ఫండ్స్‌కు దాఖలా పడటం సాధ్యం కాదు. ఉషాకిరణ్ మీడియా పేరు మీద ఫిలింసిటీలో వందల ఎకరాల భూములు, ఆ భూముల్లో వెలసిన నిర్మాణాలున్నాయి. మరి మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు ఆ భూముల్లో గానీ, అక్కడి వ్యాపారంలో గానీ వాటా ఉండాలా వద్దా అనే విషయం కూడా ఆలోచించాలి. చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఏపీ సీఐడీ అధికారుల దర్యాప్తు జరుగుతున్నది. ఇంకెన్ని అక్రమాలు బయటపడతాయో చూడాలి.

ఇవి కొన్ని మాత్రమే. ఒక నేర సామ్రాజ్యపు దుర్నీతికి సంబంధించిన శాంపుల్స్ మాత్రమే. అయితే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నందు వలన దాని కుదుళ్లు కదులుతున్నాయి. ఫైనాన్షియర్స్ డిపాజిటర్ల జాబితా వెల్లడయితే అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు అవినీతి చక్రవర్తుల భాగోతం కూడా బయటపడవచ్చు. రాజధాని భూముల బినామీల వెనుక దాక్కున్న వారి బండారం కూడా ఇంకా బయటపడాల్సిన అవసరం ఉన్నది. అందుకే ఈ రాజకీయ - వ్యాపార ముఠా బెంబేలెత్తిపోతున్నది. ముఠా చేతిలో ఉన్న మీడియాను విచ్చలవిడిగా దుర్వినియోగపరుస్తున్నది. కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిపై ముసుగులు వేయాలని తాపత్రయపడుతున్నది. అభూతకల్పనలతో కూడిన రసాయన బాంబులను ప్రయోగిస్తున్నది. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ అగ్రస్థానంలో నిలబడినట్లు ప్రాజెక్ట్స్ టుడే సర్వేలో వెల్లడైతే యెల్లో మీడియా కళ్లు మూసుకుంది. జీడీపీ వృద్ధిరేటులో 11.43 శాతంతో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉంటే అది వారికి అసలు వార్తే కాదు. ఆహార ధాన్యాల దిగుబడిలో 20 శాతం వృద్ధిని నమోదుచేసి రికార్డు సృష్టిస్తే ఆ వార్తనూ తొక్కేశారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి దేశంలో అత్యుత్తమ పంటల బీమా స్కీమ్‌గా గౌరవం లభిస్తే వారి చెవికెక్కలేదు. ఆర్బీకే తరహా సేవలను తమ రాష్ట్రాల్లో అమలుచేయడానికి ఇప్పటికే అరడజను రాష్ట్రాలు ముందుకొస్తే వారికి కనిపించలేదు. తమ అక్రమాలను, అరాచకాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే ఆ కూటమి ఏకైక ఎజెండా. అందుకోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధం!

vardhelli1959@gmail.com

చెత్త కాగితాల గుట్ట 'ఈనాడు', గోబెల్స్‌ను తలదన్నిన రామోజీ: ఎన్టీఆర్

"రామోజీ దుర్మదాంధుడు, స్వార్థపరుడు. నాపై కత్తి పెత్తనం చేయాలని చూశాడు. అసత్యాన్ని అందలమెక్కించడమే అతని



లక్ష్యం. తిమ్మిని బమ్మిని చేయడమే అతని నైజం. ఇక చరిత్ర పెంట కుప్పల్లోనే మిగులుతాడు. జనం నిలదీసే రోజు ఎంతో దూరంలో లేదు. పత్రిక చేతిలో ఉందని చెత్తరాతలు రాస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు."

(వెన్నుపోటు అనంతరం ఒక ఇంటర్వ్యూలో ఎన్టీఆర్)

అనారోగ్యంతో మంచం మీద ఉంటే కాగితాల మీద సంతకాలు తీసుకున్నారు: సుమన్

"ఆస్పత్రిలో ఉన్నాను. రేడియేషన్ జరుగుతున్నది. నాన్నగారు కాల్ చేశారు. గ్లాస్ పట్టుకోవడానికి కూడా ఓపిక లేని పరిస్థితి. కార్డ్‌లెస్ ఫోన్ చెవి దగ్గర పెట్టారు అమ్మ. ఆయన నానామాటలు అంటున్నారు. నాకు ఒక్కటే ఏడుపు. అమ్మ వారిస్తోంది. అటువంటి సమయంలో నన్ను సపోర్ట్ చేయాల్సింది పోయి నానామాటలు అనాలా అని బాధపడ్డాను. ఇంట్లో మంచం మీద విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కాగితాల మీద సంతకాలు తీసుకొని 'ఈటీవీని నా నుంచి దూరం చేశారు."



('సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీ కుమారుడు సుమన్)

రామోజీని పెంచి పోషించింది మా నాన్నే: యూరీ రెడ్డి


"మా నాన్న జీజే రెడ్డి 'మార్గదర్శి' వ్యవస్థాపక డైరెక్టర్లలో ఒకరు. దాని సీడ్ క్యాపిటల్ కూడా ఆయనదే. మా నాన్న ఎన్నోసార్లు ఈ విషయం చెప్పారు. మార్గదర్శి, నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ వంటి కంపెనీలన్నీ ఇంటర్ లింక్డ్ అని చెప్పారు. మరణశయ్యపై నుంచి ఒక తండ్రి కుమారునితో చెప్పిన విషయాలను మీతో పంచుకుంటున్నాను. డాల్ఫిన్ హోటల్‌లో కూడా తన పెట్టుబడులున్నాయని నాన్న చెప్పారు. 'ఈనాడు' ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా తూర్పు జర్మనీ నుంచి నాన్నే తెప్పించారని మా అంకుల్స్ చెప్పారు. నాన్న జీవితంలో చాలా మందికి సాయం చేశారు. ఎంతో మందిని పెంచి పోషించారు. వారిలో రామోజీ కూడా ఒకరు."



('సాక్షి' ఇంటర్వ్యూలో యూరీ రెడ్డి)

అభివృద్ధీ... నీ పయనం ఎటు?

అభిప్రాయం



వనం జ్వాలా నరసింహారావు

ఏడు సంవత్సరాల క్రితం 87 ఏళ్ల వయసులో మరణించిన భవిష్యత్తు వాది ఆల్విన్ టాఫ్లర్ 'ఫ్యూచర్ షాక్' అనే పుస్తకాన్ని 1970లో రాశాడు. వేగవంతమైన మార్పు ప్రజలను పిచ్చిగా మార్చుతుందని అందులో ఊహించారు. ఆ ఊహ నిజమేనని నా అనుభవాలే చెబుతున్నాయి.

75 ఏళ్ల వయసులో, ముందూ వెనుకా ఐదు తరాల వాళ్లను చూసిన మాలాంటి వారికి అభివృద్ధి పేరుతో వివిధ రంగాలలో చోటుచేసుకుంటున్న కొన్ని మార్పులు గమనిస్తుంటే ఆశ్చర్యం సంగతి అటుంచి, ఏం చేయాలో పాలుపోని పరిస్థితి కలుగుతున్నది.

అన్నపూర్ణ లాంటి తెలుగు రాష్ట్రాలలో ఏ పట్టణంలో, ఏ హోటల్లో పోయినా కడుపునిండా తినే తెలుగువారి భోజనం దొరకదు. అన్నం, కూర, పప్పు, నెయ్యి, సాంబారు, రసం, గోధుమ పిండి రొట్టె, పూరీ లాంటి పదార్థాలతో భోజనం పెట్టే హోటళ్లు మచ్చుకైనా కానరావు. పేరుకు అన్నీ ఫైవ్ స్టార్, త్రీ స్టార్ హోటళ్లు. బిరియానీ, పలావ్, జింజర్ రైస్, పన్నీర్, మైదా పిండో మరేదో దానితో చేసిన బటర్ నాన్, నాన్, రోటీ, కుల్చా లాంటివి తినాల్సిందే. లేదా పస్తు ఉండాల్సిందే. 'పేదరాసి పెద్దమ్మ' సంస్కృతి రోజుల రుచికరమైన భోజనం, సత్రాల భోజనం, తరువాత కాలంనాటి ఉడిపి హోటళ్ళ భోజనాలు ఏమయ్యాయి?

డాక్టర్ దగ్గరికి పోతే పాతరోజుల్లాగా ఒంటి మీద చేయి వేసి, స్టెతస్కోప్ పెట్టి పరీక్ష చేసి, చూడడం గత చరిత్ర అయిపోయింది. గుడికి పోతే దేవుడి దగ్గర కొబ్బరికాయ కొట్టనివ్వరు. తీర్థం ఒకచోట, ప్రసాదం ఇంకొక చోట ఇస్తారు. వివిధ రకాల సేవల పేరు మీద ఛార్జీలు ఉంటాయి. మొదట్లో పెద్ద గుళ్లకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు గ్రామాలకు, చిన్నచిన్న దేవాలయాలకు కూడా పాకింది. అన్నింటికీ అనవసరమైన పరిమితులు.

ఇంటికి కావాల్సిన నెలవారీ సరుకులు ఒకప్పుడు హాయిగా దగ్గరలోని కొట్టుకుపోయి, స్వచ్ఛమైన, కల్తీలేని వాటిని, కొట్టువాడి ముందర పరీక్ష చేసి చూసుకుని, తూకం వేయించుకుని కొనుక్కునే వాళ్లం. ఇప్పుడు సంస్కృతి మారింది. పెద్దపెద్ద సూపర్ బజార్లలోకి పోయి, మనమే మనకు కావాల్సిన సామాన్లు వెతికి పట్టుకుని, ఒక బండిలో వేసుకుని తెచ్చుకోవాలి. అన్నీ ప్యాక్ చేసి ఉంటాయి. ఇన్ని గ్రాములు, ఇన్ని కేజీలు అని ఉంటుంది వాటిమీద. నిజంగా అంత తూకం ఉంటాయా లేదా అనేది సందేహమే! పైగా ఒక ఎక్స్‌పైరీ



డేట్ వేస్తారు. అందులో ఎంత కల్తీనో తెలుసుకునే మానిటరింగ్ మెకానిజం లేదనాలి. సరుకు తెచ్చుకున్న తరువాత ప్యాకెట్లు విప్పిచూస్తే కొన్నిట్లో పురుగులు ఉంటాయి. ఇదేంది అని అడిగితే పాకింగ్ చేసింది మేం కాదుకదా! అని జవాబు. ఇక మెడికల్ షాప్‌కు పోతే మనకు కావాల్సింది ఒక ఐదారు టాబ్లెట్స్ అయినా... షాపువాడు మొత్తం స్ట్రిప్ కొనమంటాడు. ఏ వస్తువు కొన్నా (ఫర్నిచర్ దగ్గర నుండి, ఎలక్ట్రానిక్ పనిముట్ల వరకు) వాటికి రిపేర్ వస్తే, కొన్న చోట కాకుండా వేరే వర్క్ షాప్‌కు వెళ్లాలి. వాళ్లకు ఫోన్ చెయ్యాలంటే, టోల్ ఫ్రీ అనే నెంబర్‌కు చేయాలి. అది ఏ దేశంలో ఉంటుందో తెలియదు. వాళ్లు 'ఒకటి నొక్కు, రెండు నొక్కు...' అంటూ డిస్కనెక్ట్ చేస్తారు.

అసలు చిన్న చిన్న దుకాణాల సంస్కృతి పూర్తిగా పోవడం చాలా దురదృష్టకరం. చిన్నతనంలో తెల్ల కాగితాలు, పెన్సిల్, సిరా బుడ్డి, పిప్పరమింట్లు, చాక్లెట్లు, నువ్వుల జీడీలు, బిస్కట్లు లాంటివి కొనుక్కోవడానికి అక్కడక్కడ చాలా చిన్నచిన్న దుకాణాలు ఉండేవి. ఇప్పుడు చిన్న గుండు సూది కొనాలన్నా పెద్ద షాపునకు పోవాల్సిందే! అధిక ధరలు చెల్లించాల్సిందే. ఇంటి ముందుకు, తాజా కూరగాయలు తెచ్చి అమ్మే రోజులు పోయి కూరగాయల మార్కెట్లు వెలిశాయి. వాటిమీద బతికేవారు ఉపాధి కోల్పోయారు.

ఫ్యామిలీ డాక్టర్ సంస్కృతీ పోయింది, పరాయి ఊరుకు వెళ్లినప్పుడు బంధువుల ఇళ్లలో ఉండే అలవాటు పోయింది. చక్కటి, చిక్కటి స్వచ్ఛమైన పాలను ఇంటి ముందర కొనుక్కునే ఆచారం పోయింది. ఇంటి వెనుక పెరుగు చిలికిన చల్ల కడుపు నిండా తాగే రోజులు పూర్తిగా పోయాయి. వేరు శనగపప్పుతో ఎవరికివారు శనగ నూనె చేయించుకుని ఏడాది పొడుగూతా వాడే అలవాటు పోయింది. నడక ప్రయాణం కనుమరుగైంది. కడుపు నిండా భోజనం తినే సంస్కృతి స్థానంలో పిజ్జా, బర్గర్స్ వచ్చాయి. స్వచ్ఛమైన వెన్న, నెయ్యి లభ్యమయ్యే ప్రదేశాలు మచ్చుకైనా లేవు. జొన్న చేలలో ఉప్పు, కారం కలుపుకున్న దోసకాయలు తినే రోజులు ఇకరావేమో! చేలల్లో పెసరకాయలు వలుచుకు తినే అదృష్టం ఇక లేనట్టేనేమో. అన్నీ ఫాస్ట్ ఫుడ్సే. పెరుగు, నెయ్యి, పాలు, తేనె, కూరలు, నూనె, ఒకటేమిటి... అన్నీ ప్యాక్ చేసిన (కల్తీ) ఆహారాలే! చివరకు సీజనల్ పండ్లు కూడా కలుషితమైనవే! కాలుతీసి కాలు బయట పెట్టకుండా, కనీస వ్యాయామం లేకుండా, ఒంటికి చెమట పట్టకుండా, నిరంతరం ఏసీ గదుల్లో ఉంటూ అన్నీ ఇంటి ముంగిటే పొందడం! బాత్రూమ్ కూడా బెడ్రూమ్‌కు అనుబంధమే! ఇలా రాసుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. ఇలా ఎన్నో కోల్పోతున్నాం. ఇంకా ఎన్ని కోల్పోవాలో? ఇదంతా చూస్తూ, అనుభవిస్తూ 'అభివృద్ధీ నీ పయనం ఎటువైపు?' అని నిట్టూర్చడం కన్న చేయగలిగిందేముంది?

వ్యాసకర్త తెలంగాణ సీఎం సీపీఆర్‌ఓ

పుస్తకమే నేస్తం

పుస్తకం ఓ మంచి నేస్తం. ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్నఆనందం అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చూపెట్టే సాధనంగా పుస్తకం దోహద పడుతుంది. కాలం ఎంత మారినా పుస్తక ప్రియులకు కొదవ లేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ లాంటి అనేక ఆధునిక సాంకేతికత సాధనాలు అందుబాటులోకి వచ్చినా పుస్తక పఠనాన్ని ఇష్టపడేవారూ గణనీయంగానే ఉన్నారని యునెస్కో చెప్పింది.

మనదేశంలో ఐదు ప్రముఖ పుస్తక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ కొత్త పుస్తకాలే కాదు పాత పుస్తకాలూ... మరెక్కడ దొరకని అరుదైన గ్రంథాలూ లభిస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న దరియాగంజ్, నయీ సడక్ బుక్ మార్కెట్లు ప్రసిద్ధి గాంచాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఉండే పుస్తక మార్కెట్‌ను వారసత్వంగా వస్తున్న ఆస్తిగా పేర్కొంటారు. మనదేశంలో అతి పెద్ద పుస్తక మార్కెట్ ఇది. పుణేలోని అప్పా బల్వంత్ చౌక్‌లో ఉండే పుస్తక మార్కెట్‌లో ప్రపంచంలో విలువైన పుస్తకాలన్నీ లభ్యమవుతాయి. హైదరాబాద్‌లోని కోఠి కూడా విలువైన పుస్తకాలకు కేంద్రంగా ఉంది. నేడు సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో... పసి పిల్లాడి నుంచి పెద్దల వరకు విలువైన కాలాన్ని ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ఈ సమయంలో కొంతైనా పుస్తక పఠనానికి ఉపయోగిస్తే మేలు కలుగుతుంది. చిన్నప్పటి నుంచి పిల్లల్లో కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే... అదే అలవాటుగా మారి యువతరం అన్ని విషయాల్లో పోటీపడి మంచి భవిష్యత్తును నిర్మించుకుంటుంది.

– సంపతి రమేష్ మహారాజ్, సామాజిక విశ్లేషకులు

(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)

క్లుప్తంగా...

విద్యుత్ షాక్‌తో జవాన్ మృతి



మహేంద్ర కుమార్

వాజేడు: సెలవుపై ఇంటికి వచ్చిన ఐటీబీపీ జవాన్ విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని శ్రీరామ్‌నగర్‌లో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. తాటి మహేంద్ర కుమార్ (29) ఐటీబీపీ 53 బెటాలియన్‌లో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా సోంపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత ఏడాది హనుమకొండ జిల్లాకు చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ఈ మధ్యనే వారికి పాప పుట్టింది. భార్యాబిడ్డలతో గడపాలని నెల రోజులపాటు సెలవు పెట్టి మార్చి 30న సొంత ఊరైన శ్రీరామ్‌నగర్ వచ్చాడు. శనివారం కూలర్‌లోని నీటిపంపు పనిచేయకపోవడంతో దానిని పరిశీలిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కుగురై మహేంద్ర కింద పడి పోయాడు. ఈ విషయాన్ని గమనించిన ఆయన భార్య, ఇతర కుటుంబ సభ్యులు మహేంద్రను మొదట వాజేడు, అక్కడినుంచి ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. మహేంద్ర కుమార్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందిననట్లు తెలిపారు. బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సీనియర్ నటుడు శరత్ బాబుకు తీవ్ర అస్వస్థత



సాక్షి, హైదరాబాద్: తీవ్ర అస్వస్థతకు గురైన సీనియర్ సినీ నటుడు శరత్ బాబు (71) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. శరత్‌బాబు గుండె, ఊపిరితిత్తులు తదితర వృద్ధాప్య సమస్యలతో దాదాపు 3 వారాల క్రితం బెంగళూరులోని ఒక ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఆయనను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి గురువారం మధ్యాహ్నం తరలించారు. అప్పటి నుండి వెంటిలేటర్‌పైనే చికిత్స పొందుతున్నారని సమాచారం. వివిధ అవయవాల పనితీరు దెబ్బ తినడంతో ఆయన పరిస్థితి విషమంగానే ఉందని సమాచారం.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలి



సాక్షి, కామారెడ్డి: ప్రజా పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, భౌగోళిక తెలంగాణ వచ్చినా ప్రజా తెలంగాణ రాలేదని సీపీఐ(ఎంఎల్) జనశక్తి కేంద్ర కమిటీ నాయకుడు కూర రాజన్న పేర్కొన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల తనపై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విచారణ నిమిత్తం షరతులతో కూడిన బెయిల్‌పై శనివారం కామారెడ్డికి వచ్చిన రాజన్న..విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే కాదని, వలసవాద దోపిడీదారులు, పెట్టుబడిదారులపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మా పార్టీ, ప్రజా సంఘాలు ఆరేడేళ్లగా ఎక్కడా చందాలు అడగలేదని, కానీ కామారెడ్డి పోలీసులు తాను జైలులో ఉండగానే చందాల కోసం బెదిరించినట్లు కేసులు పెట్టారని ఆరోపించారు.

ఊళ్లకు ఆర్టీసీ ప్రతినిధులు

వచ్చే నెల నుంచి రంగంలోకి 2 వేల మంది విలేజ్ బస్ ఆఫీసర్లు

- పక్షానికోమారు గ్రామస్తులతో భేటీ, వివరాల సేకరణ
- ఆసక్తిగల డ్రైవర్లు, కండక్టర్లకు ఐదేసి ఊళ్లకు మించకుండా బాధ్యతలు
- ప్రైవేటు వాహనాల దూకుడుకు కళ్లెం వేసి ఆదాయాన్ని పెంచుకొనే ఉద్దేశం



సాక్షి, హైదరాబాద్: పల్లెలకు క్రమంగా ఆర్టీసీ బస్సులు దూరమై ప్రయాణికులకు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు చేరువగా మారుతున్న తరుణంలో ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ పేరుతో తమ ప్రతినిధులను పల్లెబాట పట్టించనుంది. ప్రతి ఊరిలోనూ తమ ప్రతినిధిని అందుబాటులో ఉంచనుంది. గ్రామాలకు ప్రజారవాణా అవసరాలేంటో గుర్తించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఒక్కో ప్రతినిధికి ఐదు ఊళ్లకు మించకుండా బాధ్యత అప్పగించేలా మే ఒకటో తేదీ నుంచి 2 వేల మంది ప్రతినిధులను రంగంలోకి దింపనుంది. రెగ్యులర్ డ్యూటీ చేస్తూనే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఈ ప్రతినిధుల బాధ్యత భుజానికెత్తుకోనున్నారు. వీక్లీ ఆఫ్, ఇతర సెలవు రోజుల్లో వారు గ్రామాలకు వెళ్లి గ్రామస్తులు, సర్పంచులతో చర్చించి ఆయా ఊళ్లు ఆర్టీసీ నుంచి ఏం కోరుకుంటున్నాయో, ఆయా ఊళ్ల ద్వారా ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఆర్టీసీకి ఉన్న అవకాశాలేంటో తెలుసుకోనున్నారు.

ప్రజలు బస్సెక్కేలా చేయడమే లక్ష్యం...

రాష్ట్రంలో 12,769 గ్రామాలున్నాయి. గతంలో కొన్ని ప్రాంతాలకు తప్ప మిగతా ఊళ్లకు పల్లెవెలుగు/ఇతర కేటగిరీల ఆర్టీసీ బస్సులు నడిచేవి. కానీ ఏడెనిమిది ఏళ్లుగా ఆదాయం కోసం శ్రమిస్తున్న ఆర్టీసీ... ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉన్న గ్రామాలకు ట్రిప్పులు తగ్గించి ఆదాయం ఎక్కువగా ఉండే మార్గాలకు మళ్లించింది. కొత్త బస్సులు కొనేందుకు నిధుల్లేకపోవడంతోపాటు సర్వీసుల సంఖ్య తగ్గిపోవడం ఇందుకు ప్రధాన కారణమైంది. అద్దె బస్సుల సంఖ్య పెరగడం, వాటి నిర్వాహకులు ఆదాయం ఉన్న మార్గాలపైనే దృష్టి పెట్టడంతో వేల సంఖ్యలో ఊళ్లకు ఆటోలే దిక్కయ్యాయి. ఈ తరుణంలో ప్రజారవాణాను మెరుగుపరిచి గతంలోలాగా ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణించేలా చేయాలన్నది యాజమాన్యం లక్ష్యం.

నెలకు రూ. 300 అదనపు చెల్లింపులు!

ఊళ్లతోపాటు హైదరాబాద్ సహా ఇతర మున్సిపాలిటీల్లో కూడా వార్డులు, డివిజన్ల బాధ్యతను ఆర్టీసీ ప్రతినిధులకు అప్పగించనున్నారు. వారికి నెలకు రూ. 300 వరకు అదనంగా చెల్లించనున్నట్లు తెలిసింది. ప్రతి మూడు నెలలకు సమీక్షించి ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందించనుంది. అయితే కేవలం బస్సులు నడిచే ఊళ్ల బాధ్యతే అప్పగిస్తారా, బస్సు సౌకర్యంలేని ఊళ్ల బాధ్యత కూడా ఉంటుందా అన్నది ఇంకా తెలియరాలేదు. కాగా, ఆర్టీసీ చేపట్టే అన్ని కార్యక్రమాలను ప్రజలు ఎంతో గొప్పగా ఆదరిస్తున్నారని, ఈ తాజా నిర్ణయానికి కూడా సానుకూలంగా స్పందించి ఆదరిస్తారని ఆశిస్తున్నట్టు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ సజ్జనార్ పేర్కొంటున్నారు.

ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ విధులు ఏమిటంటే..?

- ప్రతి 15 రోజులకోసారి ఊళ్లకు వెళ్లి సర్పంచులు, సాధారణ ప్రజలతో కలసి ఆయా ఊళ్ల రవాణా అవసరాలపై వివరాలు సేకరించాలి.
- ప్రజలు ప్రైవేటు వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా చైతన్యపరచాలి.
- ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటే అదనంగా ట్రిప్పులు అవసరమన్న విషయాన్ని అధికారులకు తెలియజేయాలి.
- ఆయా ఊళ్లలో ఉత్సవాలు, జాతరలు, పెళ్లిళ్ల తేదీల వివరాలు సేకరించి వాటి రూపంలో ఆదాయం పెంచుకొనే అవకాశం ఉందన్న విషయాన్ని అధికారులకు చెప్పాలి.
- ఇతర రోజుల్లో కూడా తమకు వివరాలు ఫోన్ చేసి చెప్పొచ్చని గ్రామీణులను కోరాలి.

ఆస్పత్రిలో తల్లి, శిశువు మృతి

- సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో ఘటన
- వైద్యుల నిర్లక్ష్యంతోనే అంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



రేణుక (ఫైల్)

సంగారెడ్డి మున్సిపాలిటీ: వైద్యుల నిర్లక్ష్యం ఓ మహిళకు గర్భశోకాన్ని మిగల్చడంతోపాటు, ఏకంగా ఆమె ప్రాణాలనే బలితీసుకుందంటూ ఆమె కుటుంబసభ్యులు ఆందోళనకు దిగిన ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా...సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్ కిషన్‌నాయక్‌తండాకు చెందిన రాథోడ్ రేణుక (20) పురిటి నొప్పులతో ఈనెల 20న జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరింది. మరునాడు గురువారం నొప్పులు ఎక్కువ వస్తుండటంతో ఆపరేషన్ చేసి డెలివరీ చేయాలని రేణుక కుటుంబసభ్యులు వైద్యులను కోరారు. అయితే, శుక్రవారం నార్మల్ డెలివరీ చేసి శిశువుని బయటకు తీశారు. శిశువు మృతి చెందింది. ప్రసవ సమయంలో రేణుక గుండె కొట్టుకోవడం ఆగిపోయిందని, దీంతో శిశువు చిక్కుకుపోయిందని వైద్యులు చెప్పారు. వెంటనే ప్రత్యేక వైద్య విధానంతో శిశువును బయటకు తీయగా, శిశువు మృతి చెందినట్లు చెప్పారు. రేణుకను వెంటిలేటర్‌పై ఉంచినా ఫలితం లేకపోయిందని, ఆమె శనివారం మృతి చెందినట్టు ప్రకటించారు. అయితే, వైద్యుల నిర్లక్ష్యంతోనే తల్లి, శిశువు మరణించారంటూ రేణుక కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. అంతలోనే పోలీసులు వచ్చి సర్ది చెప్పి పంపారు. ఇది రేణుకకు తొలి కాన్పు అని, తమ కలల పంటను కనులారా చూసుకుందామనుకుంటే బిడ్డతోపాటు తల్లిని కూడా పోగొట్టుకున్నామని రేణుక కుటుంబ సభ్యులు విలపించారు. రేణుక కుటుంబసభ్యులు సంగారెడ్డిటౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రేణుక అంత్యక్రియలు వాసర్ కిషన్‌నాయక్ తండాలో నిర్వహించారు. రేణుక భర్త రాజు పటాన్‌చెరువులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు.



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

డాక్టర్ల నిర్లక్ష్యం లేదు: డాక్టర్ అనిల్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

బీపీ ఎక్కువ కావడంతో నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రి నుంచి మా ఆస్పత్రికి రిఫర్‌పై వచ్చారు. బీపీని కంట్రోల్ చేసేందుకు మందులు, ఇంజెక్షన్లు ఇచ్చాము. నార్మల్ డెలివరీకి అవకాశం ఉండటంతో అలాగే చేశాం. ఫిట్స్ రావడంతో గుండె ఆగిపోయింది. వెంటిలెటర్‌పై చికిత్స అందించిన ప్రయోజనం లేకపోయింది. వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదు.

కేసీఆర్‌కు అన్నదాతలను ఆదుకుందామన్న సోయి లేదు



సాక్షి,హైదరాబాద్: అన్నదాతలను ఆదుకుందామన్న సోయి కేసీఆర్‌కు లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి ఎకరాకు పది రోజుల్లో పరిహారం ఇస్తామని రైతులను మోసం చేశారని శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. తొలుత 2.28 లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని లెక్కలుగట్టి చివరకు 1.51లక్షల ఎకరాల్లో మాత్రమేనని తేల్చి రైతుల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. నష్టపోయిన ప్రతి ఎకరా వరి పంటకు రూ.25వేలు, మిర్చి, మొక్కజొన్న పంటకు రూ.50వేలు, మామిడికి రూ.75 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, అఖిల పక్షం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగ దీక్ష చేపట్టనున్నట్లు వైఎస్సార్‌టీపీ ప్రకటించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం దీక్షకు ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ నేత పిట్ట రాంరెడ్డి తెలిపారు.

వీవోఏల సమ్మె విరమింపజేయాలి

సాక్షి, హైదరాబాద్: ఐకేపీలోని విలేజ్ గ్రామ సమాఖ్య సహాయకులు (వీవోఏ) చేస్తున్న సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఈమేరకు ఆయన శనివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, పదోన్నతులతో పాటు, సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ల సాధనకు చాలా కాలంగా పలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వ స్పందన లేకపోవడంతో ఆరు రోజులుగా మండల కేంద్రాల్లో నిరవధిక సమ్మెకు దిగారని పేర్కొన్నారు.

జేపీఎస్‌ల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం రంగారెడ్డి జెడ్పీహాల్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎస్. శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం జీవో 317 ద్వారా నష్టం జరిగిన పంచాయతీ సెక్రటరీలకు న్యాయం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించాలని, కేడర్ పెంచి ప్రమోషన్లతో పాటు బదిలీలు చేపట్టాలని సమావేశంలో తీర్మానాలు చేసినట్టు ఆయన తెలిపారు.

2018 టైగర్ సెన్సస్‌లో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లలో 26 పులులున్నట్టు వెల్లడి

2022 సెన్సస్ కల్లా అమ్రాబాద్‌లోనే 26, కవ్వాల్‌లో ఆరేడు ఉంటాయని అంచనా

తాజాగా 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022'నివేదికలో సర్వే వివరాల ప్రకటన...



రాష్ట్రంలో పెద్ద పులుల గాండ్రింపు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెద్ద పులులు సందడి చేస్తున్నాయి. తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు కలిపి 2018 టైగర్ సెన్సస్‌లో 26 పులుల జనాభాతో పోల్చితే తాజాగా 2022లో చేసిన సెన్సెస్‌లో వాటి సంఖ్య 30కు పైగా చేరుకుని ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంఖ్యాపరంగా ఇది ఎంతో వృద్ధి చెందినట్టుగా భావించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ప్రాజెక్ట్ టైగర్'ను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మైసూరులో ప్రధాని మోదీ '50 ఇయర్స్ ఆఫ్ టైగర్ ప్రాజెక్ట్'పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022'సర్వే రిపోర్ట్‌ను విడుదల చేశారు. ఈ సర్వేలో 'పులుల ఉనికి', అవి స్థిరనివాసం ఏర్పరుచుకోడానికి అమ్రాబాద్‌లో అత్యంత సానుకూల పరిస్థితులున్నట్టు వెల్లడైంది. పులుల కదలికలు, ఇతర అంశాలను తెలియజేసే మ్యాప్‌ల్లోనూ అమ్రాబాద్‌లో పులుల మనుగడ, సంరక్షణకు ఆరోగ్యకరమైన వాతావరణమున్నట్టు స్పష్టమైంది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకున్న పులులు తగ్గిపోయినట్టు తెలుస్తోంది.



అమ్రాబాద్ వెరీగుడ్‌లోకి..

గతంలో గుడ్ కేటగిరీలో ఉన్న అమ్రాబాద్ వెరీగుడ్‌లోకి, కవ్వాల్ గుడ్ కేటగిరిలోనే కొనసాగినట్టు వెల్లడైంది. కవ్వాల్ టైగర్ రిజర్వ్ నిర్వహణకు సంబంధించిన మరి కొన్ని పాయింట్లు సాధించి ఉంటే వెరీగుడ్ కేటగిరిలోకి వెళ్లి ఉండేదని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. 2018లో అమ్రాబాద్‌లో 18, కవ్వాల్‌లో 8 పులులు ఉన్నట్టుగా అప్పటి నివేదిక ద్వారా తెలిసింది. 2022 నాటికి ఒక్క అమ్రాబాద్‌లోనే 26కు పైగా పెద్దపులులు (4 పులి పిల్లలతో సహా), కవ్వాల్‌లో, టైగర్ కారిడార్ ఏరియాలు కలిపి ఆరేడు పెద్దపులులు ఉండొచ్చునని అధికారులు, నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తంగా చూస్తే పులుల సంఖ్య వృద్ధితో పాటు వాటికి పరిరక్షణకు అనుకూల వాతావరణముందని సాక్షికి అటవీశాఖ వైల్డ్ లైఫ్ ఓఎస్డీ ఎ.శంకరన్ తెలిపారు. కాగా, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వెరీగుడ్ నుంచి ఎక్స్‌లెంట్ కేటగిరీలోకి వెళ్లేందుకు బేస్‌క్యాంప్‌ల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉందని డీఎఫ్‌వో రోహిత్ గొప్పిడి అభిప్రాయపడ్డారు.

బియ్యం సరఫరాలో మిల్లర్ల చేతివాటం

- 45 రోజుల్లోగా ఆ బియ్యాన్ని మార్చండి
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రేషన్ దుకాణాలు, పాఠశాలలు, హాస్టళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరా చేసిన రైస్ మిల్లర్లపై పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 జిల్లాలకు చెందిన మిల్లర్లు 75 ప్రాంతాలకు సరఫరా చేసిన బియ్యం నాణ్యత లేదని తేలడంతో.. వెంటనే వాటిని మార్చి నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని ఆయన ఆదేశించారు. 96 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్, రిటైర్డ్ ఎఫ్‌సీఐ ఉద్యోగులతో శనివారం నిర్వహించిన సమావేశంలో రవీందర్ సింగ్ మాట్లాడారు. బియ్యం సరఫరాలో మిల్లర్ల చేతివాటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంత్రి గంగుల కమలాకర్ తక్షణ చర్యలకు ఆదేశించారని తెలిపారు. నాణ్యతలేని బియ్యాన్ని ఇచ్చిన మిల్లర్లు 45 రోజుల్లోగా మేలురకం బియ్యాన్ని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అవకతవకలకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న 12 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించినట్లు తెలిపారు.

ప్రీతి ఆత్మహత్య చేసుకోలేదు

- వరంగల్ ఏసీపీకి ఫిర్యాదు చేసిన ప్రీతి తండ్రి, సోదరుడు
- సీపీ రంగనాథ్‌ను సైతం కలిసిన బాధితులు
- ప్రీతి మృతి ఘటనలో అనుమానాలున్నాయని వెల్లడి

ఎంజీఎం: డాక్టర్ ప్రీతి ఆత్మహత్య చేసుకోలేదని.. ఆమె తండ్రి ధారావత్ నరేందర్, సోదరుడు పృథ్వీ పేర్కొన్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకుందని శుక్రవారం సీపీ రంగనాథ్ అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం వారు ముందుగా వరంగల్ ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. ప్రీతి ఘటన విచారణ అధికారి అయిన ఏసీపీ బోనాల కిషన్‌ను కలసి ఆమె మృతిపై ఉన్న అనుమానాలను మరోసారి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కూడా కలిశారు. ఏసీపీ కార్యాలయం వద్ద ప్రీతి సోదరుడు పృథ్వీ మీడియాతో మాట్లాడుతూ, ప్రీతిది ఆత్మహత్య అని చెప్పడానికి ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఎలా నిర్ధారణ చేస్తారని ప్రశ్నించారు. 'మా సోదరి ప్రీతిది ఆత్మహత్య కానేకాదు. పోస్టుమార్టం రిపోర్టు.. శరీరంలో పాయిజన్ ఉందా, లేదా అనే విషయం మాత్రం తెలుపుతుంది. కానీ తనంతటతానే పాయిజన్ తీసుకుందని చెప్పదు కదా! నిందితుడు సైఫ్ వేధించిన విధానంపై మేము ఇచ్చిన కాల్ రికార్డ్స్, వాట్సాప్ చాట్ ఆధారంగానే పోలీసులు 306 సెక్షన్ కింద కేసు పెట్టారు. ఈ విషయంలో పోలీసులు వేరే ఆధారాలు ఏమీ సేకరించలేదు'అని తెలిపారు. ఈ ఘటనపై 99 శాతం విచారణ చేశామని పోలీసులు పేర్కొంటున్నారని, అయితే అందులో నిజం లేదని చెప్పారు. ఎంజీఎం ఆస్పత్రిలో సీజ్ చేసిన గదిని సైతం అన్‌సీజ్ చేశారని, పోలీసులు, మేము అక్కడకి చేరకముందే ఎంజీఎం అధికారులు సాక్ష్యాలను చెరిపేశారని ఆరోపించారు. ప్రీతిపై జరిగిన వేధింపులపై కళాశాల యాజమాన్యానికి, హెచ్‌ఓడీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఈ కేసులో సైఫ్ కాకుండా ఇతర అనుమానుతులపై చర్యలు లేవని ప్రీతి సోదరుడు పేర్కొన్నారు.

నేను పోలీసులను వ్యతిరేకించడం లేదు: ప్రీతి తండ్రి నరేందర్

ప్రీతి ఘటనలో పోలీసుల విచారణను తాను వ్యతిరేకించడం లేదని, తనకు న్యాయం చేయాలని మాత్రమే వేడుకుంటున్నానని ఆమె తండ్రి ధారావత్ నరేందర్ పేర్కొన్నారు. ప్రీతి మరణం విషయంలో తమకు అనుమనాలు ఉన్నాయని, ఆ అనుమానాలతో పలు అంశాలపై వరంగల్ ఏసీపీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి శిక్ష పడాలని, మరే అమ్మాయికి కూడా ఇలాంటి పరిస్థితి రావద్దని కోరుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఓడీ కౌన్సెలింగ్ చేసిన తరువాత తన కూతురు ఏడ్చుకుంటూ వచ్చిందని.. భరోసా ఇవ్వాల్సిన వైద్యాధికారి తీరు సరిగ్గా లేదని అన్నారు. 'హెచ్‌ఓడీ తనను ఫెయిల్ చేస్తాడు. ఇంకా మూడేళ్లు చదుకోవాల్సి ఉంది' అన్న భావనతో భయభ్రాంతులకు గురైనట్లు పేర్కొన్నారు. హెచ్‌ఓడీ నాగార్జునరెడ్డి.. డీఎంఈ రమేశ్‌రెడ్డి బంధువు కాబట్టే ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. ప్రీతి కళ్లు తిరిగి పడిపోయింది అని సమాచారం వచ్చిన 7 నిమిషాల్లోనే ఆస్పత్రిలో ఉన్నానని, అప్పటికే తన కూతురు వెంటిలెటర్‌పై ఉందని ఆయన చెప్పారు. ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు. అలాగే ఘటన ప్రదేశంలో పాయిజన్ లాంటి ఎలాంటి ఇంజక్షన్ కూడా దొరకలేదని పోలీసులు పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయంపై వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌ను వివరణ కోరగా ప్రీతి తండ్రి కళాశాల యాజమాన్యం, హెచ్‌ఓడీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారని తెలిపారు. పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు.



సీపీ రంగనాథ్‌తో మాట్లాడుతున్న ప్రీతి తండ్రి ధారావత్ నరేందర్, సోదరుడు పృథ్వీ

క్లుప్తంగా...

సెప్టెంబర్‌లో భారత్‌కు బైడెన్



వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వచ్చే సెప్టెంబర్‌లో మొదటిసారిగా భారత్‌కు రానున్నారు. భారత్‌లో జరిగే జీ–20 శిఖరాగ్రంలో ఆయన పాల్గొంటారని సహాయ మంత్రి (దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాలు) డొనాల్డ్ లూ తెలిపారు. పర్యటనకు సంబంధించిన సన్నాహాలు సాగుతున్నాయన్నారు. జీ–20 అధ్యక్షస్థానంలో ఉన్న భారత్ నాయకత్వ లక్షణాలు మరింత విస్తృతమై బలమైన దేశంగా నిలుస్తోందన్నారు. అమెరికా–భారత్ సంబంధాల్లో వచ్చే ఏడాది అత్యంత కీలకం కానుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా అపెక్, జపాన్ జీ–7తోపాటు క్వాడ్ కూటమి సదస్సులు వచ్చే ఏడాది జరగనున్నాయి. వీటితో భారత్–అమెరికా మరింత సన్నిహితమయ్యే అవకాశాలు పెరుగుతాయని లూ అన్నారు.

5 రోజులు ఎండల నుంచి ఉపశమనం: ఐఎండీ

న్యూఢిల్లీ: దేశంలో వారం రోజులుగా ఎండలు, వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. రానున్న అయిదు రోజుల్లో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో వడగాలులు వీసేందుకు అవకాశాలు లేవని అంచనా వేసింది. తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలపై అల్పపీడన ద్రోణి ఏర్పడిందని తెలిపింది. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మొత్తమ్మీద ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్, దక్షిణ కర్ణాటక, యూపీ, పంజాబ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన గాలి వాన కురుస్తుందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది.


ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో కద్లా అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. వీరిని ఏరియా కమిటీ సభ్యురాలు(ఏసీఎం), భోరందేవ్ కమిటీ కమాండర్ సునీత, విస్తార్ దళానికి చెందిన ఏసీఎం సరితా ఖటియా మోచాగా గుర్తించారు. వీరిద్దరి తలలపై రూ.14 లక్షల చొప్పున రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. వీరి వద్ద తుపాకులు, మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం దొరికిందన్నారు. వీరిద్దరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన వారిగా భావిస్తున్నారు.

స్వింగ్ ఎటో?

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ 84 సీట్లు కీలకం

- 2018లో వాటిలో 56 స్థానాలు బీజేపీకే
- దాన్ని పునరావృతం చేసేలా వ్యూహాలు
- ఈసారి వాటిలో ఎలాగైనా పాగా వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు



కిత్తూరు కర్ణాటకలో (గతంలో ముంబై కర్ణాటక) రాన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న సెంటిమెంట్ ఉంది. 1957 సంవత్సరం నుంచి రాన్ నియోజకవర్గం ప్రజలు అధికారంలోకి వచ్చే పార్టీ అభ్యర్థినే ఎన్నుకుంటూ వస్తున్నారు. ఒకే పార్టీని వరుసగా రెండుసార్లు గెలిపించే సంప్రదాయం ఇక్కడ లేదు. మొత్తం 224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీలో ఇలా ఓటరు తీర్పు తిరగరాసే నియోజకవర్గాలు రాన్‌తో సహా 84 ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా పనిచేస్తుందని, అందుకే ఏ పార్టీ కూడా రెండోసారి గెలవడం కష్టంగా మారిందని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎ. నారాయణ అభిప్రాయపడ్డారు.

2018 : స్వింగ్ స్థానాల్లో బీజేపీ స్వీప్

- లింగాయత్‌లకు గట్టి పట్టున్న ముంబై కర్ణాటక ప్రాంతంలో 19 స్వింగ్ సీట్లున్నాయి. 2013 ఎన్నికల్లో బీజేపీ ఈ స్థానాలన్నింటిలోనూ విజయం సాధించింది
- సెంట్రల్ కర్ణాటకలో 20 స్వింగ్ సీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో లింగాయత్, వొక్కలిగలు పట్టుంది. గత ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 16 స్థానాల్లో నెగ్గింది.
- బీజేపీకి కంచుకోటగా భావించే కోస్తా కర్ణాటకలో అత్యధిక స్థానాలు స్వింగ్ సీట్లుగా పేరొందాయి. ఈ ప్రాంతంలో 19 స్థానాలకు గానే 10 స్వింగ్ సీట్లుగా ఉన్నాయి. 2018 ఎన్నికల్లో అన్ని స్వింగ్ స్థానాలను బీజేపీ స్వీప్ చేసింది. 20% మంది ముస్లిం జనాభా ఉన్న ఈ ప్రాంతంలో విభజన రాజకీయాలే కీలకం.
- హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో 12 స్వింగ్ సీట్లు బీజేపీ కైవశం చేసుకుంది. రాష్ట్రంలో ఈ ప్రాంతం అత్యంత వెనుకబడి ఉంది.
- దక్షిణ కర్ణాటకలో మొత్తం స్థానాలు 46 కాగా అందులో స్వింగ్ సీట్లు 14 ఉన్నాయి. వొక్కలిగల ప్రాబల్యం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో జేడీ(ఎస్) సగం స్వింగ్ స్థానాలైన ఏడింటిలో విజయం సాధించింది. బీజేపీ నాలుగు, కాంగ్రెస్ మూడు స్థానాలను దక్కించుకున్నాయి.
- బెంగళూరు నగరంలో రెండు స్వింగ్ సీట్లు బీజేపీ ఖాతాలోకే వెళ్లాయి.

స్వింగ్ స్థానాల్లో పట్టుకు బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాలు

లింగాయత్‌లకు పట్టున్న స్థానాలు, మత విభజన రాజకీయాలకు కేంద్రమైన కోస్తా కర్ణాటకలో 2018 ఎన్నికల్లో బీజేపీ స్వింగ్ స్థానాలన్నింటినీ స్వీప్ చేసింది. మొత్తం 84 స్వింగ్ స్థానాలకు గాను బీజేపీ ఖాతాలో 56 ఉన్నాయి. దశాబ్దాల గణాంకాలను పరిశీలిస్తే ఈ స్థానాల్లో బీజేపీ నెగ్గే అవకాశాలు లేవు. అందుకే బీజేపీ ఎన్నికలకు చాలా రోజుల ముందు నుంచి ఈ స్థానాలపై దృష్టి సారించింది. వీటిలో 30 స్థానాల్లో లింగాయత్‌లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. లింగాయత్‌లు బీజేపీ వైపు నిలుస్తూ ఉండడంతో ఆ స్థానాలు తిరిగి నిలబెట్టుకోగలమన్న కమలదళం ధీమాగా ఉంది. అధికార వ్యతిరేకత, బొమ్మై ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, ముస్లింలకు 4 శాతం కోటాలో కోత, పెరిగిపోతున్న ధరలు వంటివన్నీ బీజేపీకి మైనస్‌గా మారాయి. వీటన్నింటినీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్‌తో కప్పిపుచ్చే వ్యూహాలు రచిస్తోంది. అంతే కాకుండా చాలా నియోజకవర్గాల్లో కొత్త ముఖాలకు టికెట్లు ఇచ్చింది. తద్వారా అధికార వ్యతిరేకతను అధిగమించవచ్చునని వ్యూహరచన చేసింది. అయితే మోదీ ఇమేజ్ అసెంబ్లీ ఎన్నికలకు పని చేసే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ''నరేంద్ర మోదీ పట్ల ప్రజల్లో ఎంతో ఆకర్షణ ఉన్నప్పటికీ ఆయనను స్థానికుడిగా చూడలేరు. పార్లమెంటు ఎన్నికల్లో ఆయన ఇమేజ్ పని చేస్తుందే తప్ప శాసనసభ ఎన్నికల్లో పని చేసే అవకాశం లేదు'' అని ఎన్నికల విశ్లేషకుడు చేతన్ చౌహాన్ పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాల్లో పాగా వెయ్యడానికి పకడ్బందీ వ్యూహాలనే రచించింది. స్థానికంగా బలంగా ఉన్న అభ్యర్థుల్ని ఎంపిక చేయడంతో పాటు మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ రాకతో లింగాయత్ ఓటు బ్యాంకును కొంతవరకైనా కొల్లగొట్టవచ్చునన్న ఆశగా ఉంది. ఇక బసవరాజ్ బొమ్మై అవినీతి, ముస్లిం కోటా రద్దుని ప్రధాన ప్రచారాస్త్రాలుగా మలుచుకుంది. సిద్దరామయ్య, డి.కె.శివకుమార్ వంటి బలమైన నాయకులు ఉన్నప్పటికీ పార్టీలో అంతర్గత పోరు ఆ పార్టీకి మైనస్‌గా మారింది. ఫలితంగా ఈ 84 సీట్లలోనూ హోరాహోరీ పోరు నెలకొంది. ఇక 224 స్థానాలకు గాను 60 సీట్లు సేఫ్ సీట్లుగా ఉన్నాయి. గత మూడు ఎన్నికల్లో వరుసగా ఒకే పార్టీ గెలుస్తూ వచ్చింది. ఈ సేఫ్ సీట్లు కాంగ్రెస్‌కి 27, బీజేపీకి 23, జేడీ(ఎస్)కి 10 ఉన్నాయి. ఈ సీట్లను కాపాడుకోవడానికి కూడా రెండు పార్టీలు సర్వశక్తులూ ఒడ్డవల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అధికార నివాసం వీడిన రాహుల్



బంగ్లా తాళాలు సంబంధిత అధికారికి అప్పగిస్తున్న రాహుల్. రాహుల్ సామగ్రిని సోనియా నివాసానికి తరలిస్తున్న దృశ్యం

- నిజం మాట్లాడిన ఫలితమని వ్యాఖ్య
- తల్లి సోనియా ఇంటికి మకాం

న్యూఢిల్లీ: నిజం మాట్లాడినందుకు మూల్యం చెల్లించుకున్నానంటూ కాంగ్రెస్ నేత, వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. పరువు నష్టం కేసులో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం ఢిల్లీలోని తన అధికార నివాసాన్ని విడిచిపెట్టారు. ల్యుటెన్స్ ప్రాంతంలోని బంగళా నుంచి తన తల్లి సోనియా గాంధీ ఉండే రాజ్‌పథ్ నివాసానికి మకాం మార్చారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు తుగ్లక్ లేన్‌లోని 12వ నంబర్ బంగ్లాలో రాహుల్ ఉంటున్నారు. మోదీ ఇంటి పేరుపై అనుచిత వ్యాఖ్యల కేసులో సూరత్ కోర్టు ఆయన్ను దోషిగా పేర్కొంటూ రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో లోక్‌సభ సెక్రటేరియట్ ఆయనపై అనర్హత వేటువేసింది. ఈ నెల 22వ తేదీలోగా బంగ్లాను ఖాళీ చేయాలంటూ నోటీసులిచ్చింది. తీర్పుపై స్టే కోసం రాహుల్ సెషన్స్ కోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. దీంతో, శనివారం ఉదయం కల్లా ఆ బంగ్లా నుంచి తన సామగ్రిని జన్‌పథ్ నివాసానికి తరలించారు. బంగ్లా తాళాలను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ (సీపీడబ్ల్యూడీ) అధికారులకు అందజేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఆ సమయంలో ఆయన తల్లి సోనియా, సోదరి ప్రియాంక అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..'నిజం మాట్లాడినందుకు మూల్యం చెల్లించుకున్నాను. ఈ విషయంలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధమే. అధిక ధరలు, అవినీతి వంటి అంశాలపై ఇకపై రెట్టింపు శక్తితో పోరాడుతా'అని రాహుల్ స్పష్టం చేశారు. 'బంగ్లాను లాక్కున్నా నాకెలాంటి ఇబ్బందీ లేదు. భారతదేశ ప్రజలిచ్చిన ఇల్లిది. కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియాగాంధీ జన్‌పథ్ 10 నివాసంలో కొద్దిరోజులు ఉంటా. ఆ తర్వాత వేరే దారి చూసుకుంటా'అని అన్నారు. బంగ్లాలో మరికొంత కాలం ఉండేందుకు అనుమతి కోరారా అని అడగ్గా ఈ ఇంట్లో ఉండాలని అనుకోలేదన్నారు. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రభుత్వం ఆయన్ను ఇంటి నుంచి వెళ్లగొట్టొచ్చు కానీ, కోట్లాది మంది భారతీయుల ఇళ్లలో, హృదయాల్లో ఆయన చోటు సంపాదించారని పేర్కొంది. ఆయన అందరి నేత అని తెలిపింది. సోషల్ మీడియాలో 'మేరాఘర్ ఆప్‌కా ఘర్(మా ఇల్లే మీ ఇల్లు)'పేరుతో ప్రారంభమైన ప్రచారోద్యమంలో పలువురు కాంగ్రెస్ నేతలు రాహుల్‌ను తమ ఇళ్లకు ఆహ్వానించారు. 'లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వు ప్రకారం రాహుల్ తన బంగ్లాను ఖాళీ చేశారు. సూరత్ కోర్టు తీర్పుపై 30 రోజుల్లోగా హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశముంది. లోక్‌సభ సభ్యత్వాన్ని అక్కడ తిరిగి పునరుద్ధరించేందుకు అవకాశాలూ ఉన్నాయి. అయినా బంగ్లాను వీడిటడం ద్వారా నిబంధనల పట్ల నిబద్ధతను చాటుకున్నారు'' అని ఎంపీ శశిథరూర్ ట్వీట్ చేశారు.

మోదీపై ఆత్మాహుతి దాడి చేస్తాం

- కేరళ పర్యటన వేళ బెదిరింపు లేఖ
- నిఘా నివేదిక లీక్‌పై బీజేపీ ఆందోళన

కొచ్చిన్: ఈనెల 24, 25వ తేదీల్లో కేరళలో పర్యటించనున్న ప్రధాని మోదీని సూసైడ్ బాంబర్‌తో చంపేస్తామన్న బెదిరింపులపై పోలీసులు, కేంద్ర నిఘా విభాగాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. ఇందుకు సంబంధించిన లేఖ ఒకటి గత వారం రాష్ట్ర బీజేపీ విభాగానికి అందింది. బీజేపీ రాష్ట్ర చీఫ్ కె.సురేంద్రన్ దానిని పోలీసులకు అందజేశారు. ప్రధాని పర్యటన, బందోబస్తులో ఉండే అధికారుల వివరాలతో అదనపు డీజీపీ (ఇంటెలిజెన్స్) తయారు చేసిన నివేదిక శనివారం వైరల్ అవుతోంది. అందులోనే బెదిరింపు లేఖ అంశం ఉంది. మలయాళంలో ఉన్న ఆ లేఖను కొచ్చిన్‌కు చెందిన ఎన్‌జే జానీ రాసినట్లుగా ఉంది. లేఖలో వాస్తవికత, దాని వెనుక ఉన్న వ్యక్తిపై విచారణ జరుపుతున్నట్లు కూడా నివేదిక పేర్కొంది. ఈ పరిణామంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్ స్పందించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి గోప్యంగా ఉంచాల్సిన ముఖ్య విషయాలను లీక్ చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సీరియస్ వ్యవహారమని, సీఎం విజయన్ స్పందించాలని కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్ డిమాండ్ చేశారు. అనుమానితుడిగా పేర్కొంటున్న ఎన్‌జే జానీ శనివారం మీడియాతో మాట్లాడారు. సదరు బెదిరింపు లేఖతో తనకు సంబంధం లేదన్నారు. పోలీసులడిగిన అన్ని వివరాలను అందించానన్నారు. చర్చి వ్యవహారానికి సంబంధించి తనతో శత్రుత్వం ఉన్న వారే దీని వెనుక ఉండి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

కర్ణాటకలో మెజార్టీకి మించి...

ఓబీసీలను కించపరిచి రాహుల్ నాటకాలు: అమిత్ షా



బెంగళూరు: కర్ణాటకలో అధికార పీఠాన్ని నిలబెట్టుకుంటామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. ''మెజార్టీ కంటే 15 నుంచి 20 సీట్లు ఎక్కువే గెలుస్తాం. కొందరు సీనియర్ నేతలు పార్టీని వీడినా క్షేత్రస్థాయిలో మద్దతు ఏమాత్రం తగ్గలేదు. చరిత్ర చూసినా బీజేపీ రెబెల్స్ గెలిచిన సందర్భాలు లేవు. ఈసారీ అదే నిరూపితమవనుంది'' అని శనివారం ఇండియాటుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీపై ఎంపీగా అనర్హత వేటుపడటంపై బీజేపీని కాంగ్రెస్ పార్టీ విమర్శించడాన్ని ప్రస్తావిస్తూ.. ' దేశంలో ఏ కుటుంబం కూడా చట్టం కంటే గొప్పదికాదు. అన్నింటికంటే చట్టమే అత్యున్నతమైంది' అని వ్యాఖ్యానించారు. ఎంపీ బంగ్లా ఖాళీచేస్తూ ఈ ఉదంతంలో బాధితుడినయ్యానని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై షా స్పందించారు. ' ఓబీసీలను కించపరిచేలా మాట్లాడాలని రాహుల్‌ను మేం అడగలేదు. ఇప్పుడు క్షమాపణ చెప్పకూడదని నిర్ణయించుకుంది కూడా ఆయనే. ఏ చట్టం కింద అయితే ఆయన దోషిగా తేలారో ఆ చట్టం కాంగ్రెస్ హయాంలో రూపొందిందే. ఆ చట్టాన్ని ఉపసంహరించేందుకు నాటి ప్రధాని మన్మోహన్ ప్రయత్నిస్తే ఆర్డినెన్స్ పత్రాలు చించి రాహులే అడ్డుకున్నారు. ఇప్పుడు 'బాధితుడిని' అంటూ నాటకాలు ఆడొద్దు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ' మోదీని విమర్శించారనే జమ్మూకశ్మీర్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు సీబీఐ సమన్లు జారీచేసిందనేది అబద్ధం. గతంలోనూ ప్రశ్నించేందుకు ఆయనను సీబీఐ పిలిచింది' అని గుర్తుచేశారు.

ఏటీఎంలా వాడుకున్న కాంగ్రెస్

''కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలు ఇంతవరకూ ఏ కోర్టులోనూ నిరూపణకాలేదు. ఇవన్నీ కాంగ్రెస్ కట్టుకథలు'' అని అమిత్ షా అన్నారు. అధికారంలో ఉండగా కాంగ్రెసే రాష్ట్రాన్ని 'ఏటీఎం'లా వాడుకుందని ఆరోపించారు. ''యూపీఏ హయాంలో 2009–19లో కర్ణాటకకు కేవలం రూ.94 వేల కోట్ల నిధులొచ్చాయి. మా హయాంలో 2014–19లో ఏకంగా రూ.2.26 లక్షల కోట్ల నిధులు ఇచ్చి ఆదుకున్నాం. వాళ్ల పన్నులు, గ్రాంట్–ఎయిడ్ కింద రూ.22 వేల కోట్లు ఇస్తే మేం రూ.75 వేల కోట్లు ఇచ్చాం'' అని చెప్పారు.

ఇస్రో సీ55 సక్సెస్

విజయవంతంగా కక్ష్యలోకి రెండు సింగపూర్ ఉపగ్రహాలు



నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. పీఎస్ఎల్‌వీ సీ55 ఉపగ్రహ వాహక నౌక శనివారం సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి మధ్యాహ్నం 2.19కు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. దాంతో మిషన్ కంట్రోల్ రూమ్‌లో శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. షార్ కేంద్రం నుంచి ఇది 87వ ప్రయోగం. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 57వది. 20.55 నిమిషాల పాటు సాగిన ప్రక్రియను నాలుగు దశల్లో పూర్తి చేశారు. 44.4 మీటర్ల పొడవైన రాకెట్‌లోని సింథటిక్ అపార్చర్ రాడార్ పేలోడ్ బిగించిన సింగపూర్‌కు చెందిన 741 కిలోల బరువైన టెలియోస్2 ఉపగ్రహాన్ని నాలుగో దశలో కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. నిమిషం తర్వాత 16 కిలోల మరో సింగపూర్ ఉపగ్రహం లూమిలైట్4ను భూమికి 586 కి.మీ. ఎత్తులో కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది వరుసగా ఐదు వాణిజ్య విజయాలు సాధించామని ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. టెలియోస్2 సాయంతో అన్ని కాలాల్లో, చీకట్లోనూ కోసం ఫొటోలు తీయొచ్చు. లూమిలైట్4 ఇ–నావిగేషన్ నావికా భద్రత, అంతర్జాతీయ షిప్పింగ్ వ్యవహారాల్లో సింగపూర్‌కు సాయపడనుంది. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సీఎండీ డి.రాధాకృష్ణన్, మిషన్ డైరెక్టర్ ఎస్ఆర్ బీజూ, ఎల్‌పీఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ వి.నారాయణన్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, యూఆర్ఎస్‌సీ డైరెక్టర్ ఎం.శంకర్, ఇస్ట్రాక్ డైరెక్టర్ బీఎస్ రామకృష్ణన్ తదితరులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

2024 ఫిబ్రవరి నాటికి గగన్‌యాన్‌కు కొత్తరూపు



ఈ ఏడాది ప్రయోగాత్మక పరీక్షల అనంతరం 2024 ఫిబ్రవరి నాటికి మానవరహిత గగన్‌యాన్ ప్రయోగం చేపడతామని అంతరిక్ష శాఖ కార్యదర్శి కూడా అయిన సోమనాథ్ వెల్లడించారు. ''గగన్‌యాన్‌కు సంబంధించి అనేక ప్రయోగాత్మక పరీక్షలు చేశాం. 12, 14 కిలోమీటర్ల ఎత్తులో క్రూ మాడ్యూల్‌ను వదిలి తిరిగి సురక్షితంగా తీసుకొచ్చే ప్రక్రియను పూర్తిచేశాం. హెలికాప్టర్ ద్వారా జూన్‌లో మరోసారి ఈ పరీక్ష చేస్తాం. ఇవన్నీ పూర్తయ్యాక క్రూ మాడ్యూల్‌తో మానవరహిత ఆర్బిటల్ ప్రయోగం నిర్వహిస్తాం. తర్వాత అన్నీ అనుకూలిస్తే 2024 డిసెంబర్ నాటికి మానవసహిత ప్రయోగం చేస్తాం. ఈ ఏడాది ప్రతి నెలా ఒక ప్రయోగం ఉంటుంది. ఈ ఏడాదిలో వాణిజ్య ప్రయోగాలే ఎక్కువ ఉండే అవకాశముంది. నావిక్ ఉపగ్రహ ప్రయోగం, చంద్రయాన్–3, ఆదిత్య–ఎల్1 ప్రయోగాలు వరుసగా ఉంటాయి. నెలకొకటి చొప్పున పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు చేస్తాం. రాబోయే రోజులన్నీ ఇస్రోకు సవాళ్లు విసిరే రోజులే'' అని వివరించారు.

మా నామినేషన్లు చెల్లకుండా చేసే కుట్ర

- బొమ్మై సర్కారుపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- సీఎంఓ నుంచి ఆర్‌ఓలకు ఫోన్లు: పీసీసీ చీఫ్ డీకే

బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల వేడితో పాటే అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కూడా తారస్థాయికి చేరుతోంది. తమ నామినేషన్లను ఏదోలా చెల్లకుండా చేసేందుకు బసవరాజ్ బొమ్మై సర్కారు భారీ కుట్రకు తెర తీస్తోందని పీసీసీ చీఫ్ శివకుమార్ మండిపడ్డారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తమ అభ్యర్థుల నామినేషన్లలో ఏదో ఒక లోపాన్ని వెతకాలని, అలాగే బీజేపీ నామినేషన్లలో ఏమైనా తప్పులుంటే సరి చేయాలని రిటర్నింగ్ ఆఫీసర్లందరి మీదా ఎంతగానో ఒత్తిడి తెస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు స్వయానా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే వారికి ఫోన్లు వెళ్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తక్షణం రంగంలోకి దిగి దీనిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సీఎంఓ కాల్ డీటైల్స్ తెప్పించుకుని పరిశీలించాలని సూచించారు. బీజేపీ అధికార దుర్వినియోగానికి అంతూ పొంతూ లేకుండా పోతోందంటూ దుయ్యబట్టారు. ''ఈ కుట్రకు సంబంధించి మా దగ్గర సాక్ష్యాలున్నాయి. సొందత్తి ఎల్లమ్మ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో తప్పులున్నాయి. వాటిని సరిచేయాల్సిందిగా సీఎంఓ నుంచి ఆర్‌ఓకు ఫోన్ వెళ్లింది. ఇక నా నామినేషన్‌ను ఏదోలా తిరస్కరింపజేసేందుకు బీజేపీ తరఫున పెద్ద టీమే రంగంలోకి దిగింది. నా పరిస్థితే ఇలా ఉంటే ఇతర సాధారణ అభ్యర్థుల సంగతేమిటో అర్థం చేసుకోవచ్చు'' అన్నారు.

దేశాన్ని విభజించే కుట్ర పన్నుతున్నారు

అందుకే విద్వేష రాజకీయాలు: మమత

కోల్‌కతా: కొందరు నేతలు విద్వేష రాజకీయాలతో దేశాన్ని విభజించే కుట్రలకు తెరతీశారని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ''వారి కుట్రలను సాగనివ్వను. ఈ పోరాటంలో ప్రాణాలనైనా అర్పిస్తా'' అని శనివారం కోల్‌కతాలో ఈద్ నమాజ్ సందర్భంగా ఆమె అన్నారు. ''కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోంది. విపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోంది. అయినా తలవంచే ప్రసక్తే లేదు' అన్నారు. ''ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలున్నాయి. విభజన శక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడదాం. ఒక్కటిగా ఓటేసి బీజేపీని గద్దె దింపుదాం. ప్రజాస్వామ్య పరిరక్షణలో మనం విఫలమైతే అంతా అయిపోయినట్లే'' అన్నారు. కాంగ్రెస్, సీపీఎంలపై ఈ సందర్భంగా మమత విమర్శలు గుప్పించారు.

మిస్సైల్ విధ్వంసక క్షిపణి ప్రయోగం సక్సెస్

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో భారత్ మరో ఘనత సాధించింది. శత్రుదేశాల ఖండాంతర క్షిపణులను మధ్యలోనే అడ్డుకుని తుత్తునియలు చేయగల కొత్తరకం క్షిపణి ఎండో–అట్మాస్ఫెరిక్ ఇంటర్‌సెప్టర్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశా తీరంలోని యుద్ధ నౌక నుంచి శనివారం డీఆర్‌డీవో (రక్షణ పరిశోధన పరిశోధన సంస్థ), నావికా దళం ఈ పరీక్ష నిర్వహించాయి. శత్రు దేశాల క్షిపణిని మధ్యలోనే అడ్డుకుని, ధ్వంసం చేయగలిగే సరికొత్త బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ) సాంకేతికతను సొంతం చేసుకున్న దేశాల సరసన భారత్ నిలిచిందని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షలో పాలుపంచుకున్న డీఆర్‌డీవో, నేవీ, రక్షణ పరిశ్రమల ప్రతినిధులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

యుద్ధం అంతుచూసేదాకా వదలను

సూడాన్ సైన్యాధ్యక్షుడు బుర్హాన్ • విదేశీయుల ఆందోళన

ఖార్తూమ్: యుద్ధం అంతుచూసేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సంక్షుభిత సూడాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ అబ్దెల్ ఫతాహ్ బుర్హాన్ శనివారం ప్రకటించారు. దాంతో అక్కడి తమవారి భద్రతపై అమెరికా, బ్రిటన్, చైనా, తదితర దేశాలు ఆందోళనలో పడ్డాయి. కాల్పుల విరమణ యత్నాలు రెండుసార్లు విఫలమైన దరిమిలా బాంబుల మోతతో దద్దరిల్లుతున్న దేశం నుంచి బయటపడే మార్గంలేక విదేశీయులు బిక్కుబిక్కుమంటున్నారు. బాంబు దాడులు, కాల్పుల ఘటనల్లో ఇప్పటిదాక 400 మందికిపైగా మరణించారు. సూడాన్‌లో చిక్కుకున్న 16 వేల మంది తమ పౌరులను ఎలాగైనా రక్షిస్తామని అమెరికా శుక్రవారం ప్రకటించడం తెల్సిందే.



శనివారం చార్‌ధామ్ యాత్ర తొలిరోజు యమునోత్రి వద్ద భక్తుల రద్దీ


చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రి, యమునోత్రి ఆలయాలు ఆరు నెలల అనంతరం తిరిగి తెరుచుకోవడంతో చార్‌ధామ్ యాత్ర మొదలైంది. గంగోత్రి ఆలయ తలుపులను శనివారం మధ్యాహ్నం 12.35 గంటలకు, యమునోత్రి గుడిని 12.41 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు తెరిచారు. ఈ సందర్భంగా గంగోత్రి ఆలయంలో, యమునా దేవత శీతాకాల నివాసమైన ఖర్సాలీలో కూడా ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి పూజలు చేశారు. అనంతరం యమునా దేవిని అందంగా అలంకరించిన పల్లకీలో ఊరేగింపుగా యమునోత్రికి తీసుకువచ్చారు. చార్‌ధామ్ యాత్రకు ఇప్పటికే 16 లక్షల మంది యాత్రికులు పేర్లను నమోదు చేసుకున్నారు. ఈనెల 25న కేదార్‌నాథ్, 27న బదరీనాథ్ ఆలయాలు తిరిగి తెరుచుకోనున్నాయి. హిమాలయాల్లోని ఈ నాలుగు పుణ్యక్షేత్రాల్లో రోజువారీ భక్తుల సందర్శనపై పరిమితం విధించాలన్న ప్రతిపాదనను విరమించుకున్నట్లు సీఎం ధామి ప్రకటించారు.

భారతీయులకు ఈసారి 10 లక్షలకుపైగా వీసాలు..!

- విద్యార్థి వీసాలకు ప్రాధాన్యతనిస్తాం
- అమెరికా ఉన్నతాధికారి డొనాల్డ్ వెల్లడి

వాషింగ్టన్: భారత్, అమెరికా సంబంధాలు మరింత బలపడుతున్నవేళ భారతీయుల వీసా ప్రక్రియను వేగిరం చేసి ఈ ఏడాది 10 లక్షలకుపైగా వీసాలు జారీచేస్తామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు. విద్యార్థి వీసాలకు అధిక ప్రాధాన్యతనిచ్చేందుకు బైడెన్ సర్కార్ కృత నిశ్చయంతో ఉందని అమెరికా సహాయ మంత్రి (దక్షిణ, మధ్య ఆసియా విభాగం) డొనాల్డ్ లూ పీటీఐ వార్తాసంస్థతో చెప్పారు. ' వీసా ప్రాసెసింగ్ ప్రక్రియలో హెచ్–1బీ, ఎల్–వీసాలకూ తగిన ప్రాధాన్యత కల్పిస్తాం. విద్యార్థి వీసాలు, ఇమిగ్రెంట్ వీసాలుసహా మొత్తంగా ఈ ఏడాది ఏకంగా 10 లక్షలకుపైగా వీసాలను మంజూరుచేస్తాం. ఈసారి సమ్మర్ సీజన్‌లో అమెరికాలో విద్యనభ్యసించనున్న భారతీయ విద్యార్థుల సౌలభ్యం కోసం అన్ని స్టూడెంట్ వీసాల ప్రాసెసింగ్‌ను పూర్తిచేస్తాం' అని చెప్పారు. బీ1(వ్యాపారం), బీ2(పర్యాటక) కేటగిరీలుసహా తొలిసారిగా వీసా కోసం దరఖాస్తుచేసుకున్న వారి అప్లికేషన్ల వెరిఫికేషన్ వెయిటింగ్ పీరియడ్ చాలా ఎక్కువగా ఉన్న విషయం విదితమే. అమెరికాకు వస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో సంఖ్య పరంగా ప్రపంచంలో భారత్ రెండోస్థానంలో ఉంది.



కొన్ని చోట్ల 60 రోజుల్లోపే..

'హెచ్–1బీ, ఎల్ వీసాల జారీపైనా దృష్టిపెట్టాం. భారత్‌లోని కొన్ని కాన్సులేట్‌లలో ఈ వీసాల కోసం వేచిఉండే కాలం 60 రోజుల్లోపే. అమెరికా, భారత్ ఇరుదేశాల ఆర్థికవ్యవస్థకు ఈ వర్కింగ్ వీసాలు కీలకం. అందుకే వీటి సంగతీ చూస్తున్నాం' అని వెల్లడించారు. ' పిటిషన్ ఆధారిత నాన్‌ఇమిగ్రెంట్ విభాగాల కింద దరఖాస్తుచేసిన వీసాదారులు తమ వీసా రెన్యువల్ కోసం మళ్లీ స్వదేశానికి వెళ్లిరావాల్సిన పనిలేకుండా అమెరికాలోనే పని పూర్తిచేసుకునేలా ఏర్పాటుచేయదలిచాం. ఇక ఆర్థిక అనిశ్చితి కారణంగా ఉద్యోగాలు కోల్పోయి 60 రోజుల్లోపు అమెరికాను వీడాల్సిన ప్రమాదం ఎదుర్కొంటున్న హెచ్–1బీ వీసాదారులకు.. అవకాశమున్న మరికొన్ని 'వెసులుబాట్ల'ను వివరిస్తూ అదనపు సమాచారాన్ని హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ఇచ్చింది' అని వివరించారు.

క్లుప్తంగా...

కంటోన్మెంట్ రహదారుల్లో ప్రజలకు అనుమతిపై కిషన్‌రెడ్డి హర్షం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని ఐదు ప్రధాన రహదారులైన రిచర్డ్‌సన్, ప్రోట్నీ, బయామ్, అమ్ముగూడ, అల్బయిన్ రోడ్లను ప్రజలు వినియోగించుకునేందుకు అనుమతినివ్వడంపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తాను పలుమార్లు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి ఈ సమస్యపై విన్నవించానని తెలిపారు. కంటోన్మెంట్ రోడ్లను ప్రజలకు తెరిచేందుకు అనుమతినిచ్చినందుకు గాను కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు చెబుతూ శనివారం ట్వీట్ చేశారు. 'రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన సందర్భంలో...కంటోన్మెంట్ ప్రాంతానికి నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బెదిరింపులు..తదితర అంశాలను కూడా తెలియజేశాను. కేంద్ర ప్రభుత్వం ప్రజాజీవనాన్ని సౌలభ్యం చేసేందుకు కృషిచేస్తోంది'అని కిషన్‌రెడ్డి ఈ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కొత్త గనులు వెంటనే ప్రారంభించాలి

కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమృత్‌లాల్

సాక్షి, హైదరాబాద్: దేశంలో విద్యుత్ వినియోగం బాగా పెరుగుతున్నందున కొత్త గనులను తక్షణమే ప్రారంభించాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా సూచించారు. ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో కొత్త బొగ్గు గనులపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్‌లాల్ మీనా మాట్లాడుతూ కొత్త గనుల నుండి సకాలంలో బొగ్గు ఉత్పత్తి జరిగి తీరాలని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు అన్ని అనుమతులు లభించి ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో.. పర్యావరణ, అటవీ శాఖ సహకరించాలని కోరారు. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ నైనీ బొగ్గు బ్లాక్‌కు స్టేజ్ 1, స్టేజ్ 2 అనుమతులు లభించాయన్నారు.

30న బీసీ లాయర్ల మహాసభ

ముషీరాబాద్: ఈ నెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు బీసీ న్యాయవాదుల మహాసభ నిర్వహించనున్నారు. శనివారం బీసీ భవన్‌లో హైకోర్టు బీసీ అడ్వకేట్స్ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే మహాసభలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో ప్రాక్టీస్ చేసే బీసీ అడ్వొకేట్లు పాల్గొనాలని కోరారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ (నాక్స్ ఇండియా) ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలున్న సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను www. nacsindia.org వెబ్‌సైట్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 7893141797.

'బాక్స్ సాగు' భలేభలే..!

చిన్న రైతుకు కొండంత అండగా స్టార్టప్ సంస్థ ఆవిష్కరణ

వ్యవసాయంతో పరిచయమున్న వారెవరికైనా గ్రీన్‌హౌస్ అంటే తెలిసే ఉంటుంది. ఎండావానలు, చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవడానికి చేసుకొనే ఓ హైటెక్ ఏర్పాటు. ఒక ఎకరా విస్తీర్ణంలో ఆధునిక గ్రీన్‌హౌస్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే... రూ. లక్షలకు లక్షలు ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఖేతీ అనే స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో అయిన కౌశిక్ కప్పగంతుల అత్యంత తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక గ్రీన్‌హౌస్‌ను అభివృద్ధి చేశారు. అంతే కాకుండా ప్రాంతం, వేసే పంటలను బట్టి దిగుబడులు పెంచుకొనేందుకు, అత్యవసర పరిస్థితుల్లో పంటలను కాపాడుకొనేందుకు ఏమేం చేయాలో కూడా రైతులకు నేర్పించడం మొదలుపెట్టారు. ఈ మొత్తం వ్యవస్థ పేరే... 'గ్రీన్‌హౌస్ ఇన్ ఎ బాక్స్'. ఈ వినూత్న ఆవిష్కరణకుగాను బ్రిటన్ యువరాజు చార్లెస్ స్థాపించిన ప్రతిష్ఠాత్మక 'ద ఎర్త్ షాట్ ప్రైజ్–2022'ను కౌశిక్ పొందారు.

- సాక్షి, హైదరాబాద్



ఖేతీ అభివృద్ధి చేసిన గ్రీన్‌హౌస్‌ను 240 చదరపు మీటర్లు లేదా ఎకరాలో పదహారో వంతు సైజులో ఏర్పాటు చేసుకోవచ్చు. అవసరాన్ని బట్టి ఒక్కటొక్కటిగా చేర్చుకోనూవచ్చు. ఒక్క గ్రీన్‌హౌస్ ఏర్పాటుకు ప్రస్తుతం రూ. 60 వేల ఖర్చవుతోంది. సాధారణ గ్రీన్‌హౌస్‌తో పోలిస్తే ఇది 90 శాతం తక్కువ. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే...

కావాల్సిన వారికి కావాల్సినంత...

రైతులు రోజుకు రెండు గంటలపాటు మాత్రమే పనిచేయడం ద్వారా ఏడాదిలోనే పెట్టుబడితోపాటు కనీసం రూ. 20 వేలు అదనంగా సంపాదించవచ్చు. 240 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పండే పంటకు ఏడు రెట్లు ఎక్కువగా పండటం ఒక కారణమైతే... నీటి వాడకం 95 శాతం వరకూ తక్కువ. అలాగే ఎరువులు, చీడపీడలకు పెట్టే ఖర్చులు కూడా తక్కువ కావడం వల్ల పెట్టిన పెట్టుబడికి మించిన రాబడి ఏడాదిలోనే వస్తుంది!

15 రకాల పంటలు..

ఖేతీ గ్రీన్‌హౌస్‌ల అమ్మకాలు మాత్రమే చేయడం లేదు. ఏ పంట వేస్తే ఎక్కువ లాభాలుంటాయో నిత్యం తెలుసుకొనే ప్రయత్నాల్లో ఉంది. హైదరాబాద్ సమీపంలోని సొంత వ్యయసాయ క్షేత్రంలో ఇప్పటివరకూ 15 రకాల పంటలను విజయవంతంగా పండించింది కూడా. మరిన్ని పంటల సాగుపై పరిశోధనలు జరుగుతున్నాయి. 2017లో కేవలం 15 మంది రైతులతో తెలంగాణలో ఈ టెక్నాలజీ వాడకం మొదలుకాగా... మూడేళ్లలో 500 మంది రైతుల దగ్గరకు చేర్చారు. గతేడాది తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లలోనూ 'గ్రీన్‌హౌస్ ఇన్ ఎ బాక్స్'వాడకం మొదలైంది. మొత్తమ్మీద ఇప్పుడు సుమారు 2,500 మంది చిన్న, సన్నకారు రైతులు ఈ టెక్నాలజీని వాడుతున్నారు.



2027కల్లా 50 వేల మంది వాడేలా ప్రయత్నిస్తున్నాం...

2027 నాటికి దేశవ్యాప్తంగా కనీసం 50 వేల మంది రైతులు 'గ్రీన్‌హౌస్ ఇన్ ఏ బాక్స్'ను వాడేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వాలు చొరవ తీసుకొని రైతులకు వ్యవస్థీకృతమైన పద్ధతిలో రుణ సౌకర్యం కల్పిస్తే వారికి మరింత మేలు జరుగుతుంది. చిన్న, సన్నకారు రైతులు ఎంత ఎక్కువగా ఈ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే.. అంత తక్కువ ధరలకు ఈ గ్రీన్‌హౌస్‌లు అందించవచ్చు. సెన్సర్ల వంటి హంగులను కూడా ఈ గ్రీన్‌హౌస్‌లో చేర్చేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు చేస్తున్నాం. – కౌశిక్ కప్పగంతుల, ఖేతీ సహ వ్యవస్థాపకుడు, సీఈవో

..నోటిఫికేషన్లు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయించడంతోపాటు బాలుర విద్యాసంస్థల్లో 33 శాతం పోస్టులను మహిళలకు కేటాయించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఈ మేరకు పోస్టుల కేటాయింపులు జరిగాయి. ఈ క్రమంలో 966 పీజీటీ పోస్టులు మహిళలకు రిజర్వ్ కాగా... జనరల్ కేటగిరీలో 310 పోస్టులు వచ్చాయి. పీజీటీలోని మొత్తం పోస్టుల్లో మహిళలకు 75.70 శాతం ఉద్యోగాలు, జనరల్ కేటగిరీలో 24.30 శాతం రిజర్వ్ అయ్యాయి.

సొసైటీలవారీగా పీజీటీ పోస్టులు ఇలా...

సొసైటీ	జనరల్	మహిళలు	మొత్తం
టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలురు)	71	86	157
టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు)	0	186	186
టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్(బాలురు)	30	52	82
టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు)	0	65	65
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలురు)	209	178	387
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్(బాలికలు)	0	399	399
మొత్తం	310	966	1,276

ఆర్ట్ టీచర్ పోస్టులు 132

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీల పరిధిలో ఆర్ట్ టీచర్ కేటగిరీలో 132 పోస్టుల భర్తీకి గురుకుల నియామకాల బోర్డు ప్రకటన జారీ చేసింది. ఇందులో మహిళలకు 112 పోస్టులు రిజర్వ్ కాగా... జనరల్ కేటగిరీలో 20 పోస్టులు ఉన్నాయి. మొత్తం పోస్టుల్లో మహిళలకు 84.85 శాతం కేటాయింపు కాగా జనరల్ కేటగిరీలో 15.15 శాతం పోస్టులు లభించాయి.

సొసైటీల వారీగా ఆర్ట్ టీచర్ పోస్టులు ఇలా...

సొసైటీ	జనరల్	మహిళలు	మొత్తం
టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలురు)	1	15	16
టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలురు)	0	6	6
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలురు)	13	24	37
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు)	0	35	35
టీఎంఆర్ఈఐఎస్ (బాలురు)	6	19	25
టీఎంఆర్ఈఐఎస్ (బాలికలు)	0	13	13
మొత్తం	20	112	132

'వరల్డ్ ఏఐ షో' ముఖ్యఅతిథిగా కేటీఆర్‌కు ఆహ్వానం

- దుబాయిలో జూన్ 7, 8 తేదీల్లో నిర్వహణ
- మధ్యప్రాచ్యం, ఉత్తరాఫ్రికా నుంచి ప్రతినిధులు హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్‌కు అరుదైన గౌరవం లభించింది. జూన్ 7, 8 తేదీల్లో దుబాయిలో జరిగే 'ప్రపంచ కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రదర్శన'కు ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా దేశాల కూటమి (మెనా) 41వ వార్షిక సదస్సులో భాగంగా ఈ ప్రదర్శన జరగనుంది. సాంకేతిక రంగంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని, కేటీఆర్ హాజరుతో దుబాయిలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంతో విలువ చేకూరుతుందని ఆహ్వానపత్రంలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా(మెనా) దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోపాటు ఆరోగ్య, రిటైల్, మ్యానుఫ్యాక్చరింగ్, బ్యాంకింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, రవాణా వంటి అనేక రంగాల కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రంగంలో ఇప్పటికే విజయవంతమైన అనుభవాలు, వాటి ఫలితాలను సమావేశంలో ప్రదర్శిస్తారు. దుబాయికి కీలకమైన ఈ రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రాథమికంగా చర్చించడంతోపాటు వివిధ దేశాల ప్రతినిధులు తమ అనుభవాలను వివరిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ హాజరు కావడం ద్వారా దుబాయిలోని భారతీయ, తెలుగు ప్రవాస టెక్నాలజీ రంగనిపుణులకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుందని తెలిపారు. తెలంగాణ అనుభవాల నుంచి విదేశాలతోపాటు మిడిల్ ఈస్ట్, ఆఫ్రికన్ రీజియన్ ప్రతినిధులు స్ఫూర్తి పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 41వ గ్లోబల్ ఎడిషన్ ఆఫ్ వరల్డ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ షోలో భాగంగా ఏఐ విభాగంలో అద్భుత ఫలితాలు సాధించిన సంస్థలు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేస్తారు.

ప్రభుత్వ విధుల్లో కోర్టుల జోక్యం తగదు

సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



విశాఖ లీగల్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, ప్రాథమిక అవసరాలు తీర్చడం అనేది ప్రభుత్వం బాధ్యత అని, ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం తగదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. న్యాయవ్యవస్థకు పరిధి ఉందని, అవసరమైనప్పుడు మాత్రమే న్యాయస్థానాలు స్పందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్నిసార్లు సంబంధం లేని, సాధ్యం కాని పనులపై తప్పుడు తీర్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. న్యాయకోవిదుడు, విశాఖపట్నం నగర మాజీ మేయర్ డీవీ సుబ్బారావు స్మారక ఉపన్యాస కార్యక్రమం శనివారం నగరంలోని ఒక హోటల్లో నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ డీవీ సుబ్బారావు దేశవ్యాప్తంగా చేసిన ప్రసంగాలు, న్యాయస్థానాల్లో ఆయన చూపిన చతురత అందరికీ ఆదర్శమన్నారు. ప్రజాస్వామ్యం అన్నిటికంటే ఉన్నతమైందని, దానికి విఘాతం కలిగితే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉందన్నారు. అయితే, పాలన వ్యవహారాలకు సంబంధించి అతి చిన్న అంశంపై కూడా ఉన్నత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వాలు సుపరిపాలన అందించడం సాధ్యం కాదని ఆయన స్పష్టంచేశారు. కార్యనిర్వాహక విభాగం వ్యవహారాల్లో పాలకుల జోక్యం తగదన్నారు. అదేవిధంగా కార్యనిర్వహణ విభాగంలో పొరపాట్లు జరిగినప్పుడు వాటిని సరిదిద్దుకునేలా న్యాయస్థానాలు సూచనలు చేయాలని పేర్కొన్నారు. ఇటీవల ఉన్నతాధికారులపై ఇస్తున్న కొన్ని తీర్పులు హాస్యాస్పదంగా ఉంటున్నాయన్నారు. న్యాయవ్యవస్థ అనేది సామాన్యుడికి, కార్యనిర్వాహక వర్గానికి మధ్య వారిధి అని చెప్పారు. పాలకులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. బొగ్గు గనులు, మైన్స్‌లో పనిచేసే కార్మికులు వారి సంక్షేమం వంటివి ముఖ్యమన్నారు. వివిధ నేరాల్లో జైల్లో మగ్గుతున్న ఖైదీల హక్కుల పరిరక్షణ, వారి జీవన పరిస్థితులు, మానవ హక్కుల పరిరక్షణ వంటి విషయాల్లో ప్రభుత్వాలు తమ హద్దులు దాటకూడదన్నారు. వ్యక్తిగత గోప్యత కూడా ప్రాథమిక హక్కుల కిందకే వస్తుందని చెప్పారు. మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన... ప్రభుత్వ పనితీరుకు గీటురాయి అని చెప్పారు. డీవీ సుబ్బారావు కుమారుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు మాట్లాడుతూ తన తండ్రి ఒకవైపు న్యాయవాదిగా, మరోవైపు ప్రజానాయకుడిగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని విస్తృతమైన సేవలందించారని కొనియాడారు.

మే 2, 3, 4 తేదీల్లో 'సాక్షి' ఆధ్వర్యంలో ఎంసెట్, నీట్ మాక్‌టెస్టులు

సాక్షి ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం ..ఇంజనీరింగ్, లేదా మెడిసిన్. అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజనీరింగ్/మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్..అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పించే ఎంసెట్‌కు లక్షలమంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నిపుణుల ఆధ్వర్యంలో ఎంసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మాక్‌టెస్టులు నిర్వహించనుంది. టెక్నాలజీ పార్ట్‌నర్‌గా మై ర్యాంక్ వ్యవహరిస్తోంది.

మూడు టెస్టులు.. మూడు రోజులు.. ఎప్పుడంటే

పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్‌టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, ప్రిపరేషన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.arenaone.in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.350/–. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 25 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈమెయిల్‌కు పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ నంబర్ వస్తుంది. ఒక్కో స్ట్రీమ్‌కు (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, నీట్) మూడు టెస్టులు ఉంటాయి. ఈ పరీక్షలను మే 2,3,4 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను మీ యూజర్ నేమ్ హాల్ టికెట్ నంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నంబర్ (పాస్‌వర్డ్)తో ఆ మూడు రోజుల్లో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshi mocktest.myrank.co.in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. టెస్ట్‌కి సంబంధించిన కీ ని 5వ తేదీన ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు 95055 14424, 96660 13544, 96665 72244 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయొద్దు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు హరీశ్‌రావు లేఖ

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: దేశ రక్షణ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని, ఇతర రక్షణ రంగ కర్మాగారాలను ప్రైవేటుపరం చేయొద్దని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశ భద్రతతో పాటు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న74 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు హరీశ్‌రావు శనివారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు. 'డిఫెన్స్ రంగానికి చెందిన ఏడు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల నూతన ఆయుధాల అభివృద్ధి నిలిచిపోతుంది. ఇది మేకిన్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీస్తుంది'అని తన లేఖలో పేర్కొన్నారు. 'ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి గతేడాదిలో కావాల్సినంత పని ఉండేది. దాదాపు రూ.930 కోట్ల ఆర్డర్లను సిబ్బంది సమయానికి పూర్తి చేశారు. కానీ ఈ ఏడాదిలో సంస్థకు పెద్దగా పని అప్పగించలేదు. దీనిని సాకుగా చూపి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని 'ఖాయిలా పరిశ్రమ''(సిక్ ఇండస్ట్రీ)గా ప్రకటిస్తారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే ప్రత్యక్షంగా 2,500 మంది ఉద్యోగులతో పాటు పరోక్షంగా మరో ఐదువేల మంది ఉపాధి దెబ్బతింటుంది'అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు. ఎద్దుమైలారం ఫ్యాక్టరీలో యంత్రాలను ఆధునీకరించాలని, ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కోరారు. అలాగే ఆర్మీ అవసరాలకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఆర్డర్లు ఇవ్వాలని సూచించారు.

నేడు, రేపు కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజుల్లో కొన్నిచోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాయవ్య మధ్యప్రదేశ్ నుంచి ఇంటీరియర్ మహారాష్ట్ర, ఇంటీరియర్ కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతాయని సూచించింది. శనివారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 39.3 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 21.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
			విజయవాడ	38.0	24.0
రెంటచింతల	42.2	25.8	తిరుపతి	38.0	22.0
రాజమహేంద్రవరం	41.0	26.5	నల్లగొండ	38.0	21.4
అనంతపురం	40.1	21.9	హైదరాబాద్	37.0	23.8
ఆదిలాబాద్	39.3	23.2	ఖమ్మం	37.0	25.6
భద్రాచలం	39.0	26.0	మహబూబ్‌నగర్	37.0	21.0
రామగుండం	38.6	23.4	హనుమకొండ	37.0	23.5
నిజామాబాద్	38.3	23.5	దుండిగల్	36.8	23.0
మెదక్	38.2	22.3	హకీంపేట్	36.5	22.9

సిరిసిల్ల మెడికల్ కాలేజీకి వంద సీట్లు

- ఈ ఏడాది నుంచి అడ్మిషన్లకు ఎన్ఎంసీ అనుమతి
- ఆగస్టులో ఎంబీబీఎస్ ప్రవేశాలు
- జిల్లా ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు



సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంజూరైన వైద్య కళాశాలలో అడ్మిషన్లకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ ఫర్ మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ అనుమతులిచ్చింది. ఇందులోభాగంగా కాళోజీ నారాయణ రావు హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో వైద్య కళాశాలను ప్రారంభించి 100 ఎంబీబీఎస్ సీట్లకు ఆగస్టులో అడ్మిషన్లను స్వీకరించనున్నారు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య కళాశాలకు అనుమతులిస్తూ జాతీయ మెడికల్ కమిషన్ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. దీన్ని పురస్కరించుకుని మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లా ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకొక వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వైద్య కళాశాలను కేటాయించడంతోపాటు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న కేసీఆర్‌కు జిల్లా ప్రజలు రుణపడి ఉంటారన్నారు. జిల్లాకు వైద్య కళాశాలను కేటాయిస్తూ, దాని కోసం ప్రస్తు తం ఉన్న జిల్లా ఆస్పత్రిని 300 పడకల మేర విస్తరించేందుకు కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. 2022లో వైద్యకళాశాల మంజూరు కాగా, జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు సమీపంలో చేపట్టిన భవన నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. సొంత భవనంలోనే మెడికల్ కాలేజీని ప్రారంభిస్తామని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

హంతకుడి దర్జాగిరి

విస్తుగొలుపుతున్న షేక్ దస్తగిరి తీరు

- వివేకాను చంపింది తానేనని స్పష్టీకరణ.. ఆ మేరకు సీబీఐ వద్దా ఒప్పుకోలు
- అప్రూవర్‌గా మారగానే వెంటనే బెయిల్
- బీటెక్ రవి అండతో ఒక్కసారిగా దస్తగిరి లైఫ్‌స్టైల్ చేంజ్
- ఈ హత్యకు ముందు దస్తగిరిది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుట్ర పన్ని వివేకాను ఓడించింది బీటెక్ రవే
- '40 ఇయర్స్ ఇండస్ట్రీ' అండ చూసుకుని చెలరేగిపోతున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప : 'హలో.. నేను దస్తగిరిని మాట్లాడుతున్నా..యా దస్తగిరి అంటావేందీ.. వివేకాను చంపిన దస్తగిరిని.. మీ దగ్గరకు వచ్చినోళ్లు మా వాళ్లు. చూసుకుని పోండి.. లేదంటే ఇబ్బంది పడతారు' అంటూ ఇటీవల ఓ వాయిస్ మెసేజ్ సోషల్ మీడియాలో తిరిగింది. ఎవరైనా క్షణికావేశంలోనో, ఉద్దేశ పూర్వకంగానో ఎవరినైనా హత్య చేస్తే మూడో కంటికి తెలియకూడదనుకుంటారు. తెలిసినా గుట్టు చప్పుడు కాకుండా తల వంచుకుని వెళ్లిపోతుంటారు. అయితే మాజీ మంత్రి వివేకానందరెడ్డిని తానే గొడ్డలితో నరికి చంపానని పదే పదే చెప్పిన, విచారణలో సీబీఐ ఎదుట ఒప్పుకున్న పులివెందులకు చెందిన షేక్ దస్తగిరి మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. చదువు ఒంటబట్టక పోవడంతో డ్రైవింగ్ నేర్చుకున్న ఇతగాడి ప్రస్తుత వయసు 25 ఏళ్లు. అప్పట్లో యాదాటి సునీల్ యాదవ్ ద్వారా వివేకానందరెడ్డి వద్ద చేరాడు. ఆర్థిక కారణాల రీత్యా సునీల్ యాదవ్ ఏం చెబితే అది చేయడానికి సిద్ధపడ్డాడు. వివేకానందరెడ్డిని హత్య చేస్తే పెద్దఎత్తున డబ్బు వస్తుందని సునీల్‌యాదవ్ చెప్పడంతో అందుకు దస్తగిరి అంగీకరించాడు. 2019 మార్చి 14న కదిరికి వెళ్లి గొడ్డలి కొనుగోలు చేశాడు. అదే రోజు అర్ధరాత్రి తర్వాత గజ్జల ఉమాశంకరరెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి కలిసి ఎర్ర గంగిరెడ్డి సహకారంతో వివేకాను హత్య చేశారు. డ్రైవర్ స్థానంలోకి వచ్చిన నీరుగట్టు ప్రసాద్ తనను చంపుతున్నట్లు వివేకాతో డెత్‌నోట్ రాయించారు. ఇదంతా గొప్ప ఘన కార్యం అన్నట్లు చెబుతున్న దస్తగిరికి స్థానిక టీడీపీ నేత బీటెక్ రవి తోడయ్యారు. పులివెందులకు చెందిన బీటెక్ రవి స్థానిక సంస్థల ఎన్నికల్లో కుట్ర పన్ని, వివేకానందరెడ్డిని ఓడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీటెక్ రవి నుంచి దస్తగిరికి ఆర్థికంగా మంచి తోడ్పాటు లభిస్తోంది. వీరిద్దరికీ వివేకా కూతురు, అల్లుడు తెరవెనుక నుంచి మద్దతు ఇస్తున్నారు. దీంతో దస్తగిరి ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది.

దాదాగిరి మామూలుగా లేదు..

తొండూరు పోలీసుస్టేషన్‌లో మల్లెల గ్రామానికి చెందిన పెద్ద గోపాల్ అనే యువకుడిపై స్వయంగా దౌర్జన్యం చేశాడు. ఏఎస్ఐ, పోలీసు కానిస్టేబుళ్లు ఉండగా వారి సమక్షంలోనే చెలరేగిపోయాడు. ఓ చోరీ కేసులో ఇదే తొండూరు మండల ఎలక్ట్రికల్ అధికారులను బెదిరించాడు. శ్రీకాళహస్తిలో ఓ స్థల వివాదం సెటిల్‌మెంట్‌కు వెళ్లి ఓ వర్గం వారిని హెచ్చరించాడు. ఈ మేరకు అక్కడ కేసు కూడా నమోదైంది. యర్రగుంట్ల కేంద్రంగా ఫైనాన్స్ వాహనాల సీజ్ తదితర వ్యవహారాల్లో తల దూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. టీడీపీ నేతలు దస్తగిరి భార్య షబానాకు బ్రీఫింగ్ ఇస్తే.. దస్తగిరి ఎల్లో మీడియాకు పాఠం అప్పజెప్పే పనిలో నిమగ్నమయ్యాడు. ఇందుకు బీటెక్ రవి నుంచి ఎప్పటికప్పుడు డబ్బు అందుతోంది. లింగాల మండలానికి చెందిన నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి, సింహాద్రిపురం మండల వాసి బీటెక్ రవి తెర వెనుక మంత్రాంగం ద్వారానే దస్తగిరి అప్రూవర్‌గా మారడం కొసమెరుపు.

దస్తగిరికి టీడీపీ నుంచే ముప్పు

ఈ నేపథ్యంలో తెర వెనుక నుంచి చిలక పలుకులు పలికిస్తున్న వారి నుంచే తనకు హాని కలిగే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి.. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరికి ప్రాణహాని తలపెడితే ప్రధానంగా లాభపడేది టీడీపీనే. ఎందుకంటే.. వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో చులకన చేసి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు కూడా వివేకా హత్యను కేస్ స్టడీగా తీసుకుని ప్రచారం చేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటువంటి వాటిలో ఆరితేరిన నేతలు టీడీపీలోనే ఉన్నారు. అందుకే పథకం ప్రకారం కిరాయి హంతకుడు దస్తగిరిని రెచ్చగొట్టి.. వైఎస్సార్‌సీపీ నేతలపైన, సీఎంపైన తీవ్ర ఆరోపణలు చేయిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ వారే ఆతడిని అంతమొందించి ఆ నేరాన్ని వైఎస్సార్‌సీపీ నేతలపై వేసే కుట్రకు శ్రీకారం చుట్టారని తెలుస్తోంది.

బెయిల్ రాగానే విలాసవంతమైన జీవనం

వివేకా హత్యకు ముందు ఎప్పటికప్పుడు కష్టపడితేనే పూట గడిచే స్థితి దస్తగిరిది. వంద రూపాయల కోసం ఐదారుగురికి మెసేజ్‌లు పెట్టిన ఘటనలు కోకొల్లలు. ఇప్పుడు కాలు కదిపితే స్కార్పియో కారు. చుక్కా, ముక్కా లేనిదే భోజనం లేదు. ఖరీదైనా స్కాచ్ వెంటే ఉంటుంది. ఖరీదైన దుస్తులు.. ఆహార్యం మారిపోయింది.. వెరసి దౌర్జన్యాలు, దందాలు. వివేకా హత్య తర్వాత డ్రైవర్ దస్తగిరి విలాసవంతమైన జీవనం ఆరంభించాడు. అప్పులు తీర్చేశాడు. ఖరీదైన స్కార్పియో వాహనానికి యజమాని అయ్యాడు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎక్కడికంటే అక్కడికి వెళ్తున్నాడు. ఫోన్లలోనే ప్రైవేట్ పంచాయితీలు చేస్తున్నాడు. ప్రాణరక్షణ నిమిత్తం ఎస్కార్టు కూడా వచ్చి చేరింది. ఇంటివద్ద బందోబస్తుగా పోలీసు పికెట్ సైతం ఏర్పాటైంది. వీటన్నింటితో రెచ్చిపోతున్నాడు. వైఎస్ వివేకా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు బెయిల్ కోసం కోర్టు మెట్లెక్కితే చాలు ఓ వైపు దస్తగిరి మీడియా సమావేశం.. మరోవైపు కోర్టులో డాక్టర్ సునీత ఇంప్లీడ్ పిటిషన్లు సమాంతరంగా తెరపైకి వస్తున్నాయి. తెర వెనుక మంత్రాంగం మేరకే గల్లీలో దస్తగిరి మీడియాతో మాట్లాడితే, సునీత కోర్టులో ఇంప్లీడ్ అవుతున్నారు. దస్తగిరిలో చేసిన తప్పుకు ఎక్కడా పశ్చాత్తాపం కనిపించడం లేదు. హీరోయిజం ప్రదర్శించేలా మీడియా సమావేశాల్లో గంటల తరబడి వివేకా హత్య గురించి కథ చెప్పినట్లు చెబుతున్నాడు. ఏకంగా సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిల నుంచి తనకు ప్రాణహాని ఉందని పదే పదే ప్రకటిస్తూ తనో సెలబ్రిటీ అన్నట్లు చెలరేగిపోతున్నాడు. పైనుంచి '40 ఇయర్స్ ఇండస్ట్రీ' సూచనల మేరకు స్థానికంగా టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి డైరెక్షన్‌లో నడుస్తున్నాడు.

క్లుప్తంగా...

ఉన్నమాటంటే రేవంత్‌కు ఉలుకెందుకు: జితేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారనే విషయం బహిరంగ రహస్యమేనని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌నేతలే విష యంపై చర్చించుకుంటు న్నారని, అయినా ఉన్నమాటంటే రేవంత్ రెడ్డికి ఉలుకెందుకని ప్రశ్నించారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా బుక్కైన రేవంత్ రెడ్డి సుద్దపూస లెక్క మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని శనివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం రేవంత్ రెడ్డి అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి రూ.50 కోట్లు ముట్టజెప్పారని ఆ పార్టీ నేతలే బహిరంగంగా ఆరోపించిన విషయాన్ని జితేం దర్‌రెడ్డి గుర్తుచేశారు. అట్లాంటి రేవంత్ రెడ్డి తాను కేసీఆర్ నుంచి డబ్బులు తీసుకోలేదంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కేసీఆర్ నుం డి కాంగ్రెస్ పార్టీ రూ.25 కోట్లు తీసుకుందని ఈటల రాజేందర్ చెప్పారే తప్ప ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు.

ప్రభుత్వంపై పోరాడండి

రేవంత్, ఈటలకు విజయశాంతి సూచన



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌తో పోరాడే తమ్ముళ్లు ఎ.రేవంత్‌రెడ్డి, ఈటల రాజేందర్ తమ దాడిని.. ఒకరిపై ఒకరు కాకుండా ఎవరికివారు ప్రభుత్వంపై పోరాడటం అవసరమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అభిప్రాయపడ్డారు. తెలంగాణ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న ఇద్దరికీ నిరంతర తెలంగాణ ఉద్య మకారిణిగా ప్రజా భిప్రా యం చెప్పడం తన బాధ్యత అనిపించిందని పేర్కొన్నారు. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రె స్‌కు బీఆర్ఎస్ రూ.25 కోట్లు ఇచ్చిందన్న ఆరో పణలపై ఆమె శనివారం ట్వీట్ చేశారు.

'కేసీఆర్ స్క్రిప్ట్‌తోనే కాంగ్రెస్ ఆరోపణలు'



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ స్క్రిప్ట్ ప్రకారం ఆరోపణలు చేస్తు న్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రె స్‌పై ఈటల వ్యాఖ్యలు చేస్తే, బీఆర్ఎస్ ఎమ్మె ల్సీ స్పందించడాన్ని బట్టి.. ఆ రెండు పార్టీలు ఒకటేనని అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలకు డబ్బులందాయన్న ఈటల ఆరోపణలు వాస్తవం కాదా? అని నిలదీశారు. భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లిన రేవంత్ రెడ్డి.. ఓటుకు కోట్లు కేసులో కూడా తనకెలాంటి సంబంధం లేదని, ఆ వీడియోలో ఉన్నది తాను కానని ప్రమాణం చేస్తే బావుండేదని అరుణ పేర్కొన్నారు.

వాటి మధ్య అవగాహన బహిరంగ రహస్యమే

బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తెరచాటు అవ గాహన ఉందన్నది బహి రంగ రహస్యమేనని బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్‌లోని రేవంత్ రెడ్డి వర్గం ఎందుకింత ఒంటికాలిపై లేస్తున్నారో ఆ పార్టీలోని ప్రతి ఒక్కరికీ తెలుసని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో కాంగ్రె స్‌కు ఎలాంటి బంధం ఉందో తెలుసుకోవడా నికి రేవంత్ రెడ్డి భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాల యానికి కాదు, ఢిల్లీకి వెళ్తే తెలుస్తుందన్నారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ నాయకులకు ఉన్న చీకటి మైత్రిని గమనించినట్లు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరి గిన ఒక రాజకీయ సభలో బీఆర్ఎస్ నేత కె.కే శవరావు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడుకోలేదా? అని ప్రశ్నించారు. ఈ విష యంపై రేవంత్‌కు ఏమైనా అనుమానాలుంటే ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేతలను అడిగి తెలుసుకుంటే మంచిదన్నారు.

రేవంత్, ఈటల ఇద్దరూ తోడుదొంగలే..

ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి ధ్వజం



హుజూరాబాద్/వీణవంక/కమలాపూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, టీపీ సీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇద్దరూ తోడుదొంగలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపిం చారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తనకు కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఇవ్వకుండా అడ్డు కునేందుకు వివేక్ వెంకటస్వామి ద్వారా రేవం త్‌కు ఈటల రూ.25 కోట్లు ఇచ్చినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ విషయంపై ఐటీ శాఖకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రేవంత్ రూ.25 కోట్లు తీసుకున్నట్లు, ఈటలనే ప్రక టించారన్నారు. ఇద్దరి మధ్య రూ.25 కోట్ల లావాదేవీలు జరిగినట్లు రెండేళ్ల క్రితమే తాను చెప్పానని కౌశిక్‌రెడ్డి శనివారం హనుమకొండ జిల్లా కమలాపూర్, హుజూరాబాద్, వీణవం కలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

కోరుకున్నది కొనేస్తున్నారు!



ఆన్‌లైన్ షాపింగ్‌పై మధ్య వయస్కుల అధికాసక్తి
బ్రాండెడ్ వస్తువులు, దుస్తులు, తదితరాల కొనుగోళ్లకు మొగ్గు
కరోనా కాలంలో పెరిగిన ఆసక్తి క్రమంగా అలవాటుగా మారుతున్న వైనం
బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, మ్యాట్రిక్స్ పార్ట్‌నర్స్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్

ఓ కొత్త వర్గం కస్టమర్లు ఆన్‌లైన్ షాపింగ్‌పై అధి కాసక్తి చూపిస్తున్నారు. నవతరం ముఖ్యంగా 18 నుంచి 25 ఏళ్ల లోపు యువతే ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువ చేస్తారనే అభిప్రాయం ఉంది. కానీ 35 ఏళ్లకు పైబ డిన వారు ఈ తరహా షాపింగ్‌పై అధికంగా మొగ్గ చూపుతున్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తు న్నాయి. వివిధ రకాల బ్రాండెడ్ వస్తువులు మొద లుకుని ఫ్యాషన్ దుస్తులు, ఇతర కొనుగోళ్లలో వీరు ముందున్నట్టు స్పష్టమౌతోంది. వివిధ రకాల యాప్‌లు, వెబ్‌సైట్ల వాడకంలో యువతరం ముం దున్నా, ఇప్పుడు మధ్య వయస్కులు కూడా ఈ విషయంలో వారితో పోటీ పడుతున్నారు. కరోనా మహమ్మారి కాలంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కొనుగోళ్లు ఊపందుకోగా తర్వాతి కాలంలో ఇది మరింత విస్తరించింది. క్రమంగా ఇది అలవాటుగా కూడా మారినట్లు వెల్లడవుతోంది. 2021లో మూడు నుంచి నాలుగు కోట్ల మంది కొత్తగా ఆన్‌లైన్ షాపర్స్ జాబితాలో చేరగా, అందులో 67 శాతం మంది 35 ఏళ్లకు పైబడిన వారే ఉండటం గమనార్హం. కాగా అందులోనూ అధికశాతం మెట్రో నగరాలకు చెందని చిన్న పట్టణాల మహిళలే ఎక్కువగా ఉండడం మరో విశేషం. వివిధ బ్రాండ్ల దుస్తులు గతంలో అందుబాటులో లేక నిరుత్సాహపడిన వీరంతా, ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా పెద్దమొత్తంలో ఖర్చు చేస్తూ బ్రాండెడ్ వస్తువులపై తమకున్న మోజును, ఇష్టాన్ని చాటుతున్నారు. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, మ్యాట్రిక్స్ పార్ట్‌నర్స్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన తాజా అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

ముఖ్యాంశాలివే...

కొత్త ఆన్‌లైన్ కస్టమర్లు డిజిటల్ విధానాలను గతంలో అంతగా వినియోగించక పోయినా, ఇప్పుడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో సులభంగా షాపింగ్ చేసే పద్ధతులను అన్వేషిస్తున్నారు

ఆన్‌లైన్‌లో వివిధ వస్తువులను షాపింగ్ చేస్తున్నపుడు ప్రాంతీయ భాషల్లో వాయిస్, వీడియో అసిస్టెన్స్ సర్వీసులను సైతం వీరు ఉపయోగిస్తున్నారు

తమకు గతేడాది రెండో శ్రేణి నగరాలు, అంతకంటే కిందిస్థాయి ప్రదేశాల నుంచే 80 శాతం ఆర్డర్లు వచ్చినట్టుగా మీషో వెల్లడించింది

ఈ సెగ్మెంట్ కస్టమర్లకు దగ్గరయ్యేందుకు చిన్న, మధ్యతరహా విక్రయదారుల ద్వారా స్థానికంగా ఆయా ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చేలా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ కామర్స్ కంపెనీలు తమ వంతు కృషి చేస్తున్నాయి

రాబోయే మూడేళ్లలో చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచే 50 శాతం ఆదాయం వస్తుందని కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

ఇప్పుడు పరిస్థితి మారిపోయింది

గతంలో కస్టమర్లను ఆకర్షించేందుకు ఆన్‌లైన్ కంపెనీలు డిస్కౌంట్లు, ఇతర మార్కెటింగ్ టెక్నిక్‌లను ఉపయోగించేవి. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సర్వీసెస్ వంటివి మామూలై పోయాయి. గతంలో ఏవైనా దుస్తులు, వస్తువులు, ఇతర వస్తువులను కస్టమర్లు కొనేలా చేసేందుకు వాటిని వారి చేరువగా తీసుకెళ్లి తమ ఉత్పత్తులు అమ్ముడయ్యేలా చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ అందుబాటులోకి రావడంతో వీరు, వారు అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారు ఖర్చుకు వెనకాడకుండా తమకు నచ్చిన వస్తువులు కొనేందుకు సిద్ధమౌతున్నారు.



తరుణ్ తావ్డా, ఎండీ, మ్యాట్రిక్స్ పార్ట్‌నర్స్ ఇండియా

బీజేపీలో ప్రాధాన్యం లేదనే..

ఈటల రాజేందర్ ఆరోపణలపై రేవంత్‌రెడ్డి ఫైర్

- కేసీఆర్ పాలనపై పోరాటం చేస్తున్నదే మేము
- నీలా లొంగిపోయి పోరాటం ఆపినవాడిని కాదు
- కొట్లాడేవారికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్న
- భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేసిన రేవంత్



చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న రేవంత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నదే నేను, కాంగ్రెస్ పార్టీ. మా నిజాయతీని ఈటల రాజేందర్ శంకించడం ఏమిటి? బీజేపీలో ఈటలకు తగిన ప్రాధాన్యత లేక నే.. అమిత్‌షా దృష్టిలో పడేందుకు కావాలని సంచ లన ఆరోపణలు చేస్తున్నారు. అసలు ఇన్నాళ్లూ కేసీ ఆర్ చేసిన తప్పుల్లో ఈటల భాగస్వామ్యం ఎంత ఉందో ఆయనే చెప్పాలి..'' అని టీపీసీసీ చీఫ్ రేవం త్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మునుగోడు ఎన్నికల సమ యంలో కాంగ్రెస్‌కు కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారం టూ ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలు అవా స్తవమంటూ.. రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేశారు. తర్వాత మీడియాతో మాట్లా డారు. తాను కేసీఆర్ నుంచి ఎలాంటి డబ్బులూ తీసుకోలేదని, తీసుకుని ఉంటే తాను, తన కుటుం బం సర్వనాశనమై పోతామని వ్యాఖ్యానించారు.

కొట్లాడేవారికి ఇచ్చే గౌరవం ఇదేనా?

''కేసీఆర్‌తో ఎలాంటి లాలూచీ లేదు. రాజీ నా రక్తంలో లేదు. కేసీఆర్, కేటీఆర్‌ల దోపిడీపై పోరాడినం దుకే నన్ను జైల్లో పెట్టారు. జైలులో ఉన్న 16 రోజులు నిద్ర లేని రాత్రులు గడిపా. నేను కేసీఆర్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి ఈటల రాజేందరే సాక్ష్యం. ఈటలపై కేసీఆర్ కక్ష కట్టినప్పుడు మేం సానుభూతి చూపించాం. కానీ ఈటల మాత్రం కేసీ ఆర్‌ను ప్రశ్నించే గొంతుకలపై దాడి చేస్తున్నారు. ఇదేనా కొట్లాడేవారికి ఇచ్చే గౌరవం?'' అని రేవంత్ ప్రశ్నించారు. తన ఆఖరి రక్తపు బొట్టు వరకు కేసీఆ ర్‌పై పోరాటం చేస్తానని పేర్కొన్నారు. 'ప్రజల కోసం పోరాడితే అమ్ముడుపోయారంటారా. నేను నీలాగా లొంగిపోయి పోరాటాన్ని ఆపిన వాడిని కాదు' అని ఈటలపై ధ్వజమెత్తారు.

అమ్మతోడు, అయ్యతోడు అంటే సరిపోతదా?

రేవంత్‌రెడ్డి విమర్శలపై ఈటల రాజేందర్ కౌంటర్

- ఎందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ ప్రాపకంతో బతుకుతున్నారో తెలియదా?
- ఆత్మసాక్షి ప్రకారం ప్రజల పక్షాన ధర్మం, న్యాయం కోసం మాట్లాడా..
- అందరికీ త్వరలోనే తగిన జవాబు చెప్తానని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తాను చేసిన ఆరోపణలపై కాం గ్రెస్ నేతలంతా పూర్తిస్థాయిలో మాట్లాడాక.. వాటిపై తప్పకుండా స్పందించి, అందరికీ తగిన సమాధానాలు చెప్తానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. ''గుళ్లకు వెళ్లి అమ్మతోడు, అయ్యతోడు, పిల్లల తోడు అంటే అయిపోతదా? ఈ సవాళ్లు ఎందుకు? రాజకీయ నేతలకు తాను చెప్పే మాటలపై ధైర్యం, విశ్వాసం ఉండాలి. వ్యక్తులకు తమపై తమకు నమ్మకం లేనప్పుడే ఇలాంటివి వస్తాయి. ఎంతమం ది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ ప్రాపకంతో బతుకుతున్నారో తెలియదా?'' అని వ్యాఖ్యానిం చారు. శనివారం శామీర్‌పేటలోని తన నివాసం వద్ద ఈటల మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.తాను పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నానని, తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తిని కాదని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయాల గురించి, కేసీఆర్ వ్యవహారశైలి, అవినీతి మార్గంలో డబ్బులు సంపాదిస్తున్న తీరు, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్న పరిస్థితిపై తాను శుక్రవారం మీడియా సమావేశంలో వివరించానని చెప్పారు. ఈ సంద ర్భంలో మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధాన మిస్తూ.. మునుగోడులో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ రూ.25 కోట్లు ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించానని చెప్పారు. తన ఆత్మసాక్షి ప్రకారమే మాట్లాడానని వివరించారు. తాను ఒక వ్యక్తిని కించపరిచే, దూషించి గాయపరిచే వాడిని కాదన్నారు. ప్రజల పక్షాన నిలబడి ధర్మం కోసం, న్యాయం కోసం మాట్లాడుతానే తప్ప వ్యక్తుల కోసం మాట్లాడ బోనని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి పోరాడలేదని తానెప్పుడూ అనలేద న్నారు.

ఆరోపణలు రుజువు చేయకపోతే రాజకీయంగా వేటాడుతా

రేవంత్‌కు రాజగోపాల్‌రెడ్డి హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రూ.18 వేల కోట్లకు తాను అమ్ము డుపోయానని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయకపోతే ఆయ నను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. 'పారదర్శకంగా జరిగిన గ్లోబల్ కాంపిటిటీవ్ బిడ్డిం గ్‌లో టెండర్ దక్కితే, దానిని కప్పిపుచ్చి అమ్ము డుపోయానంటూ మునుగోడు ఎన్నికల సమయం లో తప్పుడు ఆరోపణ చేసిన దగుల్బాజీ రేవంత్' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'రేవంత్‌ను రాజ కీయంగా వేటాడుతా. కోర్టు ద్వారా కూడా ఆయన సంగతి తేలుస్తా. నేను వేసే పరువునష్టం కేసులో ఎప్పటికైనా ఆయన జైలుకెళ్లడం ఖాయం'అని పే ర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితతో కలిసి రేవంత్ వ్యాపారలావాదేవీలు చేసింది వాస్తవం కాదా' అని నిలదీశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి రూ.25 కోట్లు కాంగ్రెస్‌కు ముట్టాయని, వాటిలో పది కోట్లు రేవంత్ నొక్కేశారని కాంగ్రెస్ నేతలే అంతర్గతంగా మాట్లాడుకుంటున్న విషయం వాస్తవం కాదా అని నిలదీశారు. మునుగోడులో బీజేపీ గెలిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పతనమవు తుందని తనను ఓడించేందుకు బీఆర్ఎస్‌తో లోపా యికారి ఒప్పందం కుదుర్చుకుని ఆపార్టీని గెలిపిం చడం రాజకీయవ్యభిచారం కాదా అని ప్రశ్నించారు.

ఘాటెక్కిన 'కోట్లా'ట

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపణలకు దిగడం హాట్‌టాపిక్‌గా మారింది.

ఈటల టార్గెట్‌గా కాంగ్రెస్..

మునుగోడు ఉప ఎన్నిక, రూ.25 కోట్ల డీల్ ఆరోప ణలపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను లక్ష్యం గా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ముప్పేట దాడికి దిగిం ది. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని, భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయాలని రేవంత్ సవాల్ విసరగా.. కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, ఈరవత్రి అనిల్, మును గోడులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పాల్వాయి స్రవంతి తదితరులు కూడా ఈటలపై విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలను నిరూపించలేకపోతే ఈటల రాజేందర్ గాంధీభవన్ వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లూ తెలంగాణ ఉద్యమకా రుడిగా ఈటలపై తమకు గౌరవం ఉండేదని.. కానీ నైతికత మరిచి విమర్శలు చేయడం ద్వారా తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. ఈటల చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ ప్రధాన కార్య దర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ శనివారం ఉస్మానియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి ఆధా రాలు లేకుండా వ్యాఖ్యలు చేసి, కాంగ్రెస్ పార్టీకి చెం దిన 40లక్షల మంది కార్యకర్తల మనోభావాలను రాజేందర్ దెబ్బతీశారని, ఆయనపై చర్యలు తీసు కోవాలని ఫిర్యాదులో కోరారు.

రేవంత్ లక్ష్యంగా కమలనాథులు

ఇక ఈటల వ్యాఖ్యల్లో తప్పు లేదని, నిజంగానే మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ డీల్ కుదుర్చుకున్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. మునుగోడులో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన కోమ టిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నేరుగా రేవంత్‌పైనే విమ ర్శలు గుప్పించారు. రేవంత్ ఓ బ్లాక్ మెయిలర్ అని, డబ్బులిచ్చి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్నా రని, రేవంత్ అడుగుపెడితే భాగ్యలక్ష్మి ఆలయం అపవిత్రమవుతుందని వ్యాఖ్యానించారు. ఈటల ఆరోపణలపై రేవంత్ తీవ్రంగా స్పందిస్తున్నారని, మరి తనపై రూ.18వేల కోట్ల కాంట్రాక్టులు అంటూ చేసిన ఆరోపణల సంగతేమిటని నిలదీశారు. ఇక రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లి 'ఓటుకు కోట్లు' కేసులో తాను డబ్బులు ఇవ్వ లేదని ప్రమాణం చేయాలని బీజేపీ జాతీయ ఉపా ధ్యక్షురాలు డీకే అరుణ వ్యాఖ్యానించారు.

రేవంత్‌కు ఈటలే డబ్బులిచ్చాడంటూ..

బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య జరు గుతున్న మాటల యుద్ధంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఈటల రాజకీయ ప్రత్యర్థి పాడి కౌశి క్‌రెడ్డి ఎంటర్ అయ్యారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తనకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుండా రేవంత్‌రెడ్డికి ఈటల రాజేందర్ రూ.25 కోట్లు ఇచ్చాడని ఆరోపించారు. ఈ విషయాన్ని పొరపాటున బయటికి చెప్పేసిన ఈటల మాటమార్చి బీఆర్ఎస్‌పైకి నెట్టేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు నేతల మధ్య జరిగిన నగదు మార్పిడిపై ఆదాయ పన్ను కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీల చీకటి ఒప్పందంలో భాగంగానే..

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి



హుజూరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్‌ల చీకటి ఒప్పందంలో భాగంగానే హుజూ రాబాద్ ఉప ఎన్నిక వచ్చిందని, ఢిల్లీ మే దోస్తీ, గల్లీ మే కుస్తీ అన్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆరోపించారు. హుజూరాబాద్‌లోని శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తన ఉనికి కాపా డుకునేందుకే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణానికి సవాల్ విసిరితే ఎందుకు స్వీకరించలేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చేసిన తప్పుల్లో, అక్రమాల్లో ఈటల రాజేందర్‌కు పాత్ర ఉందనే అనుమానాలు కలుగు తున్నాయ న్నారు. ఈటల ఆర్థిక మంత్రిగా పనిచే సిన సమయంలోనే రాష్ట్రంలో అనేక అక్రమాలు జరి గాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నాడని, కాళేశ్వరం ప్రాజెక్టులో అవి నీతికి పాల్పడ్డాడని ఆరోపణలు చేస్తున్న బీజేపీ ఈ విషయంపై కేంద్రానికి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే ఇప్పటికైనా సీఎంపై ఫిర్యాదు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడే ఉత్తమ కుమార్ రెడ్డికి బంధువు అని నమ్మి సమాచారం ఇస్తే ఆ సమాచారాన్ని టీఆర్ఎస్ పార్టీకి అమ్ముకు న్నాడని ఆరోపించారు. కౌశిక్ రెడ్డి చేసిన తప్పులను గ్రహించి కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తారని ముందే భావించి సీక్రెట్‌గా కేటీఆర్‌ను కలిసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డికి వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి పాత్ర ఉన్నట్లు అనుమానం కలుగుతోం దని..త్వరలోనే ఈ విషయం బయట పడుతుందని ఆరోపించారు. కౌశిక్ నిజాయితీపరుడైతే బిజిగిరి షరీఫ్ దర్గాలో గానీ..ఇల్లందకుంట రామాలయం లో గానీ తాను ఎవరినీ మోసం చేయలేదని ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.

ఈటల దిష్టిబొమ్మల దహనం నేడు

యూత్ కాంగ్రెస్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేం దర్ కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలను వెనక్కు తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మల దహనానికి యూత్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఈటల రాజేందర్ దిష్టిబొమ్మల దగ్ధం కార్యక్రమాన్ని చేప ట్టాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కళ్లలో నీళ్లు చూశామని, రాజేందర్ క్షమాపణ చెప్పేంతవరకు ఆయన వెంట పడతామని, ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు.

'చేవెళ్ల'తో శంఖారావం!

▶ మొదటి పేజీ తరువాయి

సాగనుందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

తీవ్ర స్థాయిలో విమర్శలతో..

చేవెళ్ల సభలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్‌లపై అమిత్‌షా ఎన్నికల యుద్ధాన్ని మొదలుపె ట్టనున్నారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యం గా సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, బీఆర్ఎస్ సర్కార్, అధికార పార్టీ నేతల తీరుపై అమిత్‌షా తీవ్ర స్థాయిలో విమర్శలు చేసే అవకాశం ఉందని అంటు న్నాయి. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాలను, కుటుం బ పాలన, ఎన్నికల హామీల అమల్లో వైఫల్యం తదితర అంశాలను లేవనెత్తుతారని పేర్కొంటు న్నాయి. ఇక వచ్చే నెల 10న కర్ణాటకలో పోలింగ్ ఉన్నందున.. తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాం తాల్లోని ఓటర్లను కూడా ప్రభావితం చేసేలా చేవెళ్ల సభలో అమిత్‌షా ప్రసంగం ఉంటుందని నేతలు అంటున్నారు. ఆదివారం సంఘ సంస్కర్త బసవే శ్వర జయంతి నేపథ్యంలో లింగాయత్ సామాజికవ ర్గాన్ని ఆకట్టుకునేలా, కర్ణాటక ఎన్నికల్లో ఆ వర్గం ఓట్లను బీజేపీకి అనుకూలంగా మలుచుకునేలా ప్రకటనలు ఉండొచ్చని చెప్తున్నారు.

చేరికలు, ఇతర అంశాలపై స్పష్టత

సభ అనంతరం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోట ల్‌లో పార్టీ రాష్ట్ర ముఖ్యనేతలతో అమిత్‌షా భేటీ కానున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో, ఇతర నేతలతో కీలక అంశాలపై సమీక్షించనున్నారు. ఈ సందర్భం గా ఇతర పార్టీల నుంచి చేరికలు, సంస్థాగత అంశా లపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉందని నేతలు చెప్తున్నారు. అమిత్‌షా పర్యటన తర్వాత రాష్ట్రంలో రాజకీయ వేడి తారస్థాయికి చేరుతుందని.. బీజేపీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటుందని అంటు న్నారు. ఆదివారం చేవెళ్లసభలో పార్టీ రాష్ట్ర అధ్యక్షు డు బండి సంజయ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డ్ సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీ య ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, సీనియర్ నేతలు మురళీధర్‌రావు, ఈటల రాజేందర్ ఇతర నేతలు పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ గెలుపు సంకేతం పంపుదాం

- అమిత్‌షా విజయ సంకల్ప సభను విజయవంతం చేద్దాం..
- పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల 'విజయ సంకల్పసభ' ద్వారా తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమనే సంకేతాలు పంపుదామని పార్టీ నాయకులు, కార్యక ర్తలకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపుని చ్చారు. ఆదివారం చేవెళ్లలో నిర్వహిస్తున్న అమిత్ షా సభ రాష్ట్రంలో ఒక సంచలనం కావాలని సూచించారు. సభకు భారీగా జనం వచ్చే అవకాశం ఉందని, తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నేతలతో సంజయ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చేవెళ్ల సభ విజయవంతానికి ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేపట్టాల న్నారు. సభను సక్సెస్ చేయడం ద్వారా తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమనే నమ్మకాన్ని జాతీయ నాయకత్వానికి కల్పిం చాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతృత్వ, అవినీతి పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, వారు ప్రత్యామ్నాయంగా బీజేపీపై నమ్మకం పెట్టుకు న్నారని పేర్కొన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నించే అవకాశం ఉందన్నారు. ప్రజలు అండగా ఉన్నారని, కార్యకర్తలు భయపడా ల్సిన అవసరం లేదన్నారు. కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో అవినీతిరహితపాలన సాగుతోందని, తెలంగాణలోనూ అలాంటి పాలనే కావాలని ప్రజ లు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో మహారాష్ట్ర పార్టీ విలీనం

కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నేతలు



బాబాసాహెబ్ షెల్కేకు బీఆర్ఎస్ కండువాను కప్పుతున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని ఔరం గాబాద్‌లో భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ సిద్ధ మవుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ రాష్ట్రానికి చెందిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ రాష్ట్రీయ పార్టీ బీఆర్ఎస్‌లో విలీనమవుతున్నట్లు ప్రకటించింది. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధిం చి తెలంగాణ మోడల్ అత్యున్నతమైనదని, ఈ మోడల్ మహారాష్ట్రలోనూ అమలు కావాలంటే కేసీ ఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో పనిచేయడమే ఉత్తమమని భావించి ఈ కీలక నిర్ణయం తీసు కున్నట్లు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ రాష్ట్రీయ పార్టీ అధ్యక్షుడు బాబాసాహెబ్ షెల్కే తెలిపారు. షెల్కేతోపాటు ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు శనివారం ఛత్రపతి శంబాజీనగర్ (ఔరంగబాద్)లో పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డితో సమావేశమయ్యారు. తమ పార్టీని బీఆర్ఎ స్‌లో బేషరతుగా విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.

మరోవైపు మహారాష్ట్రలోని వివిధ పార్టీల నేతలు శనివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కేసీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మహారాష్ట్ర ఎన్సీపీ సెక్రటరీ దినేశ్ బాబూ రావు మడావి, గిరిజన హక్కుల సామాజిక కార్య కర్త బోళా శంబాజీ మడావి, ఎమ్మెన్నెస్ పుణే జిల్లా అధ్యక్షుడు దీపక్ సురేష్ పాటిల్., గోండ్వానా గణ తంత్ర పార్టీ చంద్రాపూర్ జిల్లా నేత నామ్ దేవ్ ఆడే తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సీసీఎస్ ఇన్‌చార్జి కమిటీ కొనసాగింపు

మరో ఏడాది కాలానికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సహకార పరపతి సం ఘాని (సీసీఎస్)కి పాలకమండలి (మేనేజింగ్ కమిటీ) ఎన్నికలు నిర్వహించేందుకు యాజ మాన్యం సిద్ధంగా లేకపోవడంతో మరోసారి నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ పొడి గించారు. అయితే ఇప్పటివరకు కొనసాగుతున్న కమిటీలో 10 మంది సభ్యులుండగా కొన్ని ఆర్టీసీ యూనియన్ల అభ్యంతరం మేరకు ఆ సంఖ్యను మూడుకు కుదిస్తూ మరో ఏడాది కాలానికి కమిటీని పొడిగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికలు నిర్వహించకపోవడంతో...

పది మందిగల సీసీఎస్ మేనేజింగ్ కమిటీ గడువు 2021 నవంబర్‌తో ముగియగా ఆ తర్వాత ఆర్టీసీ ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా పాత సభ్యులనే 6 నెలల చొప్పున రెండుసార్లు కొనసాగిస్తూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దాని గడువు కూడా గతేడాది నవంబర్‌తో పూర్తి కావడంతో ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు కోరాయి. కానీ ఆర్టీసీలో కార్మిక సంఘాలను గుర్తించే పరిస్థితి లేకుండా పోయినందున ఎన్నికలకు ఆర్టీసీ సిద్ధంగా లేదు. అయితే పాత ఇన్‌చార్జి కమిటీలో ఒక సంఘా నికే (నాటి గుర్తింపు సంఘం) చెందిన వారే ఉండ టంతో కొన్ని కార్మిక సంఘాలు అభ్యంతరం చెప్పాయి. దీంతో పది మందికి బదులు ముగ్గురిని నియమిస్తామని, పాత కమిటీలోంచి పేర్లు పం పాలని కమిషనర్ కోరగా నలుగురు సభ్యులతో ఓ జాబితాను నాటి కమిటీనే పంపింది. అందులోంచి మూడు పేర్లను ఎంపిక చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



ఈద్ ముబారక్



మక్కా మసీదు వద్ద ముస్లింల ప్రార్థనలు

నగరం రంజాన్ శోభను సంతరించుకుంది. నెల రోజులు ఉపవాసాలు పాటించి శనివారం ఈద్గాల్లో ఈదుల్ ఫితర్ నమాజ్‌లు చేశారు. నూతన వస్త్రధారణల్లో ముస్లింలు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు అందజేసుకున్నారు.



మాసబ్‌ట్యాంక్ వద్ద..



చార్మినార్ వద్ద విదేశీయులు..



చిన్నారుల రంజాన్ శుభాకాంక్షలు



మీరాలం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

న్యూస్‌రీల్

క్రికెట్ బెట్టింగ్ ముఠాకు చెక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

నిజాంపేట్: ఐపీఎల్ సీజన్ అక్రమార్కులకు వరంగా మారింది. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. ఇందుకు సంబంధించిన విషయాలను శనివారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ చంద్రశేఖర్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ ఫికాక్ జంక్షన్ సమీపంలోని కేఎస్‌ఆర్ క్లాసిక్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌నంబర్ 401లో కొద్దిరోజులుగా క్రికెట్ బెట్టింగ్ సాగుతోంది. శనివారం సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్‌ల సందర్భంగా బెట్టింగ్ జరుగుతుందనే సమాచారంతో బాచుపల్లి పోలీసులు, బాలనగర్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముఠాను అదుపులోకి తీసుకున్నారు. బెట్టింగ్‌కు పాల్పడిన ఎన్.గణేశ్ కుమార్, బి.శ్రీనివాస్‌రావు, ఎస్.రాంబాబు పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. బుకీల నుంచి దాదాపు రూ.23 లక్షలు, 2 ల్యాప్‌టాప్‌లు తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. సమావేశంలో బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమార్, ఎస్‌ఐ మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి మూసీ ప్రక్షాళనకు పాదయాత్రలు

సుల్తాన్‌బజార్: మూసీ జలాల పరిరక్షణ కోసం ఈ నెల 23 నుంచి జూన్ 15వ తేదీ వరకు పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటదాస్, పీట్ల నాగేష్, ప్రొఫెసర్ రాజారావులు తెలిపారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నగర శివారు, నల్లగొండ తదితర ప్రాంతాలలో మూసీ పరీవాహక ప్రాంతాలలో కొందరు రైతులు మూసీ జలాలతో కూరగాయలు పండిస్తున్నారని, వాటిని నగరంలోని బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, మోండా మార్కెట్లలో అమ్ముతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారరు. మూసీ జలాల పరిక్షణ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఆదివారం నుంచి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు రవికిశోర్, రంగానాథ్, నాగరాజు, రత్నశేఖర్, డాక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

9న 'హైస్ 101వ మెగా జాబ్ మేళా'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శిల్పకళా వేదికగా మే 9న 101వ అతిపెద్ద జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నామని హైస్ (హెచ్‌వైఎస్‌ఈ) ప్లేస్‌మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు మనేష్ కొండూరి తెలిపారు. మాదాపూర్ వేదికగా శనివారం హైస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 101వ మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ, హెచ్‌ఆర్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, అడ్మినిస్ట్రేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ తదితర విభాగాల్లో దాదాపు వందకుపైగా దేశీ, విదేశీ ఎమ్మెన్సీ కంపెనీల్లో 20 వేల ఉద్యోగాల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు 76750 56432, 72074 56432, 76749 56432, 77025 35577, 93925 79539లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఫీజులుమే..

బడ్జెట్ స్కూళ్లలో 20 శాతం పెంపు

- కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారం
- సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈలో ఆగని బాదుడు
- తల్లిదండ్రులకు మెసేజ్‌లు, నోటీసులు



గ్రేటర్ పరిధిలో ప్రైవేటు స్కూళ్ల్స్ ఇలా

హైదరాబాద్: 1,903
మేడ్చల్–మల్కాజిగిరి: 1,462
రంగారెడ్డి: 2,882

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు పెంచేశాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియక ముందే 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజుల వివరాలు ప్రకటిస్తున్నాయి. ఏకంగా తరగతి వారీగా ఫీజుల వివరాలను ముద్రించి విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిస్తున్నాయి. బడ్జెట్ స్కూల్స్ సైతం గతేడాదితో పోల్చితే 20 శాతం, కార్పొరేట్ స్కూల్ 30 శాతం ఫీజులు పెంచేయగా, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూల్ మాత్రం ఇష్టానుసారం మోత మోగిస్తున్నాయి. ఫీజుల పెంపుతో మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల గుండెలు గుబేల్‌మంటున్నాయి. వాస్తవంగా ఫీజుల నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినా ఆచరణలో అమలు లేకుండాపోయాయి. ఇప్పటికే చాలా స్కూళ్లలో ఫైనల్ పరీక్షలు పూర్తి కాగా, కొన్నింటిలో మాత్రం కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది కట్టాల్సిన ఫీజుల విషయంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు వాట్సాప్ మెసేజ్‌లు, నోటీసులు, మెయిల్స్ పంపిస్తున్నారు.

రూ.1.2 లక్షల నుంచి రూ.1.6 లక్షలకు..

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్ల ఫీజుల వాతపెడుతున్నాయి. వీటిలో సీట్లు లభించడమే గగనంగా తయారైంది. కొత్త అడ్మిషన్లకు స్కూల్ అభివృద్ధి పేరిట భారీగా వసూలు చేయడంతో పాటు ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఈ స్కూళ్లలో ఎల్‌కేజీకి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నారు. నాలుగో తరగతికి రూ.1.2 లక్షల నుంచి రూ.1.6 లక్షలకు పెంచారని పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా ఫీజులు పెంచడాన్ని ప్రశ్నిస్తే పలు స్కూలు యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతున్నాయని అంటున్నారు. మంత్రి వర్గ ఉపసంఘం సిఫారసు ప్రకారం.. గతేడాది పాఠశాలలు మునుపటి సంవత్సరంలో కంటే వసూలు చేసిన ఫీజులో 10 శాతానికి మించి ఫీజులను పెంచకూడదు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి వచ్చే 2023-2024 విద్యా సంవత్సరానికి చాలా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులను పెంచేస్తున్నాయి.

పట్టింపులేని తనం..

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడంవల్ల పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలో అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో ఒక్కసారి కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులతో మార్చి వరకు కమిటీని ఏర్పాటు చేసి ఏప్రిల్‌లో ఫీజులు నిర్ణయించాలి. ఈ నిబంధనలను పట్టించుకునే వారే లేరు.సర్కారు నిబంధనలను లెక్క చేయకుండా, ఇష్టారాజ్యంగా నడుస్తున్న పాఠశాలలపై అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగుతున్నా...అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్నా.. తమకేమీ పట్టనట్టుగా వ్యవహారించడం విస్మయానికి గురిచేస్తోంది.

ఆ స్కూళ్లపైనే మోజు..

కార్పొరేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లపైనే విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వాస్తవంగా చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి స్కూల్‌లో జాయిన్ చేసి ఉన్నత చదువులు చదివించాలని భావిస్తారు. ఇంగ్లిషు మీడియంపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. తల్లిదండ్రుల వీక్‌నెస్‌ను క్యాష్ చేసుకుంటున్న చాలా కార్పొరేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా ఫీజులను పెంచి.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. భారీ మొత్తంలో ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆశలకు తూట్లు

తూతూమంత్రంగా 'కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్'

- మొక్కుబడి తంతుగా మారిన తీరు
- కనీస సమాచారమూ కరువు
- కాగితాలకే పరిమితమైన వైనం



సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల చూపుతోనో.. లేక నిజంగానే ప్రజల సమస్యలను పరిష్కరించాలనో గాని ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే లక్ష్యంతో వివిధ కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీలో ప్రజలకు సంబంధించిన పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లపై గుంతలు, వీధికుక్కలు తదితర సమస్యల్ని పరిష్కరించేందుకు సంబంధిత విభాగాల నుంచి అధికారులతో కూడిన బృందాలు ప్రజల వద్దకే వెళ్లాలని మున్సిపల్ శాఖ ఇటీవల మెమో జారీ చేసింది. దాని మేరకు ఈ నెల 1 నుంచే ఈ కార్యక్రమాలు ప్రారంభించాలి. కానీ.. ఆయా సర్కిళ్లలో ఎవరి వెసులుబాటును బట్టి వారు పదో తేదీ తర్వాత ప్రారంభించారు. మొక్కుబడిగా మమ అనిపించారు.

సరైన సమాచారం ఏదీ?

లక్ష్యం మేరకు, ఈ కార్యక్రమాల గురించి ప్రజలకు సమాచారం ఉండాలి. వారు తమ సమస్యల గురించి సంబంధిత కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, బస్తీ సంఘాలు, ఎన్జీఓలకు తెలియజేయాలి. వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి నియమించే ఆఫీసర్లతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు ఆయా సంఘాలతో కలిసి స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకోవాలి. దృష్టికి వచ్చిన సమస్యల్ని సంబంధిత విభాగాల అధికారులకు తెలియజేస్తే వారు వెంటనే సమస్యను పరిష్కరించాలి. ఇందుకు జీహెచ్ఎంసీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలి. ఇదీ కార్యక్రమం అసలు లక్ష్యం. అందుకే దీనిని 'కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్.. సిటిజెన్ గ్రీవెన్స్ డిస్పోజల్'గా వ్యవహరిస్తున్నారు. తమకు తెలిసిన ఒకటి రెండు అసోసియేషన్లతో సమావేశాలు ముగించి మమ అనిపిస్తున్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న అన్ని సంఘాలకు తెలియజేయడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

అన్నిటికీ ఒకటే మంత్రం?

ఇబ్బందికరమైన కొన్ని విషయాలను మాత్రం ప్రచారం చేయవద్దని గతంలో పైస్థాయినుంచి అందిన ఆదేశాలను ఆసరా చేసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు ఏ సమాచారాన్నీ తెలియజేయడం లేదు. చివరకు మంచి కార్యక్రమాల్లో సైతం గోప్యత పాటిస్తున్నారు. అధికారుల ఈ విచిత్ర పోకడతో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం పనిచేయాలని భావించినా ఆ విషయం కూడా తెలియడం లేదు. ఏవో కొన్ని కాలనీ సంఘాలతో సమావేశమవుతున్న అధికారులు సమావేశాలు ముగించాం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. నిజంగా తాము చేస్తున్న పనుల గురించి ప్రజలకు తెలుసా.. లేదా అన్నది కూడా పట్టించుకోకుండా మొక్కుబడి తంతుగా 'ప్రభుత్వం చెప్పింది.. మేం చేశాం' అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

వర్క్‌షాప్ నిర్వహించకుండానే..

వాస్తవానికి ఈ సమావేశాలకు ముందు వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని ప్రభుత్వం జీహెచ్ఎంసీకి జారీ చేసిన మెమోలో ఆదేశించింది. కానీ.. ఎలాంటి వర్క్‌షాప్ నిర్వహించకుండా, ప్రజలకు తెలియజేయకుండా వారి సమస్యలెలా పరిష్కరిస్తారో జీహెచ్ఎంసీ అధికారులకే తెలియాలి.

అవగాహన కల్పించాల్సినవి..

ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా సూచించిన వాటిల్లో భవనాలకు ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు, పార్కుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం.. తడి- పొడి చెత్త వేరు చేయడం, చెరువుల్లో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచడం, రోడ్లు,నాలాల్లో వ్యర్థాలు వేయకపోవడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయకుండా ఉండటం, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితరమైనవెన్నో ఉన్నాయి. మంచి ఆశయంతో ప్రభుత్వం ఇలా వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించమంటే.. అధికారుల మొక్కుబడి తీరుతో ఫలితం కనిపించడం లేదు.

అన్ని సమస్యలపైనా..

కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం ద్వారా అదీ ఇదీ అని కాకుండా ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలకూ పరిష్కారం చూపాలని ప్రభుత్వం సూచించింది. అంతేకాకుండా ఆయా అంశాల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని కూడా పేర్కొంది. కానీ.. ఎక్కడా అలా అమలవుతున్న దాఖలాల్లేవు.

ఒక్కటని కాదు..

పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వం సూచించిన అంశాల్లో చెత్తకుప్పలు, కన్‌స్ట్రక్షన్, డిమాలిషన్ వ్యర్థాలు, పబ్లిక్ టాయ్‌లెట్లు, స్వచ్ఛ ఆటోలు, కలుషిత చెరువులు, నీటినిల్వ ప్రాంతాలు, రోడ్లపై గుంతలు, ఫుట్‌పాత్‌లు, ప్రమాదకర నాలాలు, మూతల్లేని, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు, కోతులు, పందులు, నాలాల్లో పూడిక, దోమలు, పైప్‌లైన్ల కేజీలు, నీటి నాణ్యత, ఈవ్‌టీజింగ్, గ్యాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, విద్యుత్‌కు సంబంధించి లూజ్ వైర్లు తదితరాలు ఉన్నాయి.

టార్గెట్ చేవెళ్ల

గెలుపే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

- కొంచెం కష్టపడితే సీటు ఖాతాలో పడుతుందనే అంచనా..
- అందులో భాగంగానే చేవెళ్ల లోక్‌సభ స్థానంపై స్పెషల్ ఫోకస్
- నేటి అమిత్‌షా పర్యటన అనంతరం మరింత దూకుడు





సభా స్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సాక్షి, సిటీబ్యూరో: చేవెళ్ల లోక్‌సభ స్థానంపై భారతీయ జనతాపార్టీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. కొంచెం కష్టపడితే గెలిచే స్థానాల జాబితాలో ఉన్న ఈ నియోజకవర్గంలో పాగా వేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. హ్యాట్రిక్ విజయంతో కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలని భావిస్తున్న అధిష్టానం ఇప్పటివరకు ఖాతా తెరవని స్థానాలపై గురిపెట్టి చేవెళ్లను టార్గెట్ చేసింది. గెలుపు వాకిట ఉన్నామన్న అంచనాలతో 'టార్గెట్ చేవెళ్ల' పేరుతో ముందుకు సాగుతోంది. పట్టణ ఓటర్లు, ఐటీ నిపుణులు, ఉద్యోగులు ఎక్కువగా ఉన్న రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి రావడం.. ఇక్కడ బీజేపీకి ప్రజాదరణ మెండుగా ఉండడం కలిసొచ్చే అంశంగా ఆ పార్టీ భావిస్తోంది. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు వరకు నామమాత్రంగా ఉన్న కమలనాథుల బలం ఆ తర్వాత పెరగడం, వలసలు కలిసి వస్తుండడంతో ప్రత్యర్థులకు సవాల్ విసిరే స్థాయికి చేరుకుంది. ఈ బలమే ఆసరాగా టార్గెట్ చేవెళ్లను పక్కాగా అమలుపరిచే కార్యాచరణ సిద్ధం చేసి ఏకంగా అమిత్‌షాను రంగంలోకి దింపింది.

ఒట్టిదేం కాదు.. గట్టిదే

చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో బీజేపీకి గట్టి పట్టుంది. గతంలో ఈ నియోజకవర్గం అత్యధిక ప్రాంతం హైదరాబాద్ లోక్‌సభ స్థానంలోకి వచ్చేది. దీంతో మజ్లిస్–బీజేపీ మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగేది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. చేవెళ్ల కేంద్రంగా సగం గ్రామీణ, సగం పట్టణ ఓటర్లతో కూడిన అసెంబ్లీ సెగ్మెంట్లతో లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. మొత్తం ఓట్లలోనూ సింహభాగం పట్టణప్రాంతాల్లోనే ఉండడంతో కొంచెం శ్రమిస్తే ఆధిక్యత కనబరచడం పెద్ద కష్టం కాబోదని అంచనా వేస్తోంది. గత ఎన్నికల్లోనూ ఐటీ హబ్ ప్రాంతంలో కమలం పార్టీకి గణనీయంగా ఓట్లు వచ్చాయి. అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ సమీకరణలతో పెనుమార్పులు సంభవించాయి. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ వార్డులను కైవసం చేసుకుంది. రాజేంద్రనగర్, మహేశ్వరంలో పూర్తి డివిజన్లను వశం చేసుకున్న ఆపార్టీ శేరిలింగంపల్లిలోనూ చెప్పుకోదగ్గ స్థానాల్లో పాగా వేసింది. అప్పటివరకు నామమాత్రంగా ఉన్న బీజేపీలోకి వలసలు పెరిగిపోవడంతో ప్రత్యర్థులకు సవాల్ విసిరే స్థాయికి చేరుకుంది.

చేరికలతో ఊపు

బల్దియా ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడంతో ఇతర పార్టీల నుంచి కాషాయతీర్థం పుచ్చుకునే నేతల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. కాంగ్రెస్ నేతలు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, నేతలు రవి కుమార్ యాదవ్, మురళీకృష్ణ బీజేపీలో చేరారు. వీరితోపాటు చోటామోటా నాయకులు కాషాయ కండువా కప్పుకోవడంతో బలీయశక్తిగా ఎదిగింది. ఈ క్రమంలోనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానాన్ని గెలుచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. మిషన్ –2024 పేరిట ఇప్పటివరకు ఖాతా తెరవని సెగ్మెంట్లలో జెండా ఎగరేయాలని టార్గెట్ పెట్టుకున్న అధిష్టానం.. ఆ జాబితాలోని చేవెళ్లపై కన్నేసింది.

అమిత్ షా రాకతో..

అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీ 'పార్లమెంటరీ ప్రవాసీ యోజన' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల 23న (ఆదివారం) చేవెళ్లలో జరిగే భారీ బహిరంగసభకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరవుతున్నారు. ఈ విజయ్‌సంకల్ప్ సభ ద్వారా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న ఆయన చేవెళ్ల లోక్‌సభ స్థానంలో పార్టీ పనితీరును కూడా సమీక్షించనున్నారు. అంతగా పట్టులేని గ్రామీణ ప్రాంతంలో హోంమంత్రి సభ నిర్వహించడం ద్వారా గ్రామీణ ఓటర్ల మద్దతు కూడగట్టుకోవాలనే అంచనాతో బీజేపీ ఉంది. వికారాబాద్, చేవెళ్ల, తాండూరు, పరిగి నుంచి భారీగా జనసమీకరణ చేయడం పార్టీకి టానిక్‌లా పనిచేస్తుందని భావిస్తోంది.



సచిన్ టెండూల్కర్ 'ఫిఫ్టీ'

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నేడు 50వ పడిలోకి అడుగుపెట్టాడు. పదేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న సచిన్ ప్రస్తుతం ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్లేయర్ హోదాలో ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సచిన్ ఆటకు వీడ్కోలు పలికాక అదే జట్టుతో కొనసాగుతున్నాడు. 1989లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సచిన్ ఎన్నో రికార్డులు సృష్టించాడు. 200 టెస్టులు ఆడిన ఈ ముంబైకర్ 51 సెంచరీలు, 68 అర్ధ సెంచరీలతో 15,921 పరుగులు చేశాడు. 463 వన్డేలు ఆడిన సచిన్ 49 సెంచరీలు, 96 అర్ధ సెంచరీలతో 18,426 పరుగులు సాధించాడు. కెరీర్‌లో ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడిన సచిన్ పది పరుగులు చేసి అవుటయ్యాడు. టెస్టుల్లో 46 వికెట్లు, వన్డేల్లో 154 వికెట్లు, టి20ల్లో ఒక వికెట్ పడగొట్టిన సచిన్ కెరీర్ మొత్తంలో 20 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెల్చుకున్నాడు. వన్డేల్లో ఒకే ఏడాది అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ రికార్డు కూడా సచిన్ పేరిటే ఉంది. 1998లో 34 వన్డేలు ఆడి 9 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలతో కలిపి 1894 పరుగులు చేశాడు.

ధీరజ్ గురి అదిరె...

- రజత, కాంస్య పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్
- ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ



అంటాల్యా (తుర్కియే): అంచనాలకు మించి రాణించిన ఆంధ్రప్రదేశ్ యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో రెండు పతకాలతో మెరిశాడు. తొలిసారి ప్రపంచ కప్ టోర్నీలో ఆడుతున్న 21 ఏళ్ల ధీరజ్ పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి రజత పతకం ... వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పురుషుల టీమ్ ఫైనల్లో ధీరజ్, అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్ బృందం 4-5తో లీ జాంగ్‌యువాన్, కి జింగ్‌షువో, వె షావోజువాన్‌లతో కూడిన చైనా జట్టు చేతిలో ఓడింది. వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్ 7-3తో ఇల్ఫాత్ అబ్దులిన్ (కజకిస్తాన్)పై గెలిచాడు. సెమీస్‌లో ధీరజ్ 4-6తో డాన్ ఒలారు (మాల్డోవా) చేతిలో ఓడిపోయాడు.

మళ్లీ రెజ్లర్ల ధర్నా

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ మళ్లీ ధర్నాకు దిగారు. మేరీ కోమ్ కమిటీ నివేదిక బహిర్గతం చేయాలని, లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని 'జంతర్ మంతర్' వద్ద చేపట్టిన ధర్నాలో డిమాండ్ చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గత జనవరిలో రెజ్లర్లు కొన్ని రోజులపాటు ధర్నాకు దిగారు. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వారితో చర్చలు జరిపి మేరీకోమ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీతో విచారణ జరిపింది. ఇటీవల కమిటీ నివేదిక క్రీడాశాఖకు సమర్పించినా దీన్ని బహిర్గతం చేయకపోవడం, చర్యలు తీసుకోకపోవడంతో రెజ్లర్లు మళ్లీ రోడ్డెక్కారు.

భళా బెంగళూరు

వీకెండ్ మ్యాచ్‌లు 'ఎండ్'దాకా వచ్చి అమాంతం ఉత్కంఠ రేపుతున్నాయి. బెంగళూరు, రాజస్తాన్‌లు కూడా ఆఖరిదాకా పోరాడాయి. కానీ హర్షల్ పటేల్ తొలి మూడు బంతులు రాయల్ చాలెంజర్స్ శిబిరాన్ని డీలా పరిస్తే... తర్వాతి మూడు బంతులు విజయానికి ఊపిరి పోశాయి.

- రాజస్తాన్‌పై 7 పరుగులతో గెలుపు
- ఉత్కంఠభరిత పోరులో ఆర్‌సీబీదే విక్టరీ
- డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ మెరుపులు
- హర్షల్ పటేల్‌కు మూడు వికెట్లు

బెంగళూరు: ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి జట్టు గర్జిస్తోంది. బ్యాటింగ్‌లో మెరుపులకు బౌలింగ్‌లో నిప్పులు చెరిగే బంతులు జతవడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 7 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేసింది. గత మ్యాచ్ ఫార్ములాతోనే రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ (39 బంతుల్లో 62; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'ఇంపాక్ట్' చూపాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 77; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) తన శైలి ధాటి కొనసాగించాడు. బౌల్ట్, సందీప్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత గెలుపు తీరందాకా వచ్చిన రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులే చేసి ఓడింది. డుప్లెసిస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన బౌలర్ హర్షల్ పటేల్ (3/32) బెంగళూరు జట్టుకు ఉపయోగపడ్డాడు.

ఇద్దరి తీరు దంచికొట్టుడే!



మ్యాక్స్‌వెల్



డుప్లెసిస్

ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌ను నడిపించింది... మెరిపించింది... మురిపించింది ఇద్దరే! ఓపెనర్ డుప్లెసిస్, మిడిలార్డర్‌లో మ్యాక్స్‌వెల్ కలిసి మెలిసి దంచేశారు. జట్టు ఖాతా తెరవకముందే కెప్టెన్‌గా కోహ్లి (0) డకౌటైతే... డుప్లెసిస్ 'ఇంపాక్ట్'కు మ్యాక్సీ డబుల్ డోసు ఇచ్చాడు. వన్‌డౌన్‌లో దిగిన షహబాజ్ (2) కూడా నిరాశపరిచిన బెంగళూరు ఇన్నింగ్స్ 12 పరుగులకే 2 వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత 11 ఓవర్ల పైచిలుకు వరకు కూడా వారిద్దరి ప్రతాపమే స్కోరును హోరెత్తించింది. మ్యాక్సీ 27 బంతుల్లో ఫిఫ్టీ కొడితే, డుప్లెసిస్ 31 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 127 పరుగులు జతచేశారు. ఆ తర్వాత వచ్చినవారెవరూ పెద్దగా ఆడలేదు. కాసేపైన నిలువలేదు.

పడిక్కల్ రాణించినా... అశ్విన్ వణికించినా...



హర్షల్

భారీలక్ష్యం ముందుంటే 'హిట్టర్' బట్లర్ (0) సిరాజ్ బౌలింగ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. యశస్వి, ఇంపాక్ట్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్ లక్ష్యానికి తగ్గ జోరుతో స్కోరును పెంచారు. పడిక్కల్ 30 బంతుల్లో అర్ధ సెంచరీ చేసుకున్నాక... జట్టు స్కోరు వందకు ముందు అతను, వంద పరుగుల తర్వాత యశస్వి అవుటయ్యారు. అయితే సంజూ సామ్సన్ (15 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ జురెల్ (16 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆడిన ఆటతో పోటీ ఆఖరిదాకా వచ్చింది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా.. అశ్విన్ (12) తొలి మూడు బంతుల్లో 4, 2, 4తో 10 పరుగులతో వణికించాడు. అయితే తర్వాతి మూడు బంతుల్లో హర్షల్... అశ్విన్ వికెట్, 1, 1తో ముగించడంతో ఆర్‌సీబీ ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) బౌల్ట్ 0; డుప్లెసిస్ (రనౌట్) 62; షహబాజ్ (సి) యశస్వి (బి) బౌల్ట్ 2; మ్యాక్స్‌వెల్ (సి) హోల్డర్ (బి) అశ్విన్ 77; మహిపాల్ (సి) పడిక్కల్ (బి) చహల్ 8; దినేశ్ కార్తీక్ (సి) బట్లర్ (బి) సందీప్ శర్మ 16; సుయశ్ ప్రభుదేశాయ్ (రనౌట్) 0; హసరంగ (రనౌట్) 6; విల్లీ (నాటౌట్) 4; వైశాక్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ శర్మ 0; సిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 189. వికెట్ల పతనం:** 1-0, 2-12, 3-139, 4-156, 5-163, 6-163, 7-180, 8-184, 9-184. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-41-2, సందీప్ శర్మ 4-0-49-2, అశ్విన్ 4-0-36-1, చహల్ 4-0-28-1, హోల్డర్ 4-0-32-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) కోహ్లి (బి) హర్షల్ పటేల్ 47; జోస్ బట్లర్ (బి) సిరాజ్ 0; దేవ్‌దత్ పడిక్కల్ (సి) కోహ్లి (బి) విల్లీ 52; సంజూ సామ్సన్ (సి) షహబాజ్ (బి) హర్షల్ పటేల్ 22; హెట్‌మైర్ (రనౌట్) 3; ధ్రువ్ జురెల్ (నాటౌట్) 34; అశ్విన్ (సి) ప్రభుదేశాయ్ (బి) హర్షల్ పటేల్ 12; అబ్దుల్ బాసిత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-1, 2-99, 3-108, 4-125, 5-155, 6-180. **బౌలింగ్:** సిరాజ్ 4-0-39-1, విల్లీ 4-0-26-1, వైశాక్ 2-0-24-0, మ్యాక్స్‌వెల్ 2-0-25-0, హర్షల్ పటేల్ 4-0-32-3, హసరంగ 4-0-32-0.

రఫ్ఫాడించిన రహానే...

- 29 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71 నాటౌట్
- కాన్వే, శివమ్ దూబే అర్ధ సెంచరీలు
- కోల్‌కతాపై చెన్నై ఘనవిజయం



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రహానే

కోల్‌కతా: సాధారణంగా టీవీ బ్రాడ్‌కాస్టర్లు ఒక ఇన్నింగ్స్ ముగిశాక, లేదంటే మ్యాచ్ పూర్తయ్యాక మొత్తమ్మీద ఐదారు నిమిషాలు హైలైట్స్ చూపిస్తారు. కానీ ఈ మ్యాచ్‌లో అజింక్య రహానే తను ఆడుతున్నంతసేపూ హైలైట్స్ చూపాడు. వన్నె తగ్గిన ఈ వెటరన్ తనలో దంచేసే సత్తా ఇంకా తగ్గలేదని సుడిగాలి ఇన్నింగ్స్ (29 బంతుల్లో 71 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో నిరూపించాడు. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్ 49 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. ముందుగా సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 235 పరుగుల భారీస్కోరు చేసింది. శివమ్ దూబే (21 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కాన్వే (40 బంతుల్లో 56; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులే చేయగలిగింది. జట్టు స్కోరు 1 పరుగుకే ఓపెనర్లు నరైన్ (0), జగదీశన్ (1)లు... కాసేపటికి వెంకటేశ్ (20), నితీశ్ రాణా (27) అవుటవడంతో నైట్‌రైడర్స్ లక్ష్యానికి దూరమైంది. జేసన్ రాయ్ (26 బంతుల్లో 61; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), రింకూ సింగ్ (33 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) భారీ షాట్లతో అలరించారు. చెన్నై బౌలర్లలో తుషార్, తీక్షణలకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (బి) సుయశ్ శర్మ 35; కాన్వే (సి) వీస్ (బి) వరుణ్ చక్రవర్తి 56; రహానే (నాటౌట్) 71; శివమ్ దూబే (సి) జేసన్ రాయ్ (బి) ఖెజ్రోలియా 50; జడేజా (సి) రింకూ సింగ్ (బి) ఖెజ్రోలియా 18; ధోని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235. వికెట్ల పతనం:** 1-73, 2-109, 3-194, 4-232. **బౌలింగ్:** ఉమేశ్ 3-0-35-0, వీస్ 3-0-38-0, వరుణ్ 4-0-49-1, కుల్వంత్ ఖెజ్రోలియా 3-0-44-2, నరైన్ 2-0-23-0, సుయశ్ శర్మ 4-0-29-1, రసెల్ 1-0-17-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జగదీశన్ (సి) జడేజా (బి) తుషార్ 1; నరైన్ (బి) ఆకాశ్ సింగ్ 0; వెంకటేశ్ అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మొయిన్ అలీ 20; నితీశ్ రాణా (సి) రుతురాజ్ (బి) జడేజా 27; జేసన్ రాయ్ (బి) తీక్షణ 61; రింకూ సింగ్ (నాటౌట్) 53; రసెల్ (సి) శివమ్ దూబే (బి) పతిరణ 9; వీస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషార్ 1; ఉమేశ్ (సి) కాన్వే (బి) తీక్షణ 4; వరుణ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-46, 4-70, 5-135, 6-162, 7-171, 8-180. **బౌలింగ్:** ఆకాశ్ 4-0-29-1, తుషార్ 4-0-43-2, తీక్షణ 4-0-32-2, మొయిన్ అలీ 1-0-20-1, జడేజా 3-0-34-1, పతిరణ 4-0-27-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
గుజరాత్	6	4	2	8	0.212
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉజ్వల కెరీర్‌కు కళాత్మక కోర్సులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్‌ఆర్‌ఏఎఫ్‌యూ).. వివిధ ఫైన్ ఆర్ట్స్, డిజైన్ కోర్సులను అందిస్తోంది. వీటిల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఏపీ ఉన్నత విద్యామండలి.. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏడీసెట్)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

- **అందించే కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ) ఇన్ పెయింటింగ్/స్కల్ప్చర్/యానిమేషన్/అప్లయిడ్ ఆర్ట్స్/ఫోటోగ్రఫీ.
- **అర్హత:** 10+2 లేదా ఇంటర్మీడియేట్(ఎంపీసీ/ఎంఈసీ/బైపీసీ/ఎంబైపీసీ/సీఈసీ/హెచ్ఈసీ) లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- **రాత పరీక్ష ఇలా:** ఏడీసెట్‌లో పొందిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఒకే ఉమ్మడి ప్రశ్నపత్రం ఉంటుంది. ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్షను నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.
- **సిలబస్:** జనరల్ నాలెడ్జ్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, అప్లయిడ్ ఆర్ట్స్‌లో టెక్నికల్ డీటైల్స్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫోటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, డిజైన్ స్కిల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **కెరీర్:** ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలను సొంతం చేసుకోవచ్చు. ఆర్ట్ గ్యాలరీల్లో వీరు తమ ప్రతిభను చాటవచ్చు. ఫ్రీలాన్సింగ్, స్వయం ఉపాధి(వర్క్‌షాపు నడపడం) ద్వారా ఎక్కువ మొత్తంలో సంపాదించుకునే అవకాశముంది. ఎండోమెంట్, ఆర్కియలాజికల్ విభాగాల్లోనూ అవకాశాలు దక్కించుకోవచ్చు.

ముఖ్యసమాచారం — **ఏడీసెట్-2023**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 20.05.2023
- **ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ:** 28.05.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్:** 31.05.2023
- **వెబ్‌సైట్ :** https://cets.apsche.ap.gov.in/ADCET

విద్య, ఉద్యోగ సమాచారం

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్ష-2023

యూనియన్ పబ్లిక సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో పోస్టుల భర్తీకి సంబంధించి కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1261

పోస్టుల వివరాలు

» **కేటగిరీ-1:** మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్)-584.
» **కేటగిరీ-2:** అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే)-300, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్)-01, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్)-376.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.08.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 09.05.2023.
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ-2023 పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎకనామిక్స్ /స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్)/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ (ఐఎస్ఎస్ఈ)-2023 నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 51
» **పోస్టుల వివరాలు:** ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-18, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్-33.
» **అర్హత:** ఎకనామిక్ సర్వీసుకు పీజీ(ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్), స్టాటిస్టికల్ సర్వీసుకు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(100 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(200 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.
» **ఆన్‌లైన్‌దరఖాస్తులకు చివరితేది:** 09.05.2023.
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

కటాఫ్ అంచనా.. 88-100!

జేఈఈ మెయిన్-2023.. నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని.. ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఐఐటీల్లో అడుగు పెట్టేందుకు కూడా జేఈఈ-మెయిన్‌లో అర్హత సాధించడం తప్పనిసరి! 2023 సంవత్సరానికి సంబంధించి.. జేఈఈ-మెయిన్ రెండు సెషన్ల పరీక్షలు ముగిశాయి! ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్‌కు హాజరైన విద్యార్థుల తదుపరి కర్తవ్యం ఏంటి? ఈ ఏడాది కటాఫ్ అంచనా, ఉమ్మడి కౌన్సెలింగ్ తదితర వివరాలు..

» జేఈఈ-మెయిన్-2023.. ముగిసిన రెండు సెషన్లు
» దాదాపు 10 లక్షల మంది హాజరైనట్లు అంచనా
» జేఈఈ-మెయిన్ 2023 కటాఫ్ అంచనా 88-100
» మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలు
» ఐఐటీల్లో అడుగు పెట్టాలనుకుంటే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత తప్పనిసరి



జేఈఈ-మెయిన్-2023

ఈ ఏడాది రెండు దశలుగా నిర్వహించిన జేఈఈ-మెయిన్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య దాదాపు పది లక్షలుగా ఉంటుందని అంచనా. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన తొలి సెషన్‌కు 8,23,967 మంది హాజరయ్యారు. తాజాగా ఏప్రిల్ 6 నుంచి 13 వరకు నిర్వహించిన పరీక్షలకు కూడా దాదాపు ఇదే సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు అంచనా. వీరిలో తొలి సెషన్‌కు కూడా హాజరైన వారి సంఖ్య 30 నుంచి 40 శాతం మేరకు ఉంటుందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే దాదాపు పది లక్షల మందికిపైగా జేఈఈ-మెయిన్ పరీక్షలు రాసినట్లు పేర్కొంటున్నారు.

జనరల్ కటాఫ్ ఎంత?

రెండు సెషన్లుగా, పలు స్లాట్లలో నిర్వహించిన జేఈఈ-మెయిన్-2023కు కటాఫ్ జనరల్ కేటగిరీలో 88-100, ఓబీసీ(ఎన్‌సీఎల్) కేటగిరీలో 74-90, ఎస్సీ కేటగిరీలో 54-80; ఎస్టీ కేటగిరీలో 45-90 మధ్యలో ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ కటాఫ్ శ్రేణుల మధ్యలో నిలుస్తామని భావించే విద్యార్థులు తదుపరి దశలకు సన్నద్ధమవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ దిశగా

జేఈఈ-మెయిన్ ర్యాంకుతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) క్యాంపస్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా 2.5 లక్షల మందికి ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. దీంతో.. జేఈఈ-మెయిన్‌లో కటాఫ్ అంచనాల కంటే ఎక్కువ స్కోర్ సాధిస్తామనే ధీమా ఉన్న విద్యార్థులు.. అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌ను ముమ్మరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఐఐటీలు.. కొందరికే అవకాశం

ఐఐటీలో అడుగు పెట్టే అవకాశం కొద్ది మందికే లభిస్తుంది. ఎందుకంటే.. దేశంలోని 23 ఐఐటీల్లో మొత్తంగా అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 16,598 మాత్రమే. అంటే.. జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మందికి అర్హత కల్పించినా.. ప్రవేశం లభించేది కేవలం 16,598 మందికే! దీంతో మిగతా విద్యార్థులకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐలే ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి.

మొత్తం సీట్లు 37,879

- జాతీయ స్థాయిలో 32 ఎన్‌ఐటీ క్యాంపస్‌లలో 23,994 సీట్లు; 26 ట్రిపుల్ ఐటీల్లో 7,126 సీట్లు, సెంట్రల్ యూనివర్సిటీలు సహా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 6,759 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొత్తంగా జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా 37, 879 సీట్లు కేటాయిస్తారు.

ఉమ్మడి కౌన్సెలింగ్ జోసా

- ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కోసం జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- జేఈఈ-మెయిన్ ర్యాంకర్లకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్ఐటీలనే ప్రాథమ్యాలుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు మాత్రం ఐఐటీలతో సహా అన్ని ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యాలుగా ఎంచుకోవచ్చు.
- విద్యార్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది.
- సీట్ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి.. సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలి. నిర్దేశిత తేదీ లోపు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆరు రౌండ్లలో జోసా

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరగనుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం-జోసా 2023 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19న ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.

సీఎస్ఏబీ కౌన్సెలింగ్

జోసా అన్ని దశలు పూర్తయిన తర్వాత కూడా ఎన్‌ఐటీల్లో సీట్లు మిగిలితే.. వాటి భర్తీ కోసం ప్రత్యేకంగా ఎన్‌ఐటీ ప్లస్ సిస్టమ్ పేరుతో సీఎస్ఏబీ(సెంట్రల్ సీట్ అలొకేషన్ బోర్డ్) ఆధ్వర్యంలో ఎన్‌ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సాధారణంగా ఇది రెండు దశల్లో ఉంటుంది. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిట్‌లు.. హోమ్ స్టేట్ కోటా

- నిట్‌ల్లో హోమ్ స్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం-నిట్ ఏర్పాటైన రాష్ట్ర విద్యార్థులకు హోమ్ స్టేట్ కోటా కింద 50 శాతం సీట్లు కేటాయిస్తారు. ఉదాహరణకు.. నిట్-వరంగల్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ఇందులో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇలా దేశంలోని మొత్తం 31 నిట్‌లలోనూ ఈ విధానంతో సంబంధిత రాష్ట్రాల విద్యార్థులు సీట్లు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రస్తుతం రెండు నిట్ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. అవి..ఎన్‌ఐటీ-వరంగల్ (తెలంగాణ), ఎన్‌ఐటీ-ఆంధ్రప్రదేశ్ (తాడేపల్లిగూడెం).
- నిట్ క్యాంపస్‌లలో హోమ్ స్టేట్ కోటా అమలవుతున్న నేపథ్యంలో 15 వేల లోపు ర్యాంకుతో విద్యార్థులు తమ సొంత రాష్ట్రంలోని నిట్ క్యాంపస్‌లో సీటు పొందే అవకాశం ఉంది. సీఎస్ఈ, ఈసీఈ వంటి క్రేజీ కోర్సుల విషయంలో ఆరు వేల లోపు ర్యాంకుతో సులభంగా సీటు పొందే వీలుంది. అదర్ స్టేట్ కోటాలో సీటు సొంతం చేసుకోవాలంటే.. పదివేల లోపు ర్యాంకుతోనే సాధ్యమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఫీజుల్లోనూ రాయితీ

- గత ఏడాది గణాంకాల ప్రకారం-ప్రతి సెమిస్టర్‌కు రూ.62,500 ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం-ఆయా వర్గాల వారికి ట్యూషన్ ఫీజు నుంచి నిర్దేశిత మొత్తాల్లో మినహాయింపు కూడా లభిస్తోంది.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్షలోపు ఉన్న విద్యార్థులకు, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వర్గాల కేటగిరీలో ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు కల్పిస్తున్నారు.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష నుంచి రూ.అయిదు లక్షల లోపు ఉన్న విద్యార్థులకు మొత్తం ట్యూషన్ ఫీజులో మూడింట రెండొంతుల ఫీజును మినహాయిస్తున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు మినహాయింపు లభిస్తోంది.
- ఈ మినహాయింపులు కోరుకునే అభ్యర్థులు సంబంధిత ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

జోసా ప్రక్రియకు సిద్ధంగా

జేఈఈ-మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో చేరాలనుకునే వారు..జోసా-2023 ప్రక్రియకు సన్నద్ధమవ్వాలి. ఇందుకోసం.. జోసా ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్‌కు అవసరమైన అన్ని ధ్రువ పత్రాలను సిద్ధం చేసుకోవాలి. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్స్; ఫొటో ఐడెంటిటీ కార్డ్; జేఈఈ-మెయిన్ అడ్మిట్ కార్డ్; జేఈఈ-మెయిన్ స్కోర్ కార్డ్; జనన ధ్రువీకరణ పత్రం (పదో తరగతి మార్క్స్ షీట్); ఇంటర్మీడియెట్ మార్క్స్ షీట్; మెడికల్ సర్టిఫికెట్; కుల ధ్రువీకరణ పత్రం; ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి.

అంబరాన్నంటిన రంజాన్ సంబురం





బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ మైదానంలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- మసీదుల వద్ద నమాజుల కళ
- జహీరానగర్‌లో సామూహిక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



బంజారాహిల్స్: రంజాన్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అన్ని మసీదుల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలకు అతిపెద్ద పండగ కావడంతో రంజాన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. మానవుల్లో ప్రేమాభిమానాలు, క్రమశిక్షణ, దాతృత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం వంటి ఉత్తమ గుణాలు ఈ రంజాన్ మాసంలో ఆచరించారు. నెల రోజులుగా ఆధ్యాత్మిక చింతనలో గడిపిన ముస్లింలు రంజాన్ రోజున దఫాలుగా ప్రార్థనలు నిర్వహించారు. అన్ని మసీదులు ముస్లింల ప్రార్థనలతో కళకళలాడాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ చౌరస్తాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముస్లింలతో కలిసి నమాజ్‌లో పాల్గొన్నారు. వాడవాడలా రంజాన్ సంబురాలు కనులపండువగా జరిగాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలో ఉన్న 79 మసీదుల్లో ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా మసీదుల వద్దకు వెళ్లి ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిల్లో ఉన్న ఈద్గాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రార్థనా స్థలాల వద్ద పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ ప్లేగ్రౌండ్‌లలో ఏర్పాటు చేసిన ప్రార్థనా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్, యూసుఫ్‌గూడలోని ఎల్ఎన్‌నగర్, శ్రీకృష్ణానగర్‌లలో కార్పొరేటర్ రాజ్‌కుమార్, బోరబండలో టీ హోప్ ఫౌండేషన్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎస్పీఆర్‌హిల్స్ ప్లేగ్రౌండ్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్...



ఎర్రమంజిల్‌లో కార్పొరేటర్ విజయారెడ్డి, మహ్మద్ ఫైజ్ పర్వేజ్...



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి



బంజారాహిల్స్ రోడ్ నెం. 10 మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్...



బోరబండలో టీ హోప్ ఫౌండేషన్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి...

క్లుప్తంగా...

వీధి దీపాలకు మరమ్మతులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో కొద్ది రోజులుగా వీధి దీపాలు పని చేయడం లేదు. ఈ విషయంపై కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు శనివారం కాలనీలోని పని చేయని విద్యుత్ దీపాలను తొలగించారు. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెంకటేశ్వరకాలనీ: పెరుగుతున్న ఎండలకు బాటసారులకు, రోగులకు, వారి సహాయకుల దాహార్తిని తీర్చేందుకు బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద రామ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. చలివేంద్రంలో వేసవి ముగిసే వరకు మజ్జిగ, అంబలి, మంచినీరు అందిస్తున్నట్లు నిర్వాహకులు తమ్మిశెట్టి రామ్ వెల్లడించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు గంటాడి కృష్ణ, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, సూర్య, బజరంగ్ సేన లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: రంజాన్ సందర్భంగా ఎర్రగడ్డ కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నేత మోసిన్ ఖురేషి టీ పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతపోరు'

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా.. బీసీ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేస్తామని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి అన్నారు. మిషన్ 2024 లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఢిల్లీ స్థాయిలో పోరాటాలు సాగిస్తామన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఓట్లు మావి అధికారం మాది అని బీజేపీ మాట ఇకపై చెల్లదని స్పష్టం చేశారు. 70 కోట్ల మంది బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం అనంతరం వారిని విస్మరించడం ఎంత వరకు సమంజసమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీసీలను సంఘటితం చేసి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం ఢిల్లీ కేంద్రంగా బీసీ ఉద్యమాలు, ప్రతిఘటన పోరాటాలు ఉంటాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామవేద హవనం



బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అద్వైత స్థాపనాచార్యులు చతురామ్నాయ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ జగద్గురువులు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని గత పుష్కరకాలంగా వేద సభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సామవేద హవనం (హోమం) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు గురువందనం, ఆ తర్వాత రుద్రక్రమార్చన, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఆలయ వేద పండితులు జ్యోతిశ్చంద్ర శర్మ అవధాని ఆధ్వర్యంలో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లావణ్య తెలిపారు. ఈ వేడుకలు తిలకించి పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయగా ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ విజయశంకర దేశిక ట్రస్ట్ వేద పాఠశాల సౌజన్యంతో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

బంజారాహిల్స్: గతేడాది నవంబర్‌లో జరిగిన ధరూర్ జాతరకు వెళ్తుండగా వికారాబాద్ జిల్లా అనంతగిరి వద్ద బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కంటోన్మెంట్ రసూల్‌పురాకు చెందిన స్వరూప(32) మృతి చెందారు. అదే రోజు ప్రమాద స్థలానికి చేరుకున చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శనివారం జూబ్లీహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, గజ్జెల నగేష్‌తో కలిసి మృతురాలి పిల్లల చదువుల సహాయార్థమై విడుదలైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. మృతురాలి భర్త జైపాల్ ఆమె కుటుంబ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

'మినర్వా' రోడ్డు నిర్మాణం వివాదాస్పదం



హిమాయత్‌నగర్: హోటల్ మినర్వా కేఫ్ లైన్‌లో చేపట్టిన రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా తయారైంది. నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టడంతో జలమండలికి చెందిన పైప్‌లైన్ పగిలింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ శనివారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతను రాజకీయ నాయకుల పేర్లు చెబుతున్నాడంటూ కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ ఆరోపించారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన ఈఈ పేర్రాజు ఆయా పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు అయ్యేలా చూస్తానన్నారు. మినర్వా హోటల్ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో హోటల్ డైరెక్టర్ కృష్ణమనోహర్‌రెడ్డి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

అభద్రతాభావంతో ప్రజాజీవనం



పంజగుట్ట: ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశప్రజలు అభద్రతాభావంతో మనుగడ సాగిస్తున్నారని.. ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ, సీఐడీ దాడులు చేయిస్తున్నారని నవభారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్.కళ్యాణ రామకృష్ణ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జై యలమంచలికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా అధ్యక్షురాలు పావనితో కలిసి వారు మాట్లాడుతూ... 'భద్రతే మా లక్ష్యం మానవతే మా నినాదం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్ల కోసం మాట్లాడతాయని కానీ అమలు చేయవన్నారు. అయితే తమ పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు తీసుకొచ్చామన్నారు. మహిళల భద్రత కోసం నిర్భయ ఘటన తర్వాత అప్పటి పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించి అన్ని పోలీస్ స్టేషన్‌లలో తమ పార్టీ లెటర్ ప్యాడ్‌పై తమ లీగల్ సెల్ ఫోన్ నెంబర్ పొందుపర్చి ఎవరైనా నిస్సహాయ మహిళలకు ఉచితంగా న్యాయపరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇది పెట్టిన మూడు నెలల్లో సుమారు 200 కేసులు తమ దృష్టికి రాగా అన్ని పరిష్కరించినట్లు తెలిపారు. 25 సంవత్సరాలు అమెరికాలో ఉద్యోగం చేసి భారతదేశ ప్రజలకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో వచ్చిన జై యలమంచలి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నిషేధిత యాప్‌లో క్రికెట్ బెట్టింగులు

యువకుడి అరెస్ట్: రూ 38 వేల స్వాధీనం



నిందితుడు రాము

బంజారాహిల్స్: నిషేధిత గోల్డ్ 365 యాప్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీలో నివసించే రాపనోలూరు రాము(26) గచ్చిబౌలిలోని ది స్పైస్ కిచెన్‌కు మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీన రాత్రి ఫిలింనగర్‌లోని కేఫ్ మిలాంజ్‌లో కూర్చొని డిన్నర్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయన ఫోన్‌ను పరిశీలించి గోల్డ్ 365 యాప్‌లో బెట్టింగ్ కాస్తున్నావంటూ అరెస్ట్ చేసి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి రామును అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించగా శనివారం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా అదే రోజు మరికొంత మంది యాప్‌లను కూడా పోలీసులు పరిశీలించినట్లు తెలిసింది. వారం రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. వీరందరూ నిషేధిత గోల్డ్ 365 యాప్‌ను వినియోగిస్తున్నారని దీని ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారంటూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరోపిస్తున్నారు. తాజాగా అరెస్ట్ చేసిన నిందితుడు రాము నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ. 38 వేలు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్: ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడం... అప్పుల బాధ అధికం కావడంతో వాటిని భరించలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ చెక్ పోస్టు సమీపంలోని యాదగిరినగర్‌లో సాహిత్యకుమార్(30) కొంత కాలంగా ఓ యువతితో సహజీవనం చేస్తూ మోతీనగర్‌లో కేవీబీ బ్యాంకులో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. గత మంగళవారం సహజీవనం చేస్తున్న యువతి స్వగ్రామం భీమవరం వెళ్లింది. మూడు రోజులుగా డ్యూటీకి రాకపోవడంతో బ్యాంకు అధికారులు సాహిత్యకుమార్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన సహజీవనం చేస్తున్న యువతికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆమె శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరవలేదు. కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు రోజుల క్రితమే సాహిత్య కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పబ్‌లో గొడవ: భాగస్వామిపై బౌన్సర్ దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఓ పబ్‌లో జరిగిన గొడవలో బౌన్సర్ పబ్ పార్ట్‌నర్‌పై దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... మాదాపూర్ పర్వత్‌నగర్‌లోని సరోజినీనాయుడు నగర్‌లో నివసించే నెల్లుట్ల హరీష్(27) స్థానికంగా ఉన్న ఓ పబ్‌లో భాగస్వామిగా ఉన్నారు. కొంత కాలంగా హరీష్‌కు మరో పార్ట్‌నర్ కన్నయ్య మధ్య వ్యాపార లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 20వ తేదీన రాత్రి 10.50 గంటల ప్రాంతంలో హరీష్ బాత్‌రూమ్‌కు వెళ్తుండగా అక్కడున్న బౌన్సర్ సతీష్ ఆయనను అడ్డుకొని అసభ్య పదజాలంతో దూషించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదంలో బౌన్సర్ సతీష్ కోపంతో ఊగిపోతూ హరీష్‌పై దాడి చేశాడు. బాధితుడిముక్కు, దవడ దెబ్బతినగా కడుపులో పిడిగుద్దులతో కుప్పకూలిపోయాడు. చంపేస్తానంటూ బెదిరించాడు. బిజినెస్ పార్ట్‌నర్ కన్నయ్య ప్రోద్బలంతోనే బౌన్సర్ సతీష్ ఈ దాడికి పాల్పడ్డాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సతీష్ కొంత డబ్బును కన్నయ్యదగ్గర పెట్టుబడిగా పెట్టాడని ఈ కారణంతోనే తనను అడ్డు తొలగించుకునేందుకు గొడవపడి తీవ్రంగా కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బౌన్సర్ సతీష్‌పై పోలీసులు ఐపీసీ సెక్షన్ 323, 506, 341ల కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

ప్రేమ పేరుతో బాలిక కిడ్నాప్!

- కిడ్నాపర్‌ను అరెస్టు చేసిన బిహార్ పోలీసులు
- నేడు ఆ రాష్ట్రానికి నిందితుడి తరలింపు



నిందితుడు రోషన్ కుమార్

బంజారాహిల్స్: ప్రేమ పేరుతో ఓ బాలికను హైదరాబాద్‌కు తీసుకొచ్చి రెండు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా మకాం వేసిన కిడ్నాపర్‌ను ఫోన్ డాటా ఆధారంగా బిహార్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. వివరాలివీ... బిహార్ రాష్ట్రం భగల్‌పూర్ జిల్లా షిద్రాయపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పవన్‌గామా గ్రామానికి చెందిన రోషన్‌కుమార్(20) గత ఫిబ్రవరిలో అదే ప్రాంతంలో నివసిస్తున్న బాలిక(17)ను ప్రేమ పేరుతో బలవంతంగా రాష్ట్రం దాటి హైదరాబాద్‌కు తీసొకొచ్చి ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీలో ఓ గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ బిహార్ పోలీసులకు చిక్కకుండా మకాం పెట్టాడు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు షిద్రాయపూర్ పోలీసులు రోషన్‌కుమార్‌పై ఐపీసీ సెక్షన్ 363 (కిడ్నాప్), 366(ఏ) కిడ్నాప్ ఫర్ మ్యారేజ్, రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. అక్కడ పోలీసులకు చిక్కకుండా నిందితుడు జాగ్రత్తలు తీసుకున్నా ఎట్టకేలకు ఫోన్ కాల్‌డేటా ఆధారంగా రెండు రోజుల క్రితమే నగరానికి చేరుకున్న బిహార్ పోలీసులు సెల్‌టవర్‌డంప్ తీసుకొని ఫిలింనగర్ బస్తీలను జల్లెడపట్టారు. శనివారం తెల్లవారుజామున దీన్‌దయాల్‌నగర్‌లోని ఓ గదిలో ఇద్దరినీ గుర్తించి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. షిద్రాయపూర్ పోలీసులు రోషన్‌కుమార్‌తో పాటు బాధిత బాలికను చట్టప్రకారం న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం బాధిత బాలికను తండ్రికి అప్పగించారు. నిందితుడిని ఆదివారం బిహార్‌కు తీసుకెళ్లనున్నట్లు ఏఎస్ఐ బబ్లూ కుమార్ తెలిపారు.

ఘనంగా పౌరసేవల దినోత్సవం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సివిల్ సర్వీసెస్ డేను ఘనంగా నిర్వహించారు. 86 మంది ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ (ఐఎస్ఎస్), 26 మంది ఇండియన్ ఎకనామిక్ సర్వీసెస్ అఫీసర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. జేఎన్‌టీయూ సోషల్ సైన్సెస్ మాజీ డీన్ ప్రొఫెసర్ అమితాబాద్ కుందూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి 'ఎమర్జింగ్ ఇండియా -2047' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సబ్ కా సాత్ సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్, అనే మంత్రాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకుని 21వ శతాబ్దంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తే దేశ భవిష్యత్తు వెలుగులీనుతుందన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ఆర్‌డీ డీజీ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.



ఎంసీహెచ్‌ఆర్‌డీలో పౌరసేవల దినోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ అమితాబ్ కుందూ తదితరులు

జనం సొమ్మే కదా.. జానేదేవ్!

ఏటీఎంలు 'నింపడం'లో అంతులేని నిర్లక్ష్యం

- నగదు నిర్వహణలోనూ ఎన్నో లోపాలు
- ప్రైవేట్ వ్యక్తుల చేతిలో రూ.కోట్ల నగదు
- అనువుగా మార్చుకుంటున్న కస్టోడియన్లు
- పదేపదే సిటీలో ఉదంతాలు, కేసులు నమోదు
- ఇటీవల రూ.92 లక్షలు కాజేసిన 'సీఎంఎస్ కస్టోడియన్లు'



సాక్షి, సిటీబ్యూరో: ఏటీఎం కేంద్రాల్లోని మిషన్లలో నింపే డబ్బు బ్యాంకులది..అంటే ప్రజల సొమ్ము. అయితే దీని నిర్వహణలో మాత్రం అటు బ్యాంకులు, ఇటు కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ఫలితంగా లోపభూయిష్టంగా మారిన ఏటీఎంలు అక్రమార్కులకు, నేరగాళ్లకు కల్పతరువులుగా మారుతున్నాయి. నగరంలో వెలుగులోకి వచ్చిన కుంభకోణాలే దీనికి నిదర్శనం. కస్టోడియన్లు రూ.రూ.16.85 కోట్లు కాజేసిన కేసులు గడిచిన కొన్నేళ్లల్లో సిటీలో నమోదయ్యాయి. తాజాగా సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్న ఇద్దరు కస్టోడియన్లు రూ.92.87 లక్షలు కాజేయడంపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నగదు భర్తీ బాధ్యతలు 'ప్రైవేట్' చేతిలో...

ప్రతి బ్యాంకు తమ ఏటీఎంలలో నగదును నింపే బాధ్యతల్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయి. అవి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. వీరిలో కస్టోడియన్లు నగదు భద్రపరిచే కేంద్రాల నుంచి రూ.కోట్లు తమ సంస్థల వాహనాల్లో తరలించే టీమ్ సభ్యులకు నేతృత్వం వహిస్తారు. ఏటీఎం మిషన్ తెరిచే పాస్‌వర్డ్ కూడా వీరివద్దే ఉంటాయి. ఏ ఏటీఎం కేంద్రంలో ఎప్పుడు, ఎంత నిపారన్నది ఈ కాంట్రాక్టులు నిర్వహిస్తున్న సంస్థల్లో కస్టోడియన్లు, పని చేసే ఉద్యోగులు రికార్డుల్లో రాసిందే బ్యాంకులకు ఆధారం. ఈ తరహా ఉద్యోగుల కార్యకలాపాలపై ఏమాత్రం నిఘా సైతం ఉండట్లేదు. ఓ బృందం ఎంత మొత్తం తీసుకుని బయలుదేరుతోంది, తిరిగి ఎంత మొత్తం తీసుకువస్తోంది అనే అంశాలు సాంకేతికంగా గుర్తించలేరు. ఏటీఎం మిషన్‌లో ఎంత డబ్బు పెట్టారనే దానికీ వీరు రాసే లెక్కలే ఆధారం.

వాళ్లు తెరిచినా వీళ్లు గుర్తించలేరు...

ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపిన కస్టోడియన్లు మళ్లీ వెళ్లి ఏటీఎంలను ఓపెన్ చేసినా గుర్తించే పరిజ్ఞానం నగదు నింపే సంస్థల వద్ద ఉండట్లేదు. ఈ కారణంగానే ఏటీఎంల్లో అవసరమైనంతా డిపాజిట్ చేశామంటూ చెప్తున్న కస్టోడియన్లు ఏళ్ల పాటు గోల్‌మాల్‌కు పాల్పడుతూ రూ.లక్షలు, రూ.కోట్లు కాజేస్తున్నా గుర్తించలేకపోతున్నాయి. అప్పుడప్పుడు జరిగే ఆడిటింగ్‌లో అసలు విషయం బయటకు వచ్చినా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అంతర్గత విచారణతో జాప్యం చేయడంతో నిందితులు ఎస్కేప్ అవుతున్నారు. అతికష్టమ్మీద వాళ్లు దొరికినా రికవరీలు తగ్గిపోతున్నాయి. గడిచిన కొన్ని ఏళ్ల కాలంలో నమోదైన కేసుల్ని దర్యాప్తు చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అనేక సంస్థాగతమైన లోపాలను గుర్తించారు. దీనిపై నివేదికలు ఇచ్చినా, నిరోధానికి చర్యలు సూచించినా ఆయా సంస్థలు, బ్యాంకులు పట్టించుకోవట్లేదు.

నగరంలో వెలుగులోకి వచ్చిన స్కాములు...

ఏటీఎం కేంద్రాల్లో నింపాల్సిన నదును కాజేసిన కస్టోడియన్ల ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఈ తరహా ఫ్రాడ్స్ తెలుగు రాష్ట్రాల్లో తరచుగా వెలుగుచూస్తున్నాయి. ఒక్క నగరంలోనే రూ.16.85 కోట్ల కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. ఇలా ప్రజాధనం దుండగుల పాలవుతున్నా ఆయా బ్యాంకులు మాత్రం పట్టించుకోవట్లేదు.

సీసీఎస్ పోలీసులు కేసులు నమోదు చేసిన స్కాముల్లో కొన్ని ఇలా..

- సీఎంఎస్‌లో రూ.2.6 కోట్లు
- ఆర్బీఐ సంస్థలో రూ.9.98 కోట్లు
- ట్రాన్స్ ట్రెజర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.1.88 కోట్లు
- బీటీఐ పేమెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.1.23 కోట్లు
- రైటర్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో రూ.23.32 లక్షలు
- సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్‌లో రూ.92.87 లక్షలు

'సాహితీ' మోసాలపై సీబీఐ విచారణ జరపాలి

బాధితుల సంఘం డిమాండ్

పంజగుట్ట: సాహితీ ఇన్‌ఫ్రాటెక్ మోసంపై వెంటనే సీబీఐచే విచారణ జరిపించాలని 'సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా బాధితుల సంఘం' ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది సుంకరి నరేష్, బాధితులు రాఘవేంద్ర, కవిత, శివాజీ, కేదర్‌నాథ్‌లు మాట్లాడుతూ అమీన్‌పూర్‌లో సాహితీ సర్వాని ఎలైట్ పేరుతో మొత్తం 23 ఎకరాల్లో 32 అంతస్తుల టవర్లు నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసి, ప్రీలాంచ్‌గా బుకింగ్ పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.35 లక్షల నుండి రూ.65 లక్షల వరకు వసూలు చేశారని, ఆ తర్వాత చేతులెత్తేశారని ఆరోపించారు. 2019లో కట్టిన వారికి 2022లో పని పూర్తి చేసిస్తామని ఎమ్‌ఓయూ చేశారని, చేయని పక్షంలో 15 శాతం వడ్డీతో తిరిగి ఇస్తామని పొందుపర్చారన్నారు. కాని 2022లో చూసినా ఎలాంటి పనులు ప్రారంభంకాలేదని చెప్పారు. వారు తిరిగి ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయన్నారు. 2022 ఆగస్టులో తాము సీసీఎస్‌లో కేసు వేశామని, కేవలం లక్ష్మీనారాయణను ఒక్కడినే అరెస్టు చేశారని అతను కూడా బెయిల్‌పై బయటకు వచ్చాడని తెలిపారు. తాము సుమారు 2 వేల మంది బాధితులం ఉండగా, రూ.1500 కోట్ల భారీ స్కాం జరిగితే ఇప్పటివకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఈ మోసంపై సీబీఐచే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇందిరా పార్కు వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ

హిమాయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ గౌడ విద్యార్థులకు సూచించారు. హిమాయత్‌నగర్‌లోని గౌడ హాస్టల్లో అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించిన హాస్టల్ డే కార్యక్రమానికి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ..తొలిరోజుల్లో మొక్కగా నాటిన ఈ గౌడ హాస్టల్ నేడు మహావృక్షంగా ఎదిగి ఎందరో విద్యార్థులకు విద్యను అందిస్తుందన్నారు. అంతిమ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరంభాన్ని ప్రారంభిస్తే ప్రతి ఒక్కరూ విజయ తీరాలకు చేరుతారన్నారు. కాలం చాలా విలువైనదని, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు అందిస్తున్న సేవలు అభినందనీయన్నారు. అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే తన ధ్యేయమన్నారు. అన్ని వసతులు అందించామని, ఉద్యోగాలు సాధించి హాస్టల్‌కు, మీ తల్లిదండ్రులకి మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఉపాధ్యక్షులు బింగి గణేష్ గౌడ్, రంగ కష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగాల జ్ఞానేశ్వర్ గౌడ్ , కోశాధికారి సోమా శైలజ గౌడ్ , సంయుక్త కార్యదర్శులు టి.వి.రాజుగౌడ్, స్వప్న గౌడ్, ఎంసీ మెంబెర్స్ ప్రభు గౌడ్, ప్రతాప్ లింగం గౌడ్, ఎం.అశోక్ గౌడ్ విక్రమ్ గౌడ్ హాస్టల్ జీవిత కాల సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్ డే సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సత్యనారాయణ, పల్లె లక్ష్మణరావు గౌడ్

శంకర్ సామాజిక సేవలు యువతకు స్ఫూర్తి: గోరటి



చేవూరి శంకర్‌ను సన్మానిస్తున్న గోరటి వెంకన్న

చంపాపేట: మదర్ థెరీసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చేవూరి శంకర్ అందిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి గోరటి వెంకన్న అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డి డివిజన్ వైదేహీనగర్ కాలనీలో ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శంకర్ అభినందన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కరోనా కష్ట కాలంలో శంకర్ మదర్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజలలో వ్యాక్సిన్ పై అవగాహన కల్పించారని, తన స్వంత వాహనంపై కాలనీ వాసులను వ్యాక్సిన్ కేంద్రాలకు తరలించారని గుర్తుచేశారు. ఇప్పటికీ కరోనా ముప్పు తొలగిపోలేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా చేవూరి శంకర్‌ను ఆయన ఆకృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుధాకర్‌తో కలసి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. కోయి కోటేశ్వరరావు, టీవీ సీరియల్ నటుడు బీడీఎల్ సత్యనారాయణ, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

సమున్నత భారత్ కోసం ప్రధాని మోదీ కృషి

ఎమ్మెల్యే ఈటల రాజేందర్

అల్వాల్: ఆకలి కేకలు లేని, ఆత్మహత్యలు లేని భారతదేశం కోసం నరేంద్రమోదీ పనిచేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి 'కాన్స్‌ప్రసీ అగైనెస్ట్ భారత్–హౌ టూ కౌంటర్' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ పాలసీలు, స్కీంలు అన్ని ప్రజల కోసమే ఉంటాయి తప్ప ఓట్ల కోసం కాదన్నారు. అది మెచ్చే 303 సీట్లు దేశ ప్రజలు ఇచ్చారన్నారు. బీజేపీ ఒక వర్గానికి కొమ్ము కాస్తుందన్న భావన పోయిందన్నారు. నరేంద్రమోదీ గొప్పతనాన్ని మసక పరిచే ప్రయత్నం కొందరు చేస్తున్నారన్నారు. గుజరాత్ అల్లర్లు తెర మీదకు తెస్తున్నారన్నారు. మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. ప్రాంతీయ పార్టీల ముసుగులో కుటుంబ పాలనతో ప్రజాస్వామ్యాన్ని చెరబడుతున్నారని ఈటల దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ ప్రధానిని అసెంబ్లీ వేదికగా వ్యక్తిగతంగా విమర్శించడం మంచి సంప్రదాయం కాదన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం మీద విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. తెలంగాణ గడ్డ మీద జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తామన్నారు. కాషాయం జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు, సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రంజాన్ వేడుకల్లో సినీ ప్రముఖులు





రంజాన్ పండుగ నేపథ్యంలో బంజారాహిల్స్‌లో సినీ నటి సౌమ్య జాను ఏర్పాటు చేసిన వేడుకల్లో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సినీ నటులు బాలాజీ మధుమిత దంపతులు, నందిని రాయ్, అశ్విని శ్రీ, రితికా, అలేఖ్య, శ్రావన్ రాఘవేంద్ర, కుమనన్ సేతు రామణ్, శ్రీధర్ రావు, క్రిష్ బండిపల్లి, జబర్దస్త్ ఫణి, మహేష్, బిగ్ బాస్ జెస్సీ, సినీ నిర్మాత సతీష్ తదితర సినీ, రాజకీయ, వ్యాపార, వైద్య రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి సౌమ్య జాను మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకని, నగరంలోని సోదర భావానికి ప్రతీకగా ఈ వేడుకలు జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్–బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'ఆహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోకాళ్ల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

"మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్లు వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.


కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొరలో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సెనిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్‌ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్): మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ–ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రొటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం, చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముమ్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ: మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్: ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను ఇస్తున్నాయి.



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్షపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్–బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.



అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.

ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.



సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీ జోడీ

బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్-లుకాస్ మీడ్లెర్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్, యూకీ ఐదు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్ టోర్నీల్లో మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.

సురేఖ 'డబుల్' ధమాకా

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్ యి సువాన్-చెన్ చి లున్ (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ 159-154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సురేఖ 149-146తో (30-30, 30-29, 29-29, 30-29, 30-29) ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148-146తో (29-29, 30-30, 30-30, 29-29, 30-28) ప్రపంచ నంబర్‌వన్ ఇలా గిబ్సన్ (బ్రిటన్)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్ నుంచి ఆడుతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్ బదోని, దీపక్ హుడా రనౌటయ్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్ గూటికి చేరింది.



ఆయుశ్ బదోనిని రనౌట్ చేస్తున్న మోహిత్ శర్మ

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్
- రాహుల్ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా

లక్నో: మోహిత్ శర్మ స్వింగ్ (2/17)తో గుజరాత్ టైటాన్స్ కింగ్ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్ జెయింట్స్ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్యా, స్టొయినిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

సాహాతో శుబ్‌మన్ గిల్ (0) 'ఇంపాక్ట్' డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్ పాండ్యా అవుట్ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్ (3), విజయ్ శంకర్ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్ రాహుల్

రాహుల్ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్ జోడీ కెప్టెన్ రాహుల్, కైల్ మేయర్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) పవర్ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్ తర్వాత కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్ పూరన్ (1) విఫలమైనా... రాహుల్ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్టంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్ చివరి ఓవర్ అనూహ్యంగా సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్, స్టొయినిస్ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్ బదోని (8), దీపక్ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) హుడా (బి) కృనాల్ 47; గిల్ (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; హార్దిక్ పాండ్యా (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 66; అభినవ్ (సి) నవీనుల్ హఖ్ (బి) మిశ్రా 3; విజయ్ శంకర్ (బి) నవీనుల్ హఖ్ 10; మిల్లర్ (సి) హుడా (బి) స్టొయినిస్ 6; తెవాటియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్:** నవీనుల్ హఖ్ 4-0-19-1, కృనాల్ పాండ్యా 4-0-16-2, అవేశ్ ఖాన్ 3-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-49-0, స్టొయినిస్ 3-0-20-2, అమిత్ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) జయంత్ (బి) మోహిత్ 68; మేయర్స్ (బి) రషీద్ ఖాన్ 24; కృనాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 23; పూరన్ (సి) హార్దిక్ (బి) నూర్ అహ్మద్ 1; బదోని (రనౌట్) 8; స్టొయినిస్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; దీపక్ హుడా (రనౌట్) 2; ప్రేరక్ మన్కడ్ (నాటౌట్) 0; రవి బిష్ణోయ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్:** షమీ 3-1-18-0, జయంత్ 4-0-26-0, రషీద్ ఖాన్ 4-0-33-1, మోహిత్ శర్మ 3-0-17-2, నూర్ అహ్మద్ 4-0-18-2, హార్దిక్ పాండ్యా 1-0-7-0, రాహుల్ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు



స్యామ్ కరన్

- అదరగొట్టిన స్యామ్ కరన్, హర్‌ప్రీత్
- కీలక వికెట్లు తీసిన అర్ష్‌దీప్
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- గ్రీన్, సూర్యకుమార్ శ్రమ వృథా

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్ సింగ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్, పియూష్ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 25 నాటౌట్; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్ ఫినిషింగ్‌లో అర్ష్‌దీప్ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్ష్‌దీప్ 2 పరుగులే ఇచ్చి తిలక్ వర్మ (3), నేహల్ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.



అర్ష్‌దీప్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	6	4	2	8	0.212
పంజాబ్	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: షార్ట్ (సి) చావ్లా (బి) గ్రీన్ 11; ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) కిషన్ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్ (బి) గ్రీన్ 41; కరన్ (సి అండ్ బి) ఆర్చర్ 55; జితేశ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 25; షారుక్ నాటౌట్ 0; హర్‌ప్రీత్ బ్రార్ రనౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్ 3-0-41-1, గ్రీన్ 4-0-41-2, ఆర్చర్ 4-0-42-1, పీయూష్ చావ్లా 3-0-15-2, హృతిక్ షోకీన్ 3-0-24-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) లివింగ్‌స్టోన్ 44; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 1; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 67; సూర్యకుమార్ యాదవ్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 57; టిమ్ డేవిడ్ (నాటౌట్) 25; తిలక్‌వర్మ (బి) అర్ష్‌దీప్ సింగ్ 3; నేహల్ వధేరా (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. **బౌలింగ్:** షార్ట్ 1-0-7-0, అర్ష్‌దీప్ 4-0-29-4, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-44-1, రాహుల్ చహర్ 4-0-42-0, లివింగ్‌స్టోన్ 2-0-23-1.

'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ' ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ సీఎస్ఆర్ అసోసియేట్, పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ'ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ఔత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా కొటక్ మహీంద్ర బ్యాంక్ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్ మహీంద్ర బ్యాంక్ హోల్ టైమ్ డైరెక్టర్ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రీషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్ ప్రోగ్రామ్, బ్యాడ్మింటన్ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్ర గ్రూప్ ప్రెసిడెంట్, సీఎఫ్ఓ జైమిన్ భట్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్, సిక్కి రెడ్డి, శ్రీకాంత్, సాయి ప్రణీత్, పుల్లెల గాయత్రి, ట్రిసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ అర్జున్



అస్తానా (కజకిస్తాన్): సాటీ జుల్దిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్ గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్లిక్ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్ 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్ ఫాలో అవుతున్నా! - అఖిల్

"30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్ ఓకే చేయాలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేక పోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే 'ఏజెంట్' స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్ చేయలేదు" అన్నారు అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు.



- నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' టైమ్‌లో సూరిగారు (సురేందర్ రెడ్డి) 'ఏజెంట్' కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్ చేశాం. అయితే స్క్రిప్ట్ పూర్తి కావడానికి, నా లుక్ మార్చుకోవడం, లాక్‌డౌన్ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది.
- 'ఏజెంట్'లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. 'ఏజెంట్' ఒక మంచి స్పై డ్రామా. సురేందర్ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్ ట్యూన్ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్ సీన్ కోసం చాలా కష్టపడ్డాను.
- సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్ 28న 'అడవి రాముడు', 'పోకిరి', 'బాహుబలి' వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్ సినిమాలు విడుదలైన ఏప్రిల్ 28న 'ఏజెంట్' సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను.
- నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్ ఏదీ ఫైనలైజ్ కాలేదు. 'ఏజెంట్' సినిమా ట్రైలర్ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్ అయ్యారు.

జై శ్రీరామ్.. జై శ్రీరామ్



ప్రభాస్

'నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం' అంటూ 'జై శ్రీరామ్' నామం ప్రతిధ్వనించేలా 'ఆదిపురుష్' చిత్రం నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదిపురుష్'. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల 'జై శ్రీరామ్' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది.

ఐ హేట్ లవ్



సుధీర్‌బాబు

''దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట', 'ఐ హేట్ లవ్' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'మామా మశ్చీంద్ర' టీజర్. సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



ఇవానా, ఆశిష్

'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్'. కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్ లవ్‌స్టోరీలో ఆశిష్ ఓల్డ్ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్ ఎనలిస్ట్ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

బాబు కుట్ర బట్టబయలు

- యర్రగొండపాలెంలో రాళ్ల దాడికి పురిగొల్పి అడ్డంగా దొరికిపోయిన వైనం
- టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టిన చంద్రబాబు
- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న దళితులపై రాళ్ల దాడులు
- ఫొటోలు, వీడియోలు బయటపడటంతో ఆత్మరక్షణలో టీడీపీ.. దాడి చేసింది బాబు సామాజికవర్గం నేతలే



రాళ్లదాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు చేసిన కుట్రలు, అకృత్యాలు బట్టబయలయ్యాయి. శాంతియుతంగా నిరసన వ్యక్తంచేస్తున్న దళితులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు రాళ్ల దాడిచేసి అడ్డంగా దొరికిపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడే కార్యకర్తలను, నాయకులను రెచ్చగొట్టడంతో నియోజకవర్గంలోని సీనియర్ నాయకుడు, చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన డాక్టర్ మన్నే రవీంద్ర, అతని అనుచరులే రోడ్డుపక్కన నక్కి, దాక్కొని దళితులపై రాళ్లతో దాడిచేశారు. అదికూడా యర్రగొండపాలెంలోని మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటిపక్కనే నక్కి మరీ రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడికి సంబంధించి టీడీపీ కార్యకర్తలు, నాయకుల ఫొటోలు, వీడియోలు శనివారం బయటపడ్డాయి. ఆధారాలతో సహా వెలుగుచూడడంతో టీడీపీ నేతలతోపాటు ఆ పార్టీ పెద్దలు ఖంగుతిన్నారు. వారితో రాళ్ల దాడి చేయించడమే కాక.. ఆ పని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలదేనని స్వయానా చంద్రబాబు ప్రకటించడంతో వారి పరిస్థితి నోట్లో పచ్చివెలక్కాయ పడినట్లయింది. ఇక పచ్చ మీడియా అయితే రెచ్చిపోయి ఇదంతా అధికార వైఎస్సార్‌సీపీ వాళ్ల పనేనని ప్రముఖంగా ప్రచురించాయి.

దొంగే దొంగ.. దొంగ అన్నట్లు..

కుట్రలు పన్నడం.. వాటిని పక్క పార్టీ వాళ్ల మీదకు నెట్టడం ఇదీ చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. యర్రగొండపాలెంలో జరిగింది ఇదే. చంద్రబాబు మూడోరోజు పర్యటన సందర్భంగా శుక్రవారం యర్రగొండపాలెం వచ్చారు. ఈ సందర్భంగా.. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని ఆ వర్గం వారు పెద్దఎత్తున శాంతియుత నిరసనకు దిగారు. రోడ్డు పక్కన నిలబడి నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలు, ప్లకార్డులు, నల్ల బెలూన్లతో ప్రశాంతంగా నిరసన వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని మంత్రి సురేష్ ఒకరోజు ముందే మీడియా సమక్షంలో కూడా వెల్లడించారు. చెప్పినట్లుగానే మంత్రి సురేష్ నిరసనలో పాల్గొని దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసి దళిత రిజర్వు నియోజకవర్గంలోకి ఏ విధంగా వస్తావు అంటూ చంద్రబాబును నిలదీశారు. దీంతో చంద్రబాబులో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అంతే.. తన కారులోంచి బయటకు వచ్చి నిరసనకారుల వైపు వేలు చూపించి మరీ భయపెడుతూ రెచ్చగొట్టారు. అలాగే, టీడీపీ కార్యకర్తలను, నేతలను దళితులపై దాడికి ఉసిగొల్పారు. చంద్రబాబే రెచ్చగొట్టటంతో ఆయన సామాజికవర్గానికి చెందిన మన్నే రవీంద్ర, ఆయన ప్రధాన అనుచరులు కొందరు రెచ్చిపోయి రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో పలువురు దళితులు, వైఎస్సార్‌సీపీ నేతలు, పోలీసులు గాయపడ్డారు.

పోలీసులకు ఫిర్యాదులు..

వాస్తవాలను మరుగుపరిచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబుపై రాళ్ల దాడి చేశారంటూ ప్రకాశం జిల్లా టీడీపీ నేతలు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోపక్క.. టీడీపీ పెద్దలు గవర్నర్‌కూ ఫిర్యాదు చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. అయితే, టీడీపీ నేతలు దాడికి పాల్పడిన వీడియోలు బయటకొచ్చాయి. దీనిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. టీడీపీ వారే దాడికి పాల్పడ్డారన్న కుట్ర కోణం బయటపడటంతో ఆ పార్టీ పెద్దలు ఇప్పుడు ఆత్మరక్షణలో పడ్డారు. మరోవైపు.. టీడీపీ నేతల దాడులపై వైఎస్సార్‌సీపీ నేతలు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు కేసులు నమోదు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు యర్రగొండపాలెం పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించడంతో మొత్తం మూడు కేసులు నమోదు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ కె. కిషోర్‌కుమార్ శనివారం మీడియాకు తెలిపారు. యర్రగొండపాలెంలో శుక్రవారం రోడ్ షో సందర్భంగా బహిరంగ సభకు అనుమతిచ్చిన ప్రాంతంలో కాకుండా ఎక్కువ జనసంచారం ఉన్న ప్రాంతంలో సభను పెట్టారని, దీనిపై ఆ పార్టీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



చొప్పదండి: వెదురుగట్టులో వడగళ్లను ఎత్తిపోస్తున్న మహిళా రైతు



అబ్బాయిపాలెంలో రాలిన మామిడి కాయలను చూపిస్తున్న కౌలు రైతు మల్లయ్య

ఒక్క కాయ కూడా మిగల్లేదు..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన బోయిని మల్లయ్య రూ.6 లక్షలు వెచ్చించి 34 ఎకరాల మామిడి తోటలను కౌలుకు తీసుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, వానకు మామిడి కాయలన్నీ నేలరాలిపోయాయి. చెట్లపై ఒక్క కాయ కూడా మిగలలేదని.. మొత్తంగా నష్టపోయాననీ మల్లయ్య కన్నీటి పర్యంతమయ్యాడు.

అకాల వర్షం.. పంట నష్టం

- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వానలు
- నేల రాలిన మామిడి.. తడిసిపోయిన ధాన్యం
- వేల ఎకరాల్లో పంట నష్టం..

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల శుక్రవారం అర్ధరాత్రి, శనివారం సాయంత్రం గాలివానలు బీభత్సం సృష్టించాయి. పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో మామిడి నేల రాలింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో వర్షార్పణం అయిందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నేల రాలిన మామిడి..

అకాల వర్షాలతో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ శివారు బంజర, లచ్చ తండాల్లో, బలపాల గ్రామంలో వందల ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మరిపెడ మండలం అబ్బాయిపాలెం, తండధర్మారం, పురుషోత్త మాయగూడెం, ఎల్లెర్ల, చిల్లంచర్ల, రాంపురం, వీరారం గ్రామాల్లోనూ మామిడి కాయలు నేలరాలాయి. డోర్నకల్-గొల్లచర్ల-చిలుకోడు రహదారుల్లో హరితహారం చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో శుక్రవారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 11,241 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి మండలాల పరిధిలో సుమారు 700 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మామిడి దెబ్బతిన్నాయి.

తడిసిపోయిన ధాన్యం

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం వానకు కరీంనగర్ మండలంలో పది గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు టార్పాలిన్లు కప్పినా.. ఈదురుగాలుల ధాటికి కొట్టుకుపోయాయి. ఇక చొప్పదండి, గుమ్లాపూర్, మల్లన్నపల్లి, సాంబయ్యపల్లి, రుక్మాపూర్, కొలిమికుంట, చాకుంట, భూపాలపట్నం, వెదురుగట్ట గ్రామాల్లో వడగళ్ల వాన, ఈదురుగాలులకు పంటలు దెబ్బతిన్నాయి. మామిడి నేల రాలింది. జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోనూ ధాన్యం తడిసిపోయింది. వరి, మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసింది. రాశులుగా పోసిన ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడుకు చెందిన ఊడుగుల శ్రీనివాస్ (22), మరో ముగ్గురు యువకులు.. వర్షం పడుతుండటంతో ధాన్యంపై పట్టాలు కప్పడానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా వాన ఊపందుకోవడంతో ఓ ట్రాక్టర్ ట్రాలీ కింద తలదాచుకున్నారు. కానీ ట్రాలీపై పిడుగుపడి అంతా స్పృహతప్పి పడిపోయారు. కొంతసేపటికి ముగ్గురు స్నేహితులకు మెలకువ వచ్చినా.. శ్రీనివాస్ మృతి చెందాడు.

- పెద్దపల్లి జిల్లా గొల్లపల్లికి చెందిన రైతు ఆవుల మహేందర్ (33) శనివారం ధాన్యం కుప్పలపై పరదా కప్పుతుండగా పిడుగుపడింది. అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయనను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.
- జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో గీత కార్మికుడు ముత్యపు మల్లేశం (62) తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. ఒక్కసారిగా పిడుగుపడటంతో మృతి చెందాడు.
- పిడుగుపాటుతో కామారెడ్డి జిల్లా భీమారం మండలం గోవిందారంలో 20 గొర్రెలు, రాజంపేట మండలం పొందుర్తిలో 14 గొర్రెలు మృతి చెందాయి.



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరులో తడిసిన ధాన్యం

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.